సాహిత్య వారపత్రిక... గత వారం వీచిన విశేషాలు
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
నిజామాబాద్
: fb.com/vaartha Digital
Published from Nizamabad, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
19-12-2025 శుక్రవారం సంపుటి: 31 సంచిక: 318 పేజీలు: 10+4 వెల: 6.50



కపిల్ చిట్స్ తోడుంటే కనక మహాలక్ష్మి మీ వెంటే
KAPIL GROUP
కపిల్ చిట్స్
Visit Us: www.kapilchits.com
కపిల్ చిట్స్ మీ కలలకు సాకారం




గురువారం హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడుతున్న సిఎం రేవంత్.
చిత్రంలో డిప్యూటీ సిఎం భట్టి, మంత్రులు ఉత్తమ్ కుమార్, దామోదర రాజనర్సింహ, సీతక్క

# ఇది మా ప్రభుత్వ రెండేళ్ల పాలనపై తీర్పు

## గ్రామ పంచాయతీ ఎన్నికల్లో 8,335 స్థానాల్లో కాంగ్రెస్ గెలుపు

**94 నియోజకవర్గాల్లో 87 చోట్ల జయభేరి**

**2029లోను 2/3 మెజారిటీతో అధికారం**

**అసెంబ్లీలో చర్చించాకే జడ్పీటిసి, ఎంపిటిసి ఎన్నికలు**

**ప్రాజెక్టులపై అసెంబ్లీలో కెసిఆర్‌తో చర్చకు సిద్ధం**

**మీడియా సమావేశంలో సిఎం రేవంత్**

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, డిసెంబర్18:** ప్రజా ప్రభుత్వం ఏర్పడిన రెండేళ్ల తరువాత జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు సంపూర్ణ మద్దతుగా నిలిచిన ప్రజలకు ధన్య వాదాలు తెలుపుతున్నట్లు ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ప్రకటిం చారు. గ్రామ పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అద్భుతమైన ఫలితాలు సాధించాని, పంచాయతీ ఎన్నికల ఫలితాలు మా రెండేళ్ల పాలనపై తీర్పుగా భావిస్తున్నామని తెలిపారు. 12, 702 గ్రామ పంచాయతీలలో 7, 527 కాంగ్రెస్, 808 మంది కాంగ్రెస్ రెబల్స్ నెగ్గారు, మొత్తంగా 8, 335 గ్రామ పంచాయతీలలో కాంగ్రెస్, కాంగ్రెస్ రెబల్స్ గెలుచుకున్నారు. అంటే 66 శాతం కాంగ్రెస్ గెలు చుకుందని వివరించారు. పంచాయతీ ఎన్నికల ఫలితాలపై గురు వారం సాయంత్రం జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో సిఎం రేవం త్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు.ఎలాంటి లోటు పాట్లు లేకుండా పంచాయతీ ఎన్నికలు పూర్తి చేసిన అధికారులకు అభినందనలు, కాంగ్రెస్ పార్టీని ఆశీర్వదించిన తెలంగాణ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామ పంచాయతీ ఎన్నికల్లో బీఆర్ఎస్(3511-27.64 శాతం), బీజేపీ(710-5.59శాతం) కూటమిగా 4, 221 సర్పంచ్ స్థానాల్లో గెలిచారని అంటే 33 శాతం ఓట్లు సాధించారని వివరిం చారు. కమ్యూనిస్టులు(సిపిఐ, సిపిఎం), ఇతరులు 146సర్పంచ్ స్థానాల్లో గెలిచారని, అంటే 1శాతంఫలితాలు సాధించాయని పేర్కొ న్నారు. రాష్ట్రంలో కోటీ 58లక్షల 53వేల 960 మంది ఓటర్లు ఉండగా, కోటీ 35లక్షల 23వేల 137 మంది ఓటర్లు పోలింగ్‌లో పాల్గొన్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికల ఫలితాలు రెండేళ్ల ప్రజా పాలనకు ప్రజలు ఇచ్చిన తీర్పు, కంటోన్మెంట్, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లోనూ ప్రజలు కాంగ్రెస్‌కు పట్టం కట్టారని గుర్తు చేశారు. రాష్ట్రంలో 94 శాసనసభ నియోజవర్గాల్లో స్థానిక సంస్థల ఎన్నికల జరిగితే అందులో 87 శాసనసభ >>2



గురువారం మస్కట్‌లో 'ఆర్డర్ ఆఫ్ ఒమన్' పురస్కారాన్ని ప్రధాని మోడీకి అందజేస్తున్న సుల్తాన్ హైతమ్ బిన్ తారిక్

# భారత్.. ఒమన్ మధ్య స్వేచ్ఛా వాణిజ్యం

**వ్యూహాత్మక సహకారంపైనా అంగీకారం**

**ప్రధాని మోడీ సమక్షంలో ఎంఒయు**

**మోడీకి అత్యున్నత ఒమన్ పురస్కారం**

**మస్కట్, డిసెంబరు 18:** గల్ఫ్ దేశాలతో ఆర్థిక సంబంధాలను మరింత బలోపేతం చేసుకోవడానికి ఒమన్‌తో భారత్ సమగ్ర ఆర్థిక భాగస్వామ్య ఒప్పందం చేసుకుంది. ఈ క్రమంలో భారత్- ఒమన్ మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కుదిరిం ది. భారత్, ఒమన్ ప్రతినిధులు గురువారం మస్కట్‌లో ప్రధాని మోడీ సమక్షంలో ఈ డీల్ పై సంతకాలు చేశారు. వ్యూహాత్మక సహకారానికి సంబంధించిన సంయుక్త విజన్ డాక్యుమెంట్‌పైనా ఇరుదేశాలు సంతకాలు చేశాయి. అలాగే వ్యవసాయరంగ ఆవిష్కరణలు, ఆహార పరిశ్రమల విభాగంలో పరస్పర సహకారానికి సంబంధించిన ఒప్పందాన్ని కూడా భారత్- ఒమన్ కుదుర్చుకున్నాయి.సముద్ర మార్గ వారస త్వం, మ్యూజియంలు, శాస్త్ర సాంకేతిక ఆవిష్కరణలు, నైపు ణ్య వికాసం, వాణిజ్య సహకారం, వ్యవసాయ విభాగాల్లో ఒమన్‌కు చెందిన ఛాంబర్ ఆఫ్ >>2



# ఆ రూ. 15వేల కోట్ల భూమి తెలంగాణదే

## -సుప్రీం కోర్టు తీర్పు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,డిసెంబర్18:** తెలంగాణ ప్రభుత్వానికి సుప్రీంకోర్టులో భారీ ఊరట లభించింది. రూ.15 వేల కోట్ల విలువ చేసే భూములకు సంబంధించి సర్వోన్నత న్యాయస్థానం కీలక తీర్పు వెలువరించింది. రంగారెడ్డి జిల్లా వనస్థలిపురం సమీపంలోని సాహెబ్ నగర్ పరిధిలో ఉన్న సుమారు 102 ఎకరాల విలువైన భూమి ప్రభుత్వానిదేనని, అది అటవీ ప్రాంతమేనని కోర్టు స్పష్టం చేసింది. ప్రస్తుత మార్కెట్ ధర ప్రకారం ఈ భూమి విలువ దాదాపు రూ. 15,000 కోట్లు ఉంటుందని అంచనా. ఈభూమి తమదేనంటూ నిజాం, సాలార్‌జంగ్, మీరాలం వారసులమని చెప్పుకునే సుమారు 260 మందికి పైగా వ్యక్తులు గతంలో పిటిషన్లు దాఖలు చేశారు. గతంలో ఈ >>2



గ్రూప్-3 ఫలితాలను విడుదల చేస్తున్న దృశ్యం

# గ్రూప్-3కి ఎంపికైన అభ్యర్థుల జాబితా విడుదల

2

# ఫోన్ ట్యాపింగ్‌పై మరో సిట్

## సిపి సజ్జనార్ ఆధ్వర్యంలో ఏర్పాటు



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,డిసెంబర్18:** ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తులో మరో కీలక పరిణామం చోటు చేసుకుంది. హైదరాబాద్ సీపీ సజ్జనార్ ఆధ్వర్యంలో సీనియర్ ఐపీఎస్ అధికారులతో మరో సిట్‌ను ఏర్పాటు చేస్తూ తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. సిట్‌లో రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా, సిద్ధిపేట కమిషనర్ ఎస్.ఎం. విజయ్ కుమార్, మాదాపూర్ డీసీపీ రితురాజ్, మహేశ్వరం డీసీపీ నారాయణ రెడ్డి, గ్రేహౌండ్స్ గ్రూప్ కమాండర్ ఎం. రవీందర్‌రెడ్డి, రాజేంద్రనగర్ అదనపు డీసీపీ కెఎస్ రావు, జూబ్లీహిల్స్ ఏసీపీ వెంకటగిరి, టీజీ న్యాబ్ డీఎస్పీ సిహెచ్. శ్రీధర్, హైదరాబాద్ మెట్రోలో పనిచేస్తున్న నాగేందర్‌రావు సభ్యులుగా ఉన్నారు. ఇప్పటికే ఈ కేసులో ఎస్ఐబి మాజీ చీఫ్ ప్రభాకర్‌రావు పోలీసులకు లొంగిపోయిన సంగతి తెలిసిందే.

# బిజెపి ఆఫీసు ముట్టడి ఉద్రిక్తం

**కాంగ్రెస్ శ్రేణులు తరలిరావడంతో గాంధీభవన్, బిజెపి కార్యాలయం వద్ద భారీగా బలగాల మొహరింపు**

**మీనాక్షి నటరాజన్, మహేష్ కుమార్ బైఠాయింపు**

**నిరసనలు అడ్డుకున్న పోలీసులు**

2




# ఇది మా ప్రభుత్వ రెండేళ్ల పాలనపై తీర్పు

>> స్థానాల్లో కాంగ్రెస్ అత్యధిక ఫలితాలు సాధించిందని, బీఆరెస్ 6 నియోజవర్గాల్లో, బీజేపీ 1(ముధోల్) నియోజకవర్గంలో అత్యధిక ఫలితాలు సాధించాయని వివరించారు. అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే ఇప్పుడు 21 అసెంబ్లీ నియోజకవర్గాల్లో అధిక్యం సాధించాం, రెండు ఉప ఎన్నికల్లోనూ కాంగ్రెస్ స్పష్టమైన ఆధిక్యం సాధించాం, ప్రస్తుతం 66 అసెంబ్లీ స్థానాల్లో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఉన్నారన్నారు. పేదలకు మేం అందించిన సన్నబియ్యం, ఉచిత కరెంటు, సజ్జ వడ్లకు బోనస్, రూ. 500కే సిలిండర్, ఇందిరమ్మ ఇండ్లు, 200 యూనిట్ల ఉచిత కరెంట్, మహిళా సంఘాల సభ్యులకు వడ్డీ లేని రుణాలు, ఎస్సీ వర్గీకరణ అమలు, కులగణన ఇతర పథకాలతో ప్రజలు మమ్మల్ని ఆదరించారని తెలిపారు. ఆరు గ్యారంటీలతో పాటు ఏడో గ్యారెంటీగా ప్రజలకు స్వేచ్ఛను అందించాం స్వేచ్ఛాయుతమైన వాతావరణంలో గ్రామ పంచాయతీ ఎన్నికలు జరిపించామని తెలిపారు. హోదాలను అడ్డుపెట్టుకుని ఎన్నికలను ప్రభావితం చేసేలా మేం నిర్ణయం తీసుకోలేదు గెలిస్తే కళ్లు నెత్తికెక్కినట్లుగా మేం ఏనాడు వ్యవహరించలేదు ఈ ఫలితాలు మాపై మరింత బాధ్యతను పెంచాయని చెప్పారు. మహాత్మాగాంధీ ఉపాధి హామీ పథకం పేరు మార్చి పథకాన్ని నిర్వీర్యం చేసే కుట్ర బీజేపీ చేస్తోందని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కాంగ్రెస్ తోనే సాధ్యం అని చెప్పారు. ప్రజలు ప్రతిపక్షంలో కూర్చోబెట్టినా కొందరికి ఇంకా అహంకారం తగ్గలేదు ఒకాయన కడుపులో మూసీలో కాలుష్యం కంటే ఎక్కువ విషం కనిపిస్తోంది ఈ ఫలితాలుచూసే అద్భుతం అని కొందరు జబ్బలు చరుచుకుంటున్నారు అని బిఆర్ఎస్ నేతలను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. 2029లో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో కూడా ఇవే ఫలితాలు పునరావృతం అవుతాయి 2/3 వంతు సీట్లు సాధించి మళ్లీ కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్, బిజెపి కలిపి 1/3 వంతు సీట్లు వస్తాయని జోస్యం చెప్పారు. బిఆర్ఎస్, బిజెపి మధ్య అవగాహన భవిష్యత్ పొత్తుకు ఇదే నిదర్శనమని సిఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. మీ కోపంతో అసూయతో ప్రజలకు మంచి జరగకుండా అడ్డుకోవద్దు అని బిఆర్ఎస్‌ను ఉద్దేశించి అన్నారు. దేశంలోనే తెలంగాణను నెంబర్ వన్ గా తీర్చిదిద్దుతాం అని స్పష్టం చేశారు. కేసీఆర్ క్రియాశీల రాజకీయాల్లో ఉండగానే ఆయన్ను ఓడించి కాంగ్రెస్ ను అధికారంలోకి తీసుకొచ్చాం ఇప్పుడు ఆయన క్రియాశీల రాజకీయాల్లో లేరు అని చెప్పారు. కేసీఆర్‌కు సూటిగా సవాల్ విసురుతున్నా ప్రతిపక్ష నాయకుడిగా లేఖ రాయమనండి.. కృష్ణా జలాలపై ఎవరు అన్యాయం చేశారో అసెంబ్లీలో చర్చకు సిద్ధం ఎప్పుడంటే అప్పుడు ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేస్తాం అని చెప్పారు. గోదావరి, కృష్ణా జలాలపై సభలో చర్చకు సిద్ధంగా ఉన్నాం ఉమ్మడి రాష్ట్రంలో కంటే పదేళ్లలో తెలంగాణ ప్రజలకు తీరని ద్రోహం చేసింది బీఆరెస్, కేసీఆర్ అని పేర్కొన్నారు. గోదావరి, కృష్ణా జలాలపై వారు చేసిన ద్రోహం ఆధారాలతో సహా నిరూపిస్తాం అని స్పష్టం చేశారు. జెడ్పిటీసీ.ఎంపీటీసి ఎన్నికలకు సంబంధించి 42 శాతం బీసీ రిజర్వేషన్లపై ప్రజాస్వామ్య బద్ధంగా అసెంబ్లీలో చర్చ చేసి ముందుకు వెళతామని పేర్కొన్నారు. కేటీఆర్ వర్కింగ్ ప్రెసిడెంట్ గా బాధ్యతలు చేపట్టిన తరువాత జరిగిన ఏ ఎన్నికల్లోనూ బీఆర్ఎస్ గెలవలేదు కెటీఆర్‌ను తప్పించాలని హరీశ్ వర్గం సోషల్ మీడియాలో ప్రచారం మొదలు పెట్టింది అందుకే ఆ విషయం చర్చకు రాకుండా కేటీఆర్ జిల్లాల పర్యటనలు మొదలు పెట్టారు అని ఒక ప్రశ్నకు సమాధానంగా అన్నారు. కేసీఆర్ క్రియాశీల రాజకీయాల్లో ఉన్నప్పుడే ఓడించి అధికారంలోకి వచ్చామని, గజ్వేల్ నియోజకవర్గంలో మెజార్టీ గ్రామపంచాయతీలు గెలిచామన్నారు. కేసీఆర్ క్రియాశీల రాజకీయాల్లో లేరని గజ్వేల్ ప్రజలు తీర్పు ఇచ్చారని తెలిపారు. కేసీఆర్ నాయకత్వాన్ని గజ్వేల్ నియోజకవర్గ ప్రజలు తిరస్కరించారని చెప్పారు. ప్రాజెక్టులపై అసెంబ్లీలో కేసీఆర్‌తో చర్చకు సిద్ధమని సవాల్ విసిరారు. కృష్ణా, గోదావరి జలాలపై పూర్తి వివరాలతో కేసీఆర్ అసెంబ్లీకి రావాలన్నారు. కృష్ణా జాల్లో 299 టీఎంసీలకే ఒప్పుకుని సంతకం పెట్టిందెవరో ప్రజలకు తెలుసు అని అన్నారు. కృష్ణా బేసిన్‌లో ఒక్క ప్రాజెక్టుకూ కేసీఆర్ అనుమతులు సాధించలేదన్నారు. మున్సిపాలిటీ, కార్పొరేషన్ల ఎన్నికలపైనా త్వరలో నిర్ణయం. అసెంబ్లీలో ప్రతిపక్షాలతో చర్చించి నిర్ణయం తీసుకుంటాం. రిజర్వేషన్ల అంశాన్ని కూడా సభలో చర్చించి ముందుకెళ్తాం. కేటీఆర్ కాంగ్రెస్ గురించి కాకుండా హరీశ్ గురించి ఆలోచిస్తున్నారని, హరీశ్ తన వెనకాల తవ్వుతున్నారని కేటీఆర్ ఆలోచిస్తున్నారని ఆరోపించారు. కేటీఆర్ వర్కింగ్ ప్రెసిడెంట్ అయ్యాక అన్ని ఎన్నికల్లోనూ ఆ పార్టీ ఓడిపోయిందని గుర్తు చేశారు. కేటీఆర్‌ను తప్పించాలని హరీశ్ వర్గం ఇప్పటికే ప్రచారం చేస్తోందన్నారు. కేటీఆర్ నాయకత్వాన్ని మార్చాలని హరీశ్ రావు ప్రయత్నం చేస్తున్నారని ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.



గురువారం పార్లమెంటు వద్ద ఆందోళన చేస్తున్న కాంగ్రెస్ అగ్రనేతలు మల్లికార్జున ఖర్గే, సోనియా గాంధీ తదితర ఎంపీలు

## గ్రూప్-3కి ఎంపికైన అభ్యర్థుల జాబితా విడుదల

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,డిసెంబర్18:** తెలంగాణలో ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగులకు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ శుభవార్త చెప్పింది. గ్రూప్3 సర్వీసులకు సంబంధించి ప్రొవిజనల్ ఎంపిక జాబితాను గురువారం విడుదల చేసింది. మొత్తం 1,388 పోస్టులకు గాను 1,370 మంది అభ్యర్థులను ఎంపిక చేసినట్లు ప్రకటించింది. ఒక పోస్ట్ వెరిఫికేషన్ కోసం పెండింగ్‌లో ఉన్నట్లు తెలిపింది. మరో 17 పోస్టుల వివరాలను త్వరలో వెల్లడస్తామని స్పష్టం చేసింది. 2024లో 1388 పోస్టుల భర్తీకి టీజీపీఎస్సీ గ్రూప్3 నోటిఫికేషన్ జారీ చేసిన విషయం తెలిసిందే. గత ఏడాది డిసెంబర్ 17,18 తేదీల్లో ఈ పోస్టులకు రాతపరీక్షలు నిర్వహించారు. అయితే గ్రూప్1, 2 వివాదాలు, పలు కోర్టు కేసుల కారణంగా ఫలితాల వెల్లడిలో జాప్యం జరిగింది. తాజాగా, ఈ ఏడాది మార్చి 14న ప్రకటించిన జనరల్ ర్యాంకింగ్ లిస్ట్ ఆధారంగా ఈ ఎంపిక ప్రక్రియ చేపట్టినట్లు కమిషన్ తెలిపింది. ఇటీవల సర్టిఫికేట్ వెరిఫికేషన్ జరిగిన విషయం తెలిసిందే. ఎంపికైన వారి హాల్ టికెట్ నంబర్లను అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచామని, అభ్యర్థులు తమ వివరాలను చూసుకోవచ్చని టీజీపీఎస్సీ సూచించింది. అయితే, ప్రస్తుతం విడుదల చేసిన ఈ జాబితా కోర్టులలో పెండింగ్‌లో ఉన్న రిట్ పిటిషన్ల తుది తీర్పునకు లోబడి ఉంటుందని కమిషన్ స్పష్టం చేసింది. అభ్యర్థులు తప్పుడు సమాచారం ఇచ్చినట్లు తేలితే, వారి ఎంపికను ఏ దశలోనైనా రద్దు చేసే అధికారం కమిషన్‌కు ఉంటుందని టీజీపీఎస్సీ కార్యదర్శి డాక్టర్ ప్రియాంక ఆలా ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

## ఆ రూ. 15వేల కోట్ల భూమి తెలంగాణదే

>> వివాదంపై విచారణ జరిపిన హైకోర్టు, ప్రైవేటు వ్యక్తులకు అనుకూలంగా తీర్పునిచ్చింది. దీంతో తెలంగాణ ప్రభుత్వం హైకోర్టు తీర్పును సవాలు చేస్తూ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఈ పిటిషన్లపై సుదీర్ఘ విచారణ చేపట్టిన జస్టిస్ పంకజ్ మిత్తల్, జస్టిస్ ఎస్.వి.ఎన్. భట్టిల ధర్మాసనం తాజాగా తుది తీర్పును వెలువరించింది.సాహెబ్ నగర్‌లోని ఆ 102 ఎకరాల భూమిపై ప్రైవేటు వ్యక్తులకు ఎటువంటి యాజమాన్య హక్కులు లేవని ధర్మాసనం తేల్చి చెప్పింది. ఇది పూర్తిగా అటవీ భూమి అని.. దీనిపై రాష్ట్ర ప్రభుత్వానికే పూర్తి అధికారాలు ఉంటాయని స్పష్టం చేసింది. ప్రైవేటు వ్యక్తులు దాఖలు చేసిన పిటిషన్లను కొట్టి వేస్తూ, ప్రభుత్వ వాదనతో ఏకీభవించింది. ఈ తీర్పుతో వేల కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ ఆస్తి అన్యాక్రాంతం కాకుండా దక్కినట్లయిం ది. అంతేకాకుండా ఈ తీర్పు వెలువడిన ఎనిమిది వారాల్లోపు సదరు 102 ఎకరాల భూమిని రిజర్వ్ ఫారెస్ట్‌గా నోటిఫై చేయాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని సుప్రీంకోర్టు ఆదేశించింది. నోటిఫికేషన్ ప్రక్రియ పూర్తి చేసిన తర్వాత, దానికి సంబంధించిన కాపీని సుప్రీంకోర్టు రిజిస్ట్రీకి సమర్పించాలని కూడా సూచించింది.

## డిఒపిటికి ఇప్పటికే రెండు సార్లు లేఖలు రాశాం

### ఫార్ములా ఇ-కార్ రేసు కేసు దర్యాప్తు సిఎం రేవంత్ కీలక వ్యాఖ్యలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,డిసెంబర్18:** రాష్ట్ర రాజకీయాల్లో సంచలనంగా మారిన ఫార్ములా ఈ కార్ రేస్‌కేసుపై దర్యాప్తు జరుగుతోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు. ఈ కేసులో ఏ2 నిందితుడిగా ఉన్న సీనియర్ ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్ విచారణకు అనుమతి అవసరం అన్నారు. అనుమతి కోసం ఇప్పటికి డీవోపీటీకి రెండు సార్లు లేఖ రాశామని అక్కడి నుంచి అనుమతి రాగానే చర్యలు ఉంటాయన్నారు. ఈ కేసులో కెటీఆర్ వరకు అనుదుతులు వచ్చాయన్నారు. గురువారం జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో మీడియా ప్రతినిధులతో చిట్ చాట్ నిర్వహించిన రేవంత్ రెడ్డి ప్రొసీజర్ ఫాలో అవ్వాలనేదే మా పాలసీ అని స్పష్టం చేశారు. దిగ్గజ ఫుట్ బాల్ ప్లేయర్ కార్యక్రమానికి తన మనుకడిని తీసుకురావడంపై రేవంత్ రెడ్డి స్పందించారు. కేసీఆర్ పిల్లల లాగా మేం పబ్బులకు తిప్పట్లేదన్నారు.నా మనువడిని ప్లేయర్ ని చేయాలనీ ఉంది. ఎవరికి ఏది ఇష్టమో అది చేస్తారు. అందుకే ఫుట్ బాల్ ఆడించాలనే నా మనువడిని తీసుకెళ్లానని చెప్పారు. మెసీ ఈవింట్‌తో రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధం లేదని ఇది పూర్తిగా ప్రైవేట్ కార్యక్రమం అని క్లారిటీ ఇచ్చారు.

మెస్సీ ఈవెంట్‌కు తాను కూడా గెస్ట్‌గా మాత్రమే వెళ్లానన్నారు. సింగవేణి యాజమాన్యల అడ్వర్‌టైజ్‌మెంట్ ఇచ్చింది. పైగా ఈవెంట్‌కు గురుకుల పాఠశాలల దళిత,గిరిజన పిల్లలు హాజరై ఫుట్‌బాల్ తనతో పాటు సింగరేణి తరఫున ఆడారని గుర్తు చేశారు. ఫుట్‌బాల్ ఆడించడానికి మాత్రమే మనవడితో వెళ్లానని చెప్పాడు. చాలా మంది ఉద్యోగులు ఫేక్ ఆధార్ కార్డులు ఇచ్చారని సిఎం అన్నారు. దొంగ ఆధార్ కార్డులలపై విచారణ చేయిస్తానని ఫేక్ ఆధార్ కార్డులతో ఉద్యోగాలు పొందిన వారిపై దర్శలు తప్పవని హెచ్చరించారు. ఈ వ్యవహారంపై ఫోరెన్సిక్ ఆడిట్ చేయిస్తానని చెప్పారు.

## స్పీకర్ నిర్ణయంపై బిఆర్ఎస్ నేతల మాటలు అవగాహన రాహిత్యం

### ఉపాధి హామీ పథకానికి గాంధీ పేరు తొలగించడం దారుణం: సిఎం రేవంత్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, డిసెంబర్ 18:** అసెంబ్లీ స్పీకర్ నిర్ణయంపై బీఆర్ఎస్ నేతల మాటలు వారి అవగాహన రాహిత్యానికి నిదర్శనమేనని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. రాజ్యాంగంపై అవగాహన లేనట్లుగా బీఆర్ఎస్ నేతలు మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం సాయంత్రం జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో ఆయన మాడియాతో మాట్లాడుతూ పలు ప్రశ్నలకు సమాధానం ఇచ్చారు. సొంత పార్టీ ఎమ్మెల్యేలనే తమవారు కాదని బీఆర్ఎస్ నేతలు అనటం హాస్యాస్పదమని అన్నారు. హరీశ్‌రావు 37 మంది బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఉన్నాం, చర్చకు సమయం ఎక్కువ కావాలని అసెంబ్లీలో చాలా సార్లు అడిగారని, అసెంబ్లీ సమావేశాలు ముగిసన తర్వాత విడుదలయ్యే బులిటెన్‌లో కూడా బిఆర్ఎస్ ఎమ్మెల్యేల సంఖ్య స్పష్టంగా 37 ఉంటుందని, పైగా పార్టీ వీడలేదని చెబుతున్న ఎమ్మెల్యేల నుంచి నెలకు రూ.5వేల కూడా ఖర్చుల కోసం ఆ పార్టీ కార్యాలయం తీసుకుంటుంది కదా అన్నారు ప్రధాని మార్పు గురించి నాకు ఎలాంటి సమాచారం లేదని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. ఉపాధి హామీ పథకానికి మహాత్మాగాంధీ పేరును తొలగించటం దారుణమని సీఎం రేవంత్ రెడ్డి ఆగ్రహించారు. కేంద్రంలోని బీజేపీ రాహుల్ గాంధీపై కోపంతో రాజకీయం చేస్తోందని ధ్వజమెత్తారు. గాంధీ అనే పేరు ఎక్కడా కనిపించకూడదని కేంద్రంలోని బీజేపీ దురాలోచన అని విమర్శించారు.

### వారం - వర్జ్యం

19-12-2025, శుక్రవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
మార్గశిరమాసం, దక్షిణాయణం
హేమంత ఋతువు, కృష్ణపక్షం
●అమావాస్య పూర్తి
జ్యేష్ఠ రా.10.50, మూల కార్తె
వర్జ్యం : మ.12.21-2.07
దు.ఉ.8.45-9.30
2) మ.12.28-1.13
రాహుకాలం - ఉ.10.30-12.00

### వార్తాఫలం

**మేషం:** ఉద్యోగంలో నూతన బాధ్యతలు సక్రమంగా నిర్వహించి పై అధికారుల ప్రశంసలు పొందుతారు. వస్త్రలాభం.

**వృషభం:** నూతన వ్యాపారాలు పరిశ్రమలను ప్రారంభిస్తారు. మిత్రుల కలయికతో విందు, వినోదాలు పాల్గొంటారు.

**మిథునం:** ప్రముఖవ్యక్తి ద్వారా ఒక ముఖ్యమైన వ్యవహారాన్ని విజయవంతంగా పూర్తిచేస్తారు. వ్యాపారాలు అభివృద్ధి చెందుతాయి.

**కర్కాటకం:** పనులు వాయిదా పడే సూచనలు ఉన్నాయి. మిత్రులు ఒత్తిడి వలన కొంత బాధకలుగుతుంది.

**సింహం:** కుటుంబంలో శుభకార్యాలు జరిగే అవకాశాలు ఉన్నాయి. విలువైన వస్తువులు కొనుగోలు చేస్తారు. మిత్రుల కలయిక.

**కన్య:** ఓర్పుతో, ధైర్యముతో చేయవలసిన పనిని సఫలము చేయగలుగుతారు. సంఘంలో ప్రత్యేక గౌరవం పొందుతారు.

**తుల:** విధి నిర్వహణలో గాని, వ్యాపారములో గాని మార్పులు జరుగవచ్చును. క్రయ విక్రయాలలో లాభాలు.

**వృశ్చికం:** రాజకీయాలు, సంఘములు, యూనియన్‌లు మొదలగు కార్యక్రమాలకు అనుకూలకాలము. క్రయ విక్రయాలలో లాభాలు.

**ధనుస్సు:** వైరి వర్గంలోని అనైక్యత మీకు లాభిస్తుంది. మొండి బాకీలు రాబట్టుకోవడానికి కొత్త విధానాలు అవలంభిస్తారు.

**మకరం:** ముఖ్యమైన విషయాలలో పెద్దల సలహాలు తీసుకుంటారు. కొన్ని అవకాశాలు అప్రయత్నంగా కలిసివస్తాయి.

**కుంభం:** కార్యాలయాలలో సహోద్యోగుల సహాయ సహకారాలు అందిస్తారు. వ్యాపారాలు అభివృద్ధి చెందుతాయి.

**మీనం:** స్పెక్యులేషన్‌కు దూరంగా ఉండండి. ప్రయాణాలు లాభసాటిగా సాగుతాయి. ఆరోగ్యం జాగ్రత్త.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్



గురువారం మస్కట్‌లో ఒమన్ సుల్తాన్ హైతమ్ బిన్ తారిక్‌తో భేటీ అయిన ప్రధాని మోడీ

## భారత్.. ఒమన్ మధ్య స్వేచ్ఛా వాణిజ్యం

>> కామర్స్, భారత్‌కు చెందిన కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సీఐఐ) నాలుగు అవగాహనా ఒప్పందాలను కుదుర్చుకున్నాయి. ఇరుదేశాల మధ్య ఆర్థిక సంబంధాలు స్థిరంగా విస్తరిస్తున్న తరుణంలో ఈ ఒప్పందాలు జరిగాయి. ఒమన్‌కు 20 ఏళ్లలో ఇది మొదటి స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం. ఈ ఒప్పందం ద్వారా భారతీయ వస్తువులకు ఒమన్ మార్కెట్‌లో పన్ను రాయితీలు లభించడంతో పాటు ఎగుమతులు పెరుగుతాయి. దీనివల్ల మన దేశంలోని రైతులు, వ్యాపారులు, ఎగుమతిదారులకు భారీ లాభాలు చేకూరుతాయి. అలాగే పెట్టుబడులు పెరగడం వల్ల కొత్త ఉద్యోగ అవకాశాలు కూడా లభిస్తాయి. ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక పరిస్థితులు మారుతున్న వేళ వస్తువుల సరఫరా ఆగిపోకుండా ఉండేందుకు ఈ స్నేహపూర్వక ఒప్పందం ఎంతో కీలకం. భారత్, ఒమన్ మధ్య 2024 ఆర్థిక సంవత్సరంలో ద్వైపాక్షి క వాణిజ్యం 8.947 బిలియన్ డాలర్లుగా ఉండగా, 2025 ఆర్థిక సంవత్సరంలో ఇది 10.613 బిలియన్ డాలర్లకు పెరిగింది. అదే సమయంలో ఒమన్ లో 6,000 కంటే ఎక్కువ భారత్‌ఒమన్ సంయుక్త సంస్థలు పనిచేస్తుండటంతో పెట్టుబడి సంబంధాలు కూడా బలంగా ఉన్నాయి. ప్రస్తుతం 80 శాతానికి పైగా భారతీయ వస్తువులు సగటున 5 శాతం సుంకంతో ఒమన్‌కు ఎగుమతి అవుతున్నాయి. అయితే కొన్ని రకాల మాంసాలు, మద్యం, పొగాకు వంటి ఎంపిక చేసిన ఉత్పత్తులపై సుంకాలు సున్నా నుంచి 100 శాతం వరకు ఉన్నాయి.

**వైవిధ్యమే భారతీయ సంస్కృతికి బలమైన పునాది**

"భారతీయులు ఎక్కడికి వెళ్లినా వైవిధ్యాన్ని గౌరవిస్తారు. ఆ వైవిధ్యమే భారతీయ సంస్కృతికి బలమైన పునాది" అని ప్రధానమంత్రి నరేంద్రమోడీ ఉద్ఘాటించారు. గత 11 ఏళ్లలో భారత్ తన ఆర్థిక డీఎన్ఏను మార్చుకుందని అన్నారు. ఈ మార్పు వల్లే ప్రపంచంలోని అత్యంత పోటీతత్వ మార్కెట్లలో ఒకటిగా భారత్ ఎదిగిందన్నారు. ద్వైపాక్షిక స్వేచ్ఛా వాణిజ్యాన్ని పెంచేందుకు భారత్ కుదుర్చుకుంటున్న సమగ్ర ఆర్థిక భాగస్వామ్య ఒప్పందాలు (సిఇపిఎ) భాగస్వామ్య దేశాల్లో కొత్త విశ్వాసాన్ని నింపాయని పేర్కొన్నారు. గురువారం ఒమన్ రాజధాని మస్కట్‌లో నిర్వహించిన భారత్- ఒమన్ బిజినెస్ ఫోరం సదస్సులో ప్రధాని మోడీ మాట్లాడుతూ, "ఈ సదస్సు భారత్-ఒమన్ భాగస్వామ్యానికి కొత్త దిశను, వేగాన్ని అందిస్తుందని విశ్వసిస్తున్నా. ఇరుదేశాల భాగస్వామ్యం కొత్త ఎత్తులను అందుకుంటుందని ఆశిస్తున్నా. గత 11 ఏళ్లలో భారత్ కేవలం విధానాలనే మార్చుకోలేదు. తన ఆర్థిక డీఎన్ఏను కూడా మార్చుకుంది. దివాలా బ్యాంక్ రప్టీ కోడ్(ఐబీసీ), జీఎస్‌టీ వంటి విప్లవాత్మక చొరవల ద్వారా భారత్ వికాసం దిశగా అడుగులు వేసింది. జీఎస్‌టీ వ్యవస్థ వల్ల యావత్ భారత్‌లోని మార్కెట్ ఏకీకరణ జరిగింది. దివాలా బ్యాంక్ రప్టీ కోడ్ వల్ల సంస్థలకు ఆర్థిక క్రమశిక్షణ పెరిగింది. దీనివల్ల వాటి వ్యాపార కార్యకలాపాల్లో పారదర్శకత మెరుగుపడింది. దీనివల్ల భారత మార్కెట్‌పై పెట్టుబడిదారులకు విశ్వాసం పెరిగింది" అని వివరించారు.

ఒమన్‌లోని ప్రవాస భారతీయులతో మస్కట్ నగరంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలోనూ ప్రధాని మోడీ ప్రసంగించారు. దీపావళి పండుగకు యునెస్కో 'సాంస్కృతిక వారసత్వ' ట్యాగ్ లభించడంపై ఆయన హర్షం వెలిబుచ్చారు. ఇప్పుడు భారతీయ దివ్వెలు కేవలం భారతీయుల ఇళ్లనే కాకుండా, యావత్ ప్రపంచానికి వెలుగులను పంచుతాయని మోడీ వ్యాఖ్యానించారు.ప్రధానమంత్రి నరేంద్రమోడీ జోర్డాన్, ఇథియోపియా, ఒమన్ దేశాల పర్యటన గురువారంతో ముగిసింది. ఒమన్‌తో వాణిజ్య ఒప్పందంపై చర్చలు, సంతకాలు అనంతరం ప్రధాని మోడీ భారత్‌కు తిరిగి వచ్చేశారు.

## ఎపి సిఎం చంద్రబాబుకు 'బిజినెస్ రిఫార్మర్ ఆఫ్ ది ఇయర్' అవార్డు

**విజయవాడ,డిసెంబరు 18,ప్రభాతవార్తప్రతినిధి:** సీఎం చంద్రబాబుకు బిజినెస్ రీఫార్మర్ ఆఫ్ ది ఇయర్ అవార్డు లభించింది. ఇస్తున్నట్టు ఎకనామిక్ టైమ్స్ ప్రకటిం చింది.. ఆంధ్రప్రదేశ్‌లో వ్యాపార అనుకూల విధానాల అమలు, పారిశ్రామిక సంస్కరణలకు గానూ ఈ అవార్డును అందిస్తున్నట్లు ఆ పత్రిక వెల్లడించింది. మార్చిలో నిర్వహించనున్న ప్రత్యేక కార్యక్రమంలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ చేతుల మీదుగా ఈ అవార్డును చంద్రబాబుకు ప్రదానం చేయ నున్నారు. ఈ అవార్డును దేశంలోని ప్రముఖ పారిశ్రామిక వేత్తలు, ఆర్థిక నిపుణులు, న్యాయవేత్తలతో కూడిన అత్యున్నత స్థాయి జ్యూరీ ఎంపిక చేసింది. ఈసారి జ్యూరీలో భారతీ గ్రూప్ చైర్మన్ సునీల్ భారతీ మిట్టల్, జేఎస్‌డబ్ల్యూ గ్రూప్ చైర్మన్ సజ్జన్ జిందాల్, కోటక్ మహీంద్రా బ్యాంక్ వ్యవస్థాపకులు ఉదయ్ కోటక్, నారాయణ హెల్త్ వ్యవస్థాపకులు డాక్టర్ దేవిశెట్టి, సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వి, టాటా ట్రస్ట్స్ చైర్మన్ నోయెల్ టాటా వంటి ప్రముఖులు సభ్యులుగా ఉన్నారు. జ్యూరీకి డెలాయిట్ సంస్థ సలహాదారుగా వ్యవహరిస్తోంది. ఈ అవార్డును 2024 లో కేంద్రమంత్రులు అశ్వినీ వైష్ణవ్, 2023లో ఎస్. జైశంకర్, 2021లో నిర్మలా సీతారామన్, 2019లో మహారాష్ట్ర మాజీ సీఎం దేవేంద్ర ఫడణవీస్, 2017లో కేంద్ర మాజీ మంత్రి అరుణ్ జైట్లీ, 2015లో పీయూష్ గోయల్ వంటి వారు అందుకున్నారు. ప్రతిష్టాత్మక అవార్డు అందుకోవడంపై ప్రముఖులు, మంత్రి వర్గ సహచరులు ముఖ్యమంత్రికి శుభాకాంక్షలు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబును ఎకనామిక్ టైమ్స్ సంస్థ ‘బిజినెస్ రీఫార్మర్ ఆఫ్ ద ఇయర్థ్ అవార్డు వరించడం ఆంధ్రప్రదేశ్‌కు గర్వకారణమని మంత్రి లోకేశ్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి, తమ కుటుంబానికి ఇది ఎంతో ప్రతిష్టాత్మకమని ఆయన అన్నారు. దేశంలో సంస్కరణల ప్రయాణాన్ని స్పష్టత, ధైర్యం, స్థిరత్వంతో ముందుకు తీసుకెళ్లిన అరుదైన నాయకుల్లో చంద్రబాబు ఒకరని జ్యూరీ ప్రశంసించిందని తెలిపారు.

**ఇటువంటి అవార్డు ఎప్పుడు తీసుకోలేదు..**

ఈ తరహా అవార్డులు ఎప్పుడూ తాను తీసుకోలేదని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. విదేశీ యూనివర్సిటీలు డాక్టరేట్ ఇస్తామన్నా సున్నితంగా తిరస్కరించానని గుర్తు చేశారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విషయంలో గతంలో గుజరాత్ మొదటిస్థానంలో నిలిచిందని, ఆ తర్వాత ప్రతీ ఏడాది ఏపీనే అగ్రస్థానంలో నిలిచిందన్నారు. ఎన్నిసార్లు నిబంధనలు మార్చినా మనమే నెంబర్ వన్‌గా ఉన్నామని తెలిపారు. మనం ఇప్పుడు గేర్ మార్చి స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానం ద్వారా పెట్టుబడులను ఆకర్షిస్తున్నామని వెల్లడించారు. 18 నెలల్లో 25 పాలసీలను తీసుకువచ్చి పరిశ్రమలను, పెట్టుబడులను తీసుకువస్తున్నామని తెలిపారు. ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పూర్తి సహకారం అందిస్తున్నారని, ఇక కేంద్రం ఇస్తున్న సహకారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ మరువకూడదని స్పష్టం చేశారు.

## బిజెపి ఆఫీసు ముట్టడి ఉద్రిక్తం



గురువారం హైదరాబాద్‌లోని బిజెపి కార్యాలయం వద్ద మొహరించిన పోలీసులు

### కాంగ్రెస్ శ్రేణులు తరలిరావడంతో గాంధీభవన్, బిజెపి కార్యాలయం వద్ద భారీగా బలగాల మొహరింపు

### మీనాక్షి నటరాజన్, మహేష్ కుమార్ బైఠాయింపు

### నిరసనలు అడ్డుకున్న పోలీసులు

**హైదరాబాద్,డిసెంబరు 18,ప్రభాతవార్త:** నేషనల్ హెరాల్డ్ కేసులో కాంగ్రెస్ అగ్రనేతలు సోనియాగాంధీ,రాహుల్‌ను ఇడికేసులతో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం వేధిస్తున్నదని ఎఐసిసి పిలుపుమేరకు టిపిసిసి ఆధ్వర్యంలో కాంగ్రెస్‌పార్టీ శ్రేణులు శ్యాంప్రసాద్ ముఖర్జీ భవన్ ముట్టడికి బయలుదేరడంతో గాంధీభవన్ వద్ద గురువారం ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. బిజెపి రాష్ట్ర కార్యాలయం ముట్టడికి కాంగ్రెస్ కార్యకర్తలు అత్యధిక సంఖ్యలో తరలివచ్చారు.పోలీసులు ర్యాలీని అడ్డుకోవడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో టిపిసిసి జనరల్ సెక్రటరీసంధ్యారెండ్డి సొమ్మసిల్లి పడిపోయారు. గాంధీభవన్,శ్యాంప్రసాద్ ముఖర్జీభవన్‌ల వద్ద పోలీసుల బలగాలను పెద్దఎత్తున మోహరించారు. తెలంగాణ కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జీ మీనాక్షి నటరాజన్,టిపిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ ముఖ్యనేతల ఆధ్వర్యంలో వందలాది మంది కార్యకర్తలతో బిజెపి ఆఫీస్ కి ర్యాలీగా బయలుదేరడంతో పోలీసులు అనుమతి లేదని అడ్డుకొన్నారు.పోలీసులు అడ్డుకోవడం తో గాంధీ భవన్ గేటు వద్దనే టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, ఎఐసిసిఇంచార్జ్ మీనాక్షినటరాజన్, కాంగ్రెస్ నాయకులు బైఠాయించి "సోనియా గాంధీ, రాహుల్ గాంధీ జిందాబాద్ కాంగ్రెస్ పార్టీ జిందాబాద్ అంటూ కార్యకర్తల నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. తెలంగాణ కాంగ్రెస్ ఇంచార్జీ మీనాక్షి నటరాజన్,టిపిసిసి అధ్యక్షులు బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్ కాంగ్రెస్ శ్రేణులనుద్దేశించి ప్రసంగిస్తూ రాజకీయ ప్రత్యర్థులపై కేసులు పెట్టి బిజెపి ప్రజాస్వామిక హక్కులను కాలరాస్తోందని ఆరోపించారు. దేశంలో భిన్నాభిప్రాయాలకు వీలులేకుండా నియంత పాలన సాగుతోందని ఆవేదన చెందారు. "ఎప్పటికైనా సత్యమే గెలుస్తుందని ఎఐసిసి తెలంగాణ ఇంచార్జీ మీనాక్షి నటరాజన్ ఆశాభావం వ్యక్తంచేసింది.నేషనల్ హెరాల్డ్ పేపర్ కేసు విషయం లో అదే జరిగింది.రేపు కూడా అదే జరుగుతుంది అని మీనాక్షి అన్నారు.బిజెపి పెడుతున్న అక్రమ కేసులపై ప్రజలకు వాస్తవాలు చెప్తాము.గాంధీ కుటుంబంపై బిజెపి కక్షసాధింపు చర్యలకు పాల్పడుతుందనీ అన్నారు.గాంధీ పేరుని సైతం తొలిగిస్తుంది.న్యాయం గెలివడానికి సమయం పట్టొచ్చు,కానీ చివరికి గెలిచేది న్యాయమే అని ఆమె అన్నారు. నేషనల్ హెలర్డ్ పేపర్ గురించి బిజెపి కి ఏమి తెలియదు.మా మార్గమే అహింస మార్గం.అలాగే శాంతయుతంగా నిరసన చేసి ప్రజలకు వాస్తవాలు తెలిచేస్తామనీ మీనాక్షి నటరాజన్ చెప్పారు. టిపిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్ మాట్లాడుతూ రాహుల్, సోనియాపై బిజెపి అక్రమ కేసులు పెడుతూ రాజకీయ కక్షసాధింపులకు పాల్పడుతోందని విమర్శించారు.ఢిల్లీ కోర్టు లో ఇడి వేసిన చార్జెషీట్ ని కొట్టివేసిందని న్యాయం ఎప్పటికైనా గెలిచి తీరుతోందని అన్నారు.స్వతంత్రం నుండి ఉన్న పేపర్ నేషనల్ హెరల్డ్.దేశ కోసం ఆస్తుకు త్యాగం చేసిన కుటుంబం గాంధి కుటుంబం.అలాంటి కుటుంబం పై కావాలనే బిజెపి వేధింపులకు గురి చేస్తుందని ఆయన ఆవేదన చెందారు. దేశంలో అభివృద్ధి నానాటికి కుంటుపడుతోందని వీటిని ప్రశ్నించకుండా ప్రతిపక్షం గొంతు నొక్కే ప్రయత్నంతో అనే అక్రమ కేసులు బిజెపి పాలకులు పెడుతున్నారని దుయ్యబట్టారు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీలో ఉద్రిక్త పరిస్థితుల మధ్య టిపిసిసి జనరల్ సెక్రటరీ సంధ్యా రెడ్డి సొమ్మసిల్లి పడిపోయారు. గాంధీ భవన్ నుంచి వందలాది మంది కాంగ్రెస్ కార్యకర్తలతో కలిసి బిజెపి కార్యాలయానికి ర్యాలీగా బయలుదేరిన సమయంలో, పోలీసులు ర్యాలీని అడ్డుకోవడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది.

సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్
ఆపరేషన్ సర్కిల్ :: సంగారెడ్డి
సంక్షిప్త టెండర్ మరియు విస్తరణ ప్రకటన
టెండర్ స్పెసిఫికేషన్ నం. T-53/25-26 to T-97/25-26 ఆఫ్ SE/OP/సంగారెడ్డి ప్రకారం సంగారెడ్డి సర్కిల్‌లో వివిధ పనులు చేపట్టడానికి సంక్షిప్త టెండర్ మరియు విస్తరణ ప్రకటన. టెండర్‌ల నిమిత్తం బిడ్ డాక్యుమెంట్ తేది: 19.12.2025 నుండి అందుబాటులో ఉంటుంది. బిడ్ డాక్యుమెంట్ విక్రయం ముగింపు తేది: 29.12.2025 17.00 గం. వరకు. బిడ్ యొక్క దాఖలు తేది: 30.12.2025 15.00 గం. వరకు. మరియు తెరచుట: 16.00 గం. వద్ద. వెబ్‌సైట్ www.tssouthernpower.com నుండి టెండర్ వివరాలు పొందవచ్చును. ఫోన్: 8712473087, ఇ-మెయిల్ ID: sesrdtsspdcl@gmail.com
సం/- సూపరింటెండింగ్ ఇంజనీర్, ఆపరేషన్ సర్కిల్ : సంగారెడ్డి, TGSPDCL
DIPR.No.12189-PP/CL/Advt/1/2025-26, తేది: 18.12.2025

## ఎపిలో లోకాయుక్త కర్నూలులోనే: హైకోర్టులో వివరించిన రాష్ట్ర ప్రభుత్వం

**విజయవాడ,డిసెంబరు 18,ప్రభాతవార్తప్రతినిధి:** లోకాయుక్త, ఏపీ మానవ హక్కుల సంఘం కార్యాలయాలను కర్నూలులోనే కొనసాగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈవిషయాన్ని ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది (ఎస్‌జీపీ) ఎస్.ప్రణతి హైకోర్టుకు నివేదించారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ హెచ్ఆర్సీ, లోకాయుక్త ఏర్పాటు వ్యవహారం ప్రభుత్వ విధానపరమైన నిర్ణయమని, పాలసీ నిర్ణయాల్లో తాము జోక్యం చేసుకునేందుకు కొన్ని పరిమితులు ఉంటాయని అని వ్యాఖ్యానించింది. లోకాయుక్త, హెచ్ఆర్సీ తరలింపు వ్యవహారంపై 2021లో ప్రభుత్వం దాఖలు చేసిన కౌంటర్ ప్రతి కోర్టు రికార్డుల్లోకి చేరలేదు. దీంతో విచారణ వాయిదా పడింది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకుర్, జస్టిస్ చల్లా గుణరంజన్‌తో కూడిన ధర్మాసనం ఈ మేరకు ఉత్తర్వులు ఇచ్చింది. రాష్ట్ర విభజన చట్ట నిబంధనలకు విరుద్ధంగా లోకాయుక్త, హెచ్ఆర్సీ కార్యాలయాలను కర్నూలులో ఏర్పాటు చేయడాన్ని సవాలు చేస్తూ డాక్టర్ మద్దిపాటి శైలజ 2021లో హైకోర్టులో పిల్ వేసిన సంగతి తెలియందే. ఇదే అంశంపై ఏపీ సివిల్ లిబర్టీస్ అసోసియేషన్ (తిశిదిలితి) సంయుక్త కార్యదర్శి ఏకేఎన్ మల్లేశ్వరరావు అప్పట్లో పిల్ దాఖలు చేశారు.ఈ వ్యాజ్యాలు తాజాగా హైకోర్టులో విచారణకు వచ్చాయి. పిటిషనర్ల తరఫు న్యాయవాది డీఎస్ఎన్వీ ప్రసాదబాబు వాదనలు వినిపించారు.

# ఖజానా రాబడి రూ.1.67 లక్షల కోట్లు

### అంచనా బడ్జెట్‌లో 58.55 శాతం నమోదు

### వ్యయం రూ.1.54 లక్షల కోట్లు

### ఈ 8 నెలల్లో రుణం రూ.58 వేల కోట్లు

**హైదరాబాద్, డిసెంబరు 18, ప్రభాతవార్త :** ప్రస్తుత 2025-26 ఆర్థిక సంవత్సరం రాష్ట్ర ప్రభుత్వ ఖజానాకు రెవెన్యూ రాబడులు, మూలధన రాబడులు కలిపి రూ.1,66,785.68 కోట్ల రాబడి సమకూరింది. ఇది వార్షిక అంచనా బడ్జెట్‌లో 58.55 శాతంగా ఉంది. అలాగే అన్ని రకాల వ్యయాల కింద రూ. 1,54,499.48 కోట్లు (58.64 శాతం) ఖర్చు చేసింది. ఈమేరకు రాష్ట్ర రాబడులు, వ్యయాలకు సంబంధించి కంపోల్టర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) తాజాగా ప్రభుత్వానికి నవంబరు నివేదిక సమర్పించింది. అప్పులు, పన్నులు, పన్నేతరాలు, కేంద్ర గ్రాంట్లు కాంట్రిబ్యూషన్లు, రుణాలు, అడ్వాన్సుల రికవరీ, ఇతర రిసీట్స్ అన్నీ కలిపి ఈసారి రూ.2,84,837.30 కోట్లు సమకూరుతాయని 2025-26 అంచనా బడ్జెట్‌లో పేర్కొంది. అయితే ఈ ఆర్థిక సంవత్సరం నవంబరు నాటికి (8 నెలల్లో) రూ.1,66,785.68 కోట్ల మేర రాబడి చోటు చేసుకుంది. దీంతో వార్షిక అంచనా బడ్జెట్‌లో పేర్కొన్న మొత్తంలో మిగిలిన నాలుగు నెలల్లో లక్ష్యం మేర రాబడులు సమకూరుతాయా అనే సందిగ్ధత నెలకొంది. మొత్తం ఆదాయంలో రెవెన్యూ రాబడుల ద్వారా రూ.2,29,720.63 కోట్లు వస్తాయని అంచనా వేయగా, ఎనిమిది నెలల కాలానికి రూ.1,08,685.45 కోట్లు (47.31) వచ్చాయి. ఇందులో పన్నుల కింద అంచనా వేసిన రూ.1,75,319.36 కోట్లకుగాను రూ.1,00,443.26 కోట్లు(57.29) సమకూరాయి. ఈ పన్నుల్లో జీఎస్టీ కింద అంచనా వేసిన రూ. 59,704.59 కోట్లకుగాను రూ.34,923.84 కోట్లు, స్టాంపులురిజిస్ట్రేషన్ల నుండి రూ.19,087.26 కోట్లకు గాను రూ.9,911.26 కోట్లు, అమ్మకం పన్ను ద్వారా రూ.37,463.90 కోట్లకు గాను రూ.21,512.71 కోట్లు, రాష్ట్ర ఎక్సైజ్ సుంకాల ద్వారా రూ.27,623.36 కోట్లకుగాను రూ.15,142.71 కోట్లు, కేంద్ర పన్నుల్లో రాష్ట్ర వాటా కింద రూ.21,195.18 కోట్లకు గాను రూ.13,468.88 కోట్లు (63.55), ఇతర పన్నులు, సుంకాల కింద రూ.5,483.41 కోట్లు, పన్నేతర రాబడి కింద రూ.4,770.18 కోట్లు, కేంద్ర గ్రాంట్లుకాంట్రిబ్యూషన్ల ద్వారా రూ.22,782.50 కోట్లకుగాను రూ.3,472.01 కోట్లు సమకూరాయి. ఇక అప్పుల కింద సర్కార్ భారీ మొత్తంలో నిధులు సేకరించింది. మార్కెట్ రుణాల కింద రూ.54,009.74 కోట్లు తీసుకోనున్నట్టు అంచనా బడ్జెట్‌లో వెల్లడించగా, నవంబరు నాటికే రూ. 58,068.90 కోట్లు (107.52 శాతం) సేకరించింది. దీంతో అంచనాను మించి రుణాలు చేసినట్లయింది. అలాగే నవంబరు నాటికి అన్ని రకాల వ్యయాల కింద రూ.1,54,499.48 కోట్లు ఖర్చు చేసింది. ఇందులో ప్రధానంగా పథకాలకు రూ 45,046.99 కోట్లు, వడ్డీ చెల్లింపులకు రూ. 18,486.79 కోట్లు, ఉద్యోగుల వేతనాలకు రూ. 32,007.74 కోట్లు, పెన్షన్లకు రూ.12,526.70 కోట్లు, సబ్సిడీలకు రూ.9,990.17 కోట్లు ఖర్చు చేసింది.



పార్లమెంట్ ఆవరణలో గురువారం కాంగ్రెస్ ఎంపి మల్లు రవి ఆధ్వర్యంలో ప్లకార్డులతో ఎంపిల నిరసన

## పార్లమెంట్ ఆవరణలో తెలంగాణ ఎంపిల ఆందోళన

### ఉపాధి పథకం పేరు మార్పుపై నిరసన

**హైదరాబాద్, డిసెంబరు 18, ప్రభాతవార్త:** మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పేరు మార్పుపై పార్లమెంట్ ఆవరణలో గురువారం కాంగ్రెస్ ఎంపిలు నిరసన చేశారు. మల్లు రవి ఆధ్వర్యంలో తెలంగాణ ఎంపిలు ప్లకార్డులు పట్టుకొని నిరసన వ్యక్తంచేశారు. మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో మహాత్మాగాంధీ పేరును తొలగించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని ఎంపి మల్లు రవి అన్నారు. మన్మోహన్‌సింగ్ ప్రధాన మంత్రిగా ఉన్న సమయంలో ప్రతి పేదవానికి 100 రోజుల పని గ్యారెంటీ ఉండాలని జాతిపిత మహాత్మాగాంధీ పేరుతో పథకం తెచ్చారని గుర్తుచేశారు. ఆర్.ఎస్.ఎస్ భావజాలం ఉన్న మోడీ ప్రభుత్వం మహాత్మాగాంధీ పేరును తొలగించిందని ఆరోపించారు. జాతీయ ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేస్తున్నారని ఆవేదన చెందారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు ఉపాధి హామీ పథకానికి కేంద్ర ప్రభుత్వం 100 శాతం నిధులు ఇచ్చేదని ఇప్పుడు బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు 60:40 శాతం చేసిందని అన్నారు. నాటి కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు ఉపయోగపడేలా ఉపాధి హామీ పథకం తేగా, నేటి బిజెపి ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని నీరుగార్చుతోందని అన్నారు.

## 'స్టాట్యూ ఆఫ్ యూనిటీ' రూపశిల్పి రామ్ సుతార్ కన్నుమూత

### నోయిడాలో కుమారుడి నివాసంలో తుదిశ్వాస విడిచిన సుతార్

### రాష్ట్రపతి ముర్ము, ప్రధాని మోడీ సహా పలువురు సంతాపం

**హైదరాబాద్, డిసెంబరు 18 ప్రభాతవార్త:** గుజరాత్‌లోని స్టాట్యూ ఆఫ్ యూనిటీ, హైదరాబాద్‌లోని అంబేద్కర్ విగ్రహాల రూపశిల్పి పద్మశ్రీ, పద్మభూషణ్ పురస్కారాల గ్రహీత, ప్రఖ్యాత భారతీయ శిల్పి రామ్ వి. సుతార్ (100) కన్నుమూశారు. వయోభారంతో బాధపడుతున్న ఆయన నోయిడాలోని తన కుమారుడి నివాసంలో తుదిశ్వాస విడిచినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.



గుజరాత్‌లోని ప్రపంచ ప్రసిద్ధ స్టాట్యూ ఆఫ్ యూనిటీ, హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌పై కొలువుదీరిన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ భారీ విగ్రహాలకు రూపకల్పన చేసింది రామ్ సుతార్ కావడం విశేషం. 1925 ఫిబ్రవరి 19న మహారాష్ట్రలోని గోందూర్ గ్రామంలో ఒక సాధారణ విశ్వకర్మ కుటుంబంలో రామ్ సుతార్ జన్మించారు. తన అద్భుతమైన ప్రతిభతో శిల్పకళా రంగంలో శిఖరాలను అధిరోహించారు. ఆయన రూపొందించిన అనేక కళాఖండాలు దేశవ్యాప్తంగా గుర్తింపు పొందాయి. ముఖ్యంగా గుజరాత్‌లోని నర్మదా నదీ తీరంలో సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ గౌరవార్థం నిర్మించిన 182 మీటర్ల స్టాట్యూ ఆఫ్ యూనిటీ విగ్రహం ఆయనకు ప్రపంచవ్యాప్త ఖ్యాతిని తెచ్చిపెట్టింది. అదేవిధంగా, హైదరాబాద్ నగరానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన 125 అడుగుల అంబేద్కర్ మహా విగ్రహాన్ని కూడా రామ్ సుతార్ తీర్చిదిద్దారు. శిల్పకళా రంగానికి ఆయన చేసిన సేవలను గుర్తించిన భారత ప్రభుత్వం 1999లో పద్మశ్రీ, 2016లో పద్మభూషణ్ పురస్కారాలతో సత్కరించింది. ఆయన మృతి పట్ల రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధానమంత్రి నరేంద్రమోడీ సహా పలువురు రాజకీయ, కళారంగ ప్రముఖులు సంతాపం వ్యక్తం చేస్తున్నారు.

## ఫిరాయింపు ఆధారాలు లేవనడం విడ్డూరం

### ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కెఎ పాల్

**హైదరాబాద్, డిసెంబరు 18, ప్రభాతవార్త:** బిఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో పార్టీలోకి ఫిరాయించిన ఐదుగురు ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లను ఆధారాలు లేవు అని స్పీకర్ తోసిపుచ్చడం విడ్డూరంగా ఉందని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కెఎ పాల్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఇది సిగ్గుచేటు.. స్పీకర్‌కు చట్టం తెలుసా? సుప్రీంకోర్టు మీద గౌరవం లేదా? అని పాల్ ప్రశ్నించారు. బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు పార్టీ ఫిరాయించినా పార్టీ ఫిరాయించలేదని స్పీకర్ నిర్ణయించడం షాక్‌కు గురి చేసిందని, ఫిరాయింపు ఎమ్మెల్యేలపై తొలుత హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది తానేనని ఈ అంశంపై పోరాటం కొనసాగిస్తానని పాల్ చెప్పారు. పార్టీ ఫిరాయించిన వారిని బిఆర్ఎస్ సభ్యులుగానే కొనసాగిస్తున్నట్టు స్పీకర్ రూలింగ్ ఇవ్వడం ఆందోళన కలిగించిందని పాల్ తెలిపారు. బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు బహిరంగంగా కాంగ్రెస్‌లో చేరి, పార్టీ కార్యక్రమాల్లో పాల్గొన్నా స్పీకర్ ఫిరాయింపు జరగలేదంటున్నారా? అని పాల్ ప్రశ్నించారు.



మాట్లాడుతున్న జిల్లా అటవీ అధికారి శివ్‌ఆశిష్‌సింగ్

## నస్పూర్ పులి ఫొటో ఫేక్, అటవీ శాఖ నిర్ధారణ

### ఎఐతో ఫొటో సృష్టించిన నిందితుడిపై కేసు నమోదు

**నస్పూర్, డిసెంబరు 18, ప్రభాతవార్త :** మంచిర్యాల జిల్లా నస్పూర్ మండలంలోని సిసిసి టౌన్‌షిప్‌లో బుధవారం రాత్రి పులి సంచరిస్తోందంటూ సోషల్ మీడియా లో జరిగిన ప్రచారం పూర్తిగా అవాస్తవమని జిల్లా అటవీ అధికారి (డిఎఫ్ఓ) శివ్ ఆశిష్ సింగ్ స్పష్టం చేశారు. ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) సాంకేతికతతో ఒక వ్యక్తి పులి ఫోటోను సృష్టించి తప్పుడు ప్రచారం చేశారని ఆయన తెలిపారు. పులి వార్తలతో ప్రజలు ఆందోళన చెందడంతో డిఎఫ్ఓ శివ్ ఆశిష్ సింగ్, రేంజ్ ఆఫీసర్ రత్నాకర్ ఆధ్వర్యంలో పది బృందాలు రంగంలోకి దిగాయి. డ్రోన్ కెమెరాల సహాయంతో ఆ ప్రాంతాన్ని క్షుణ్ణంగా పరిశీలించగా, ఎక్కడా పులి జాడ గానీ, పాదముద్రలు గానీ లభించలేదు. దీంతో అది తప్పుడు ఫోటో అని అధికారులు ధ్రువీకరించారు. సాంకేతిక పరిజ్ఞానంతో తప్పుడు ఫోటో సృష్టించిన వ్యక్తిని గుర్తించిన అధికారులు, అతడిని సంఘటనా స్థలానికి తీసుకువచ్చి అది ఫేక్ అని ఒప్పించారు. ప్రజలను భయాందోళనకు గురిచేసిన సదరు వ్యక్తిపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వదంతులు నమ్మవద్దని, ఏదైనా సమాచారం ఉంటే 9440313191, 9441533220 నెంబర్లకు తెలపాలని అధికారులు కోరారు.

# రాజ్యాంగంపై రాహుల్‌కు గౌరవముంటే ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలి

### కాంగ్రెస్, బిఆర్ఎస్‌కు రాజ్యాంగం, చట్టంపై ఏమాత్రం గౌరవం లేదు

### సర్పంచ్ ఎన్నికలలో బిజెపికి బలం పెరిగింది

### రాష్ట్ర ప్రభుత్వం సింగరేణి కంపెనీకి రూ.47 వేల కోట్ల అప్ప

### ఉద్యోగులకు జీతాలు చెల్లించలేని దుస్థితిలో తెలంగాణ: కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

**హైదరాబాద్, డిసెంబరు 18, ప్రభాతవార్త:** రాహుల్ గాంధీకి రాజ్యాంగంపై గౌరవం ఉంటే పార్టీ పిరాయించిన బిఆర్ఎస్ ఎమ్మెల్యేలపై అనర్హత వేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి గురువారం ఢిల్లీలో విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ బిఆర్ఎస్ పార్టీ గుర్తుపై గెలిచి కాంగ్రెస్ పార్టీలో చేరిన ఎమ్మెల్యేలపై విచారణ చేపట్టిన స్పీకర్ ప్రసాద్ కుమార్ ప్రజాస్వామ్యానికి వ్యతిరేకంగా తీర్పును వెలువరించడం దురదృష్టకరమని వాపోయారు. పది మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీలో చేరినట్లుగా స్పష్టమైన ఆధారాలు ఉన్నా పార్టీ మారలేదని స్పీకర్ చెప్పడం విచారకరమని అన్నారు. స్పీకర్ చట్టబద్ధంగా నిర్ణయం తీసుకోవాలని కిషన్‌రెడ్డి డిమాండ్ చేశారు. భారత రాజ్యాంగం, చట్టాలపై కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీలకు ఏమాత్రం గౌరవం లేదన్నారు. నాడు బిఆర్ఎస్ నేడు కాంగ్రెస్ పార్టీలు ఫిరాయింపు చట్టానికి నిలువునా తూట్లు పొడిచాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేల విషయంలో స్పీకర్ ఇచ్చిన తీర్పును పునరాలోచన చేయాలని కోరారు. పార్టీలు మారినట్టు ఎమ్మెల్యేలు, పత్రికలు ప్రకటించాయని తెలిపారు. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి మద్దతుగా ప్రచారం చేశారన్నారు. గతంలో బిఆర్ఎస్ ఇతర పార్టీల నుంచి వచ్చిన వారికి మంత్రి పదవులు ఇచ్చారని గుర్తుచేశారు. తెలంగాణలో విద్యుత్ ఉత్పత్తిపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. బడ్జెట్ బకాయిలు తీర్చడానికి సరిపోదనీ ఎద్దేవా చేశారు. గ్లోబల్ హబ్‌గా మారాలంటే విద్యుత్ చాలా కీలకమని కేంద్రమంత్రి అన్నారు. మనిషి మనుగడ, వ్యవస్థ మనుగడకు విద్యుత్ ఎంతో ముఖ్యమనీ, విద్యుత్ ప్రాథమిక అవసరంగా మారిందని తెలిపారు బడ్జెట్లో విద్యుత్ కు రూ.21 వేల కోట్లు మాత్రమే కేటాయించారని ఈ బడ్జెట్ తో విద్యుత్ బకాయిలు తీర్చే పరిస్థితి లేదన్నారు. విద్యుత్ ఉచిత పథకాలకు కూడా బడ్జెట్ ఏమాత్రం సరిపోదని విమర్శించారు. విద్యుత్ కు సంబంధించి పాత బకాయిలపై దృష్టి పెట్టలేదని, విద్యుత్ ప్రాజెక్టుల పరిస్థితి ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్నట్లు ఉందన్నారు. విద్యుత్ ఉద్యోగుల జీతభత్యాల పరిస్థితి దయనీయంగా ఉందని విమర్శించారు. తెలంగాణ ప్రభుత్వం సింగరేణి కంపెనీకి 47 వేల కోట్ల రూపాయలు అప్పు పడిందని వివరించారు. సింగరేణి కంపెనీ డిఎమ్ఎఫ్ కింద నిధులు కూడా ఇవ్వలేని దుస్థితిలో ఉందని కిషన్‌రెడ్డి నిందించారు. విద్యుత్ డిమాండ్ రోజు రోజుకు పెరుగుతోందనీ విద్యుత్ సంస్థల అప్పుల పరిస్థితి కూడా పెరుగుతోందని తెలిపారు.



క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీలో భాగంగా లక్ష్యాలు ఘనంగా 2030 నాటికి 20 వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి లక్ష్యమన్నారు. 2035 నాటికి 40 వేల మెగావాట్ల విద్యుదుత్పత్తి లక్ష్యమన్నారు. తెలంగాణలో విద్యుత్ కేబుల్స్ వ్యవస్థ బలోపేతం కోసం కొత్త టెక్నాలజీ అందించామన్నారు. కేంద్రం తెలంగాణాకు అనేక రకాలుగా సహకారం అందించిందని తెలిపారు. ఒకపూట వర్షాలు, గాలులు వస్తే హైదరాబాద్ సహా ఇతర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఆగిపోతుందన్నారు. కంపెనీలను ఆహ్వానిస్తున్న తెలంగాణ ప్రభుత్వం విద్యుత్ ఉత్పత్తిపై దృష్టి పెట్టాలని డిమాండ్ చేశారు. విద్యుత్ లేకపోతే కంపెనీలు రావన్నారు. పాత బకాయిల విషయంలోనూ ఎటువంటి ఆలోచన చెయ్యడం లేదని విమర్శించారు. నిధులు లేక ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉందంటూ వ్యాఖ్యలు చేశారు. కేంద్రప్రభుత్వం ఎన్‌టిపిసి సంస్థ ఆధ్వర్యంలో మరో 4 వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చెయ్యాలని నిర్ణయం తీసుకుందన్నారు. ప్రపంచవ్యాప్తంగా విద్యుత్ డిమాండ్ పెరుగుతోందని చెప్పారు. 74 శాతం విద్యుత్ థర్మల్‌తోనే జరుగుతోందని అన్నారు. గతంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో విద్యుత్ కోతలు ఉండేవని గుర్తుచేశారు. మోదీ ప్రధానమంత్రి కాకముందే విద్యుత్ కోసం ఆందోళనలు జరిగాయన్నారు. ఇపుడు 24/7 విద్యుత్ సరఫరా జరుగుతోందన్నారు. ఇప్పుడు వన్ నేషన్ వన్ గ్రిడ్‌తో అనుసంధానం జరిగిందని చెప్పారు. సర్పంచ్ ఎన్నికల్లో గతం కంటే బిజెపికి చాలా బలం పెరిగిందని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి వెల్లడించారు.

# యజమానులకు ఇపిఎఫ్ఓ శుభవార్త

### ఉద్యోగుల నమోదుకు ఇఇఎస్2025 పేరుతో ప్రత్యేక పథకం

### ఆరు నెలలపాటు యజమానులకు అవకాశం

**ముంబై, డిసెంబరు 18:** ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ (ఇపిఎఫ్ఓ) తాజాగా సంస్థల యజమానులకు ఒక కీలకమైన అవకాశాన్ని కల్పించింది. గతంలో వివిధ కారణాల వల్ల తమ ఉద్యోగులను ప్రావిడెంట్ ఫండ్ (పిఎఫ్) పరిధిలోకి తీసుకురాలేని సంస్థల కోసం 'ఎంప్లాయీస్ ఎన్‌రోల్‌మెంట్ స్కీమ్ (ఇఇఎస్)2025' పేరుతో ఒక ప్రత్యేక పథకాన్ని గురువారం ప్రకటించింది. దీని కింద అర్హులైన ఉద్యోగులను స్వచ్ఛందంగా పిఎఫ్ ఖాతాలో నమోదు చేయడానికి యజమానులకు ఆరు నెలల సమయం ఇచ్చింది. ఈ పథకం 2025 నవంబర్ నుంచి ఆరు నెలల పాటు అమల్లో ఉంటుంది. 2017 జూలై 1 నుంచి 2025 అక్టోబర్ 31 మధ్య కాలంలో పీఎఫ్ పరిధిలోకి రాని ఉద్యోగులకు ఈ పథకం వర్తిస్తుంది. ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని పాత బకాయిలను సులభంగా చెల్లించవచ్చని ఇపిఎఫ్ఓ సూచించింది. ఈ పథకం కింద యజమానులకు భారీ ఊరట కల్పించారు. గతంలో ఉద్యోగి వాటాను జీతం నుంచి మినహాయించని పక్షంలో, యజమాని కేవలం తన వాటా, వర్తించే వడ్డీ, పరిపాలనా ఛార్జీలతో పాటు నామమాత్రంగా రూ.100 జరిమానా చెల్లిస్తే సరిపోతుంది.

ఇప్పటికే విచారణ ఎదుర్కొంటున్న సంస్థలు కూడా ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవచ్చని ఇపిఎఫ్ఓ స్పష్టం చేసింది. 'అందరికీ సామాజిక భద్రత' అనే జాతీయ లక్ష్యాన్ని సాధించడంలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. ఈ పథకంపై యజమానుల్లో అవగాహన కల్పించేందుకు దేశవ్యాప్తంగా ప్రచార కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపింది. అలాగే ఎస్ఎంఎస్, ఈమెయిల్స్ ద్వారా సమాచారం అందిస్తామని వివరించింది.

## విచారణలో నోరు విప్పిన ఐ బొమ్మ రవి

### శాటిలైట్ లింక్, క్యూబ్ నెట్‌వర్క్ హ్యాక్ చేసినట్లు వెల్లడి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, డిసెంబరు 18:** ఐ బొమ్మ వెబ్ సైట్ నిర్వాహకుడు రవి కేసు విచారణలో సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. పోలీసుల విచారణలో అతడు సినిమా పైరసీకి పాల్పడిన విధానాన్ని వెల్లడించాడు. టెలిగ్రామ్ ఛానల్ ద్వారా కొత్త సినిమాల పైరసీ ప్రింట్లతో వ్యాపారం చేసినట్లు ఒప్పుకున్నాడు. గురువారం జరిగిన విచారణలో పైరసీకి సంబంధించిన కీలక వివరాలను రవి వెల్లడించాడు. కేవలం సాధారణ ప్రింట్లే కాకుండా, ఏకంగా క్యూబ్ నెట్‌వర్క్‌ను, శాటిలైట్ లింక్‌ను హ్యాక్ చేసి సినిమాలను హెచ్‌డీ ఫార్మాట్‌లో రికార్డు చేసినట్లు తెలిపాడు. ఈ విధంగా పైరసీ చేసిన సినిమాలను అమ్మేందుకు హెచ్‌డీ హబ్ పేరుతో ప్రత్యేకంగా ఒక టెలిగ్రామ్ ఛానల్ ఏర్పాటు చేసినట్లు చెప్పాడు. ఈ ఛానల్‌లో పైరసీ లింకులను అప్‌లోడ్ చేసి, ఒక్కో లింక్‌కు 100 నుంచి 300 డాలర్ల వరకు వసూలు చేసినట్లు స్పష్టం చేశాడు. ముఖ్యంగా హిట్3, కిష్కిందపురి సినిమాలను శాటిలైట్ లింక్ ద్వారానే పైరసీ చేసినట్లు అంగీకరించాడు. ఈ నేపథ్యంలో, మూడు వేర్వేరు కేసుల్లో విచారణ నిమిత్తం నాంపల్లి కోర్టు ఇమ్మడి రవికి 12 రోజుల పోలీస్ కస్టడీకి అనుమతించింది. కోర్టు ఆదేశాల మేరకు సైబర్ క్రైమ్ పోలీసులు గురువారం చంచల్‌గూడ జైలు నుంచి అతడిని అదుపులోకి తీసుకుని విచారణ కొనసాగిస్తున్నారు.

## నేటి నుండి హైదరాబాద్‌లో అంతర్జాతీయ షార్ట్ ఫిలిం ఫెస్టివల్

**హైదరాబాద్, డిసెంబరు 18, ప్రభాతవార్త :** హైదరాబాద్ వేదికగా ఇంటర్నేషనల్ షార్ట్ ఫిలిం ఫెస్టివల్ జరగనుంది. ఈ నెల 19వ తేదీ నుంచి మూడు రోజుల పాటు ఈ ఫెస్టివల్ జరగనున్నాయి. హైదరాబాద్ ఇంటర్నేషనల్ షార్ట్ ఫిలిం ఫెస్టివల్ ప్రపంచ వేదికగా ఎదిగింది. ప్రధానంగా ఈ ఫెస్టివల్‌కు యూరప్, అమెరికా వంటి దేశాల నుంచి సైతం సినిమాలు రావడం విశేషం. దాదాసాహెబ్ ఫాల్కే ఫిలిం స్కూల్, టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఈ ఇంటర్నేషనల్ షార్ట్ ఫిలిం ఫెస్టివల్ నిర్వహించనున్నామని అంకురం చిత్ర దర్శకుడు ఉమా మహేశ్వర రావు తెలిపారు. హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా 705 షార్ట్ ఫిల్మ్స్ వచ్చాయని, వాటిలో 60 షార్ట్ ఫిల్మ్స్ సెలెక్ట్ చేశామని చెప్పారు. ప్రసాద్స్ మల్టీప్లెక్స్‌లో స్క్రీనింగ్ జరుగుతుందన్నారు. నాజర్, నగేశ్ కుకునూరు, వివిధ రాష్ట్రాలకు చెందిన జ్యూరీ సభ్యులు హాజరవుతున్నారని వివరించారు. మూడు రోజులు షార్ట్ ఫిలిం ఫెస్టివల్ నిర్వహించి వదిలేయడం కాకుండా, సినిమాలు పంపిన, చూసిన యువతతో అవగాహన సదస్సు నిర్వహించి వారి అభిప్రాయాలను సేకరిస్తామని పేర్కొన్నారు.

## వ్యవసాయ ఉద్యోగులకు ఫేషియల్ రికగ్నిషన్ యాప్

### వ్యవసాయ కార్యదర్శి సురేంద్ర ఉత్తర్వులు

**హైదరాబాద్, డిసెంబరు 18, ప్రభాతవార్త :** రాష్ట్రంలోని వ్యవసాయ, దాని అనుబంధ శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు సమయ పాలన నిమిత్తం ప్రత్యేక యాప్‌ను ప్రభుత్వం తీసుకొచ్చింది. వ్యవసాయ, అనుబంధ శాఖలు, కార్పొరేషన్ల కార్యాలయాల్లో రాష్ట్ర స్థాయి నుండి డివిజన్ వరకూ సంబంధిత కార్యాలయాల్లో ఉద్యోగుల హాజరుపై నిరక్ష్యం లేకుండా ఉండేలా పనిచేస్తున్న ఉద్యోగుల హాజరుపై నిరక్ష్యం తావులేకుండా బయో మెట్రిక్, ఫేషియల్ రికగ్నిషన్ యాప్ ఏర్పాటు చేసింది.

ఈ మేరకు దీనికి సంబంధించి గురువారం వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్రమోహన్ ఉత్తర్వులు విడుదల చేశారు. దీన్ని విధిగా ఉద్యోగులందరూ అమలు చేసేలా చూడాలని వ్యవసాయ, అనుబంధ కార్పొరేషన్ల అధికారులకు స్పష్టం చేశారు.

ఇందుకు బయో మెట్రిక్ ఫేషియల్ రికగ్నిషన్ యాప్ ప్రత్యేకించి ఏర్పాటు చేయాలని సంబంధిత విభాగాల హెచ్‌ఓడీ లకు ఆదేశాలు జారీ చేశారు. విధులకు ఆలస్యంగా హాజరయ్యే ఉద్యోగుల పట్ల తీసుకున్న యాక్షన్ టేకెన్ రిపోర్టులు అందించాల్సిందిగా స్పష్టం చేశారు. ఇందుకు ఐటీ శాఖ ఆధ్వర్యంలో డాష్ బోర్డు ఏర్పాటు చేయాల్సిందిగా సూచించారు.

ఉద్యోగుల హాజరుపై ఆన్ లైన్ లో సమాచారం ఉండే విధంగా డాష్ బోర్డు పనిచేయాలని ఐటీ డిపార్ట్ మెంట్ వారికి పనులు అప్పగించారు. కొద్ది రోజుల్లో వ్యవసాయ, అనుబంధ కార్పొరేషన్ల కార్యాలయాల్లో పూర్తి స్థాయిలో ప్రక్షాళన దిశగా చర్యలు తీసుకుంటున్నామని కార్యదర్శి పేర్కొన్నారు.

## విబిజిరామ్‌జి-2025 బిల్లును వ్యతిరేకిస్తూ సిపిఎం నిరసన

**హైదరాబాద్ (చిక్కడపల్లి) డిసెంబరు 18, ప్రభాతవార్త :** కేంద్రం ప్రభుత్వం ఉపాధి హామీ చట్టాన్ని పథకంగా మార్చి నిర్వీర్యం చేసే కుట్రను ప్రతి ఒక్కరూ తిప్పికొట్టాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ పిలుపునిచ్చారు. మహాత్మాగాంధీ పేరుతో ఉన్న నరేగా పేరును వీబీజీరామ్‌జీ గా మార్చడాన్ని తప్పుబట్టారు. ఇలా చేయడం అంటే గాంధీని అవమానపర్చడమేనన్నారు. దాన్ని యధావిధిగా చట్ట రూపంలోనే ఉంచి నిధులను పెంచాలనీ, పేరును మార్చొద్దని డిమాండ్ చేశారు. ఆ చట్టం పరిరక్షణ కోసం ఐక్య పోరాటాలు చేస్తామని ప్రకటించారు. ఆ బిల్లును కేంద్ర ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. గురువారం ఆర్టీసీ క్రాస్ రోడ్డులో సీపీఎం ఆధ్వర్యంలో వీబీజీరామ్‌జీ2025 బిల్లును వ్యతిరేకిస్తూ నిరసన కార్యకమం చేశారు. ఆ బిల్లు ప్రతులను దహనం చేశారు. ఉపాధి హామీ చట్టాన్ని పరిరక్షించాలి.... వీబీజీరామ్‌జీ బిల్లును వెనక్కి తీసుకోవాలి...మోడీ సర్కారు ప్రజావ్యతిరేక విధానాలను విడనాడాలి.. అని నినదించారు.

ఈ కార్యకమంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు టి.సాగర్, రాష్ట్ర నాయకులు వెంక్రటాములు, భూ పాల్, బి.ప్రసాద్, ఆశయ్య, శ్రీరామ్ నాయక్, ఉడుత రవీందర్, ఎం.శ్రీనివాస్, బాబూరావు, కోట రమేశ్, విజయ్, పద్మ, ప్రజాసంఘాల నాయకులు, నగర కార్యదర్శి వెంకటేష్ తదితర నాయకులు పాల్గొన్నారు.



నిరసన కార్యక్రమంలో పాల్గొన్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

నిరసన కార్యక్రమాన్ని ఉద్దేశించి జాన్ వెస్లీ మాట్లాడారు. బీజేపీ నేతృత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం స్థానంలో వికసిత్ భారత్ - రోజ్ గార్, ఆజీవికా మిషన్ (గ్రామీణ్) బిల్లు 2025 (వీబీగ్రామ్‌జీ బిల్లు)ను తీసుకురావాలనే దుర్మార్గపు చర్యను ప్రతి ఒక్కరూ ఖండించాలని పిలుపు నిచ్చారు. మహాత్మా గాంధీ పేరును తొలగించి, దాని స్థానంలో జీరామ్‌జీ అనే సంక్షిప్త నామాన్ని తీసుకురావడాన్ని వ్యతిరేకించారు. మోసపూరిత బిల్లును తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఓవైపు రాష్ట్ర ప్రభుత్వాల ఆర్థిక వనరులను దెబ్బతీస్తూ 40 శాతం నిధులను రాష్ట్ర ప్రభుత్వాలే భరించాలని కేంద్రం ముసాయిదా బిల్లులో పెట్టడం దుర్మార్గమన్నారు. కేంద్రం నిబంధనలతో కోట్లాది మంది తమ ఉపాధిని కోల్పోయే ప్రమాదం ఉందని ఎత్తిచూపారు.

సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్
ఆపరేషన్ సర్కిల్ :: సంగారెడ్డి
సంక్షిప్త టెండర్ మరియు విస్తరణ ప్రకటన
టెండర్ స్పెసిఫికేషన్ నం.T-53/25-26 to T-97/25-26 ఆఫ్ SE/OP/సంగారెడ్డి ప్రకారం సంగారెడ్డి సర్కిల్‌లో వివిధ పనులు చేపట్టడానికి సంక్షిప్త టెండర్ మరియు విస్తరణ ప్రకటన. టెండర్‌ల నిమిత్తం బిడ్ డాక్యుమెంట్ తేది: 19.12.2025 నుండి అందుబాటులో ఉంటుంది. బిడ్ డాక్యుమెంట్ విక్రయం ముగింపు తేది: 29.12.2025 17.00 గం. వరకు. బిడ్ యొక్క దాఖలు తేది: 30.12.2025 15.00 గం. వరకు. మరియు తెరచుట: 16.00 గం. వద్ద. వెబ్‌సైట్ www.tssouthernpower.com నుండి టెండర్ వివరాలు పొందవచ్చును. ఫోన్: 8712473087, ఇ-మెయిల్ ID: sesrdtsspdcl@gmail.com
సం/- సూపరింటెండింగ్ ఇంజనీర్, ఆపరేషన్ సర్కిల్ : సంగారెడ్డి, TGSPDCL
DIPR.No.12189-PP/CL/Advt/1/2025-26, తేది: 18.12.2025

తెలంగాణ ప్రభుత్వం
శంకర్‌పల్లి మునిసిపాలిటీ కార్యాలయం, రంగారెడ్డి జిల్లా
ఆసక్తి వ్యక్తీకరణ (EOI)
నం: E1/MCS/141/2025, తేది: 17.12.2025
శంకర్‌పల్లి మునిసిపాలిటీ కమిషనర్ వారు "శంకర్‌పల్లి మునిసిపాలిటీలో ఇంటర్‌కమ్ ఫోన్‌లు సరఫరా మరియు స్థాపన" కొరకు ఆసక్తి యొక్క వ్యక్తీకరణ కోరుతున్నారు. ఆసక్తి గల సంస్థలు/కన్సల్టెన్సీ/ఏజెన్సీ వారి ఆసక్తి వ్యక్తీకరణను, ఫైనాన్షియల్ ఆఫర్‌తోసహా మరియు అనుభవ ధృవీకరణ పత్రం, పని పూర్తి చేయగల కాలవ్యవధి మరియు అవసరమైన డాక్యుమెంట్‌లు దాఖలుతో శంకర్‌పల్లి మునిసిపాలిటీ కమిషనర్ పేరిట పని యొక్క ఐటమ్ కొరకు తీసిన 5,000 యొక్క సెక్యూరిటీ డిపాజిట్ DDతోసహా ఈ కార్యాలయానికి 24.12.2025 మ.3.00 గం. వరకు పంపించవలసినదిగా కోరుతున్నారు. బిడ్స్ 24.12.2025 సా.4.00 గం. వద్ద తెరువబడును. తదుపరి వివరాలకు మునిసిపల్ కమిషనర్ (7331127776) మరియు అసిస్టెంట్ ఇంజనీర్ (7337323577)లను కార్యాలయ వేళలలో సంప్రదించవచ్చును.
సం/- కమిషనర్, శంకర్‌పల్లి మునిసిపాలిటీ
DIPR.No.12123-PP/CL/Advt/1/2025-26, తేది: 18.12.2025

వార్త


విద్యలేకపోయినప్పటికీ గర్వించేవాడు, దరిద్రుడైనప్పటికీ పెద్దఎత్తులు వేసేవాడు, పనులు చేయనప్పటికీ ధనాన్ని ఆశించేవాడు మూర్ఖుడు.

-లావోసు

# పేరుమారిన 'గ్రామీణ ఉపాధి'

ఇప్పుడు గ్రామీణ ఉపాధి పథకం పేరు మారింది. వికసిత్ భారత్ గ్యారంటీ ఫుడ్ రోజ్‌గార్ అండ్ అజీవకా మిషన్ గ్రామీణ్ (విబిజి రామ్ జి)గా గురువారం లోక్‌సభలో విపక్షాల నిరసనల హోరు మధ్య బిల్లుకు ఆమోదం లభించింది. పేరొక్కటే మార్చుకుంటే ప్రభుత్వాలు మారినప్పుడల్లా పథకాల పేర్లు మార్చడం మామూలేగా అని సరిపెట్టుకునే వీలుంది. కానీ ఆపథకంలోని విధివిధానాలు మారిపోనుండటమే ప్రస్తావించుకోవాల్సి ఉంది. ఎంతో మంది గ్రామీణ పేదలు ఉపాధి కూలీలుగా తమ జీవన విధానాన్ని విజయవంతంగా మార్పు చేసుకోగలిగారు. అంటే కొంతలో కొంత వద్దికగా ఐదువేళ్లూ వారి కుటుంబానికి నోట్లోకి చేరాయి. చాలా మంది పొలం పనులకు వెళ్లేవారు కూడా ఉపాధి కూలీకి వెళ్లి పొట్టపోసుకున్నారు. ఉపాధి కల్పన పథకం కొన్ని చిన్న చిన్న అంశాల్లో కాస్త వెసులుబాటు ఉన్నా గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి చెందాయనే అంచనాఉంది. గత 20ఏళ్లలోనూ గ్రామీణ మౌలిక వసతుల కల్పనలో గణనీయమైన మార్పులను గుర్తించి ఎప్పటికప్పుడు ప్రతిపాదనలు, అంచనాల మేరకు నిధుల కేటాయింపు వేగంగా జరిగి గ్రామాల అభివృద్ధి బాగా జరిగిందన్న అభిప్రాయం సర్వత్ర వ్యక్తమైంది. కొత్తగామహాత్మా గాంధీ పేరు స్థానే 'వీబి- జీరామ్‌జీ' పేరిట మార్చేందుకు కేంద్ర ప్రభుత్వం కొత్త విధి విధానాలు రూపొందించింది. అవన్నీ గతంకన్నా భిన్నంగా ఉండడంతోనే అసలు చిక్కొచ్చిపడింది. ఉపాధి దినాలను 100నుంచి 125కి పెంచడం బాగానే ఉంది. కానీ మిగిలిన షరతులన్నీ ఏమాత్రం మెరుగైన ఉపాధి కల్పించే స్థాయిలో లేవు. గతంలో మొత్తమంతా కేంద్రమే భరించేది. ఇప్పుడైతే రాష్ట్రాల వారీకొంత మేరకు కేంద్రం నిధులు సమకూరుస్తుంది. ఆ నిధులున్నంతవరకే ఎలాంటి ఉపాధి పనులైనా జరిపించుకోవచ్చు. రాష్ట్రాలకు నిధుల కేటాయింపు మేరకే పనులు జరిపించుకోవాలి. తప్పితే అంతకన్నా నిధులు ఎక్కువ అవసరమైతే ఆ సొమ్మును రాష్ట్ర ఖజానా నుంచే ఖర్చు పెట్టుకోవాల్సి ఉంటుంది. ఇవన్నీ పంచాయతీ అవసరాలకేఖర్చు చేయాలి. ఏమాత్రం తేడా ఉన్నా నిధులు ఆగిపోతాయి. వ్యవసాయ సీజన్‌లో 'ఉపాధి హామీ'కి హాలిడే ప్రకటించాలన్న నిబంధన కొత్తగా చేర్చాయి. గతంలో ఇలాంటి హామీలేనందున వ్యవసాయ కూలీలు ఎవరూఅందుబాటులో ఉండేవారు కాదు. కొత్త విధానాన్ని బట్టి వ్యవసాయ కూలి పనులకు అవసరమైనంత మేరకు కూలీలు దొరకుతారు. ఇదొక్కటే మంచి మార్పు. గతంలో వ్యవసాయ కూలీలు దొరక్క కొత్తగా వచ్చేవారికి కూలిరేట్లు పెంచి తీసుకోవడంలో రైతులకు ఎక్కువ సాగు ఖర్చయ్యేది. అంతేకాదు కూలీలు దొరకని సందర్భంలో యాంత్రీక వ్యవసాయం వైపు రైతులు దృష్టి సారించారు. అంతకు ముందు ఈ ఉపాధి పథకం ఉనికిలోలేని సమయంలో గ్రామీణ ప్రాంతాల్లోకి యాంత్రాలొస్తేనే పేదలు ఉద్యమించేవారు. కొన్ని అధికార గణాంకాలుతీసుకుంటే పేదరికం తగ్గిందన్నమాటకు ప్రత్యామ్నాయంగా గ్రామీణ ఉపాధి పథకాన్నే గుర్తుంచుకోవాల్సి వస్తుంది. అలాంటిది ఆ పథకానికి తూట్లు పొడవడానికి ఏ విపక్ష నాయకుడు కానీ రైతులు కానీ అంగీకరించరు. సర్పంచ్‌లనడిగినాఇదే చెబుతారు. కానీ కేంద్ర పాలకులు రూపురేఖావిలాసాలతో సహా 'నరేగా'ను మార్చాల్సిందేననే ధోరణి వ్యక్తం చేస్తున్నారు. ఈ పథకంలో అమలు క్రమంలో బయటపడిన డొల్లతనం కానీ, లోపాలు కానీ లేవని అనుకోలేం. అలా అని ఉపాధిపథకానికి 90శాతం నిధులు రాష్ట్ర ప్రభుత్వాలే సమకూర్చుకోవాలని ప్రతిపాదించడమంటే ఒక కాలు విరగ్గొట్టడమే అవుతుంది. నిధులుంటే సరే సరి. లేకుంటే ఆ పథకమూ, పథకం వల్ల కలిగే ప్రయోజనాల పరిస్థితి కుంటినడకే! తాజాగా ఉపాధి హామీ పథకం 'వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆ జీవికా మిషన్-గ్రామీణ్ (వి.బి జీరామ్‌జీ)గా మారుతుంది. ఈ పథకానికి మంగళం పాడేందుకే పేరు మార్పు పథక విధివిధానాల మార్పు అని అధికార పక్షం అంటుందని కాంగ్రెస్‌తదితర విపక్ష నేతలు విమర్శిస్తున్నారు. పేదల సంక్షేమం, ఉపాధి పెంపు కోసమే బిల్లును తాజాగా ప్రవేశపెట్టినట్లుప్రభుత్వం చెబుతోంది. అధికార పక్షం చేసే అంశాలపై తనదైన శైలిలో కొన్నిటిని ప్రశంసిస్తూ, కొన్నిటికి ఆమోదముద్ర వేస్తూ వచ్చిన కాంగ్రెస్, ఎంపీ శశిథరూర్ మాత్రం ఆ పథకంలో మహాత్మాగాంధీ పేరును తొలగించడం, పథకానికిదాదాపు స్వస్తి చెప్పే ఆలోచనతో చేస్తున్న మార్పులని వ్యతిరేకించారు. గ్రామీణ పేదలకు జీవనోపాధి భద్రత, వలసల తగ్గింపు, గ్రామీణ మౌలిక వసతుల అభివృద్ధి సాధన అనే మూలసూత్రాలతో అమలవుతున్న 'ఉపాధి'ని ఏకమొత్తంగా మార్పు చేయడం తగదని కాంగ్రెస్ ఎంపీలు ముక్త కంఠంతో ప్రభుత్వాన్ని కోరారు. కొత్తబిల్లు ప్రకారం కేంద్రం, రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు 60:40 దామాషాలో ఖర్చులుభరించుకోవాలి. ఉత్తరాఖండ్ హిమాచల్‌ప్రదేశ్, జమ్ముకాశ్మీర్‌తో సహా ఈశాన్య, హిమాలయన్ రాష్ట్రాలు మాత్రం 10 శాతం నిధులు సమకూర్చుకోవాలి. ఈపథకం అమలు పర్యవేక్షణ కేంద్ర గ్రామీణ ఉపాధి హామీ కౌన్సిల్, రాష్ట్ర గ్రామీణ ఉపాధి హామీ కౌన్సిల్‌లు పర్యవేక్షిస్తాయి. సాగు సీజన్‌లలో పరిస్థితులను బట్టి వాటిని రాష్ట్ర ప్రభుత్వాలే తాత్కాలికంగా నిలిపివేసుకోవచ్చు. మహిళలు, వృద్ధులు, పిల్లలకు ప్రత్యేక కూలీ రేట్లు ప్రభుత్వమే ప్రతిపాదిస్తోంది. దరఖాస్తు చేసుకున్న 15 రోజులోపల ఉపాధిని కల్పించలేని పరిస్థి తులలో వారికి రోజువారీ నిరుద్యోగభృతిని చెల్లించాల్సి ఉంటుంది. ఇలా కొన్ని కొత్త విధానాలను, అవకాశాలను వెలుసుబాటు చూపింది. ఏమయితేనేం కేంద్రం నిర్దేశించిన ప్రాధాన్యతలు ఈ పథకం స్వరూపం మారిపోయే అవకాశం ఉంటుందని పలువురు చేస్తున్న విమర్శల గూర్చి కేంద్రం పునరాలోచన చేయాల్సి ఉంటుంది.

మన మంచి గుణాలను మనం మరచిపోవచ్చు. కాని దేవుడు మాత్రం మరవడు.



షేక్స్పియర్

అంతరాయాలు కలుగుతున్న కొద్దీ సంకల్పాన్ని దృఢతరం చేసుకుంటూ పోవాలి.



శ్రీరమణ మహర్షి

## ప్రజావాక్కు



### ఆర్థిక వెసులుబాటు అవసరం

**ఇటీవల** రాష్ట్ర ముఖ్యమంత్రి కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను కలిసి యువ ఇండియా పాఠశాలల కోసం రుణ పరిమితిని మాఫీచేయాలని కోరడం విద్యారంగంలో ప్రాధాన్యత కలిగిన అంశంగా మారింది. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న విద్యా సంస్కరణల వివరాలను కేంద్రానికి తెలియజేస్తూ, ఈ పాఠశాలలు రాష్ట్ర భవిష్యత్తు నిర్మాణంలో ఎంతకీలకమో ముఖ్యమంత్రి స్పష్టంగా వివరించారు. యువ ఇండియాపాఠశాలలు ఆధునిక మౌలిక వసతులు, నాణ్యమైన బోధన, డిజిటల్ సాంకేతికతతో కూడిన తరగతులద్వారా విద్యార్థులను ప్రపంచస్థాయి పోటీలకు సిద్ధం చేయాలనే లక్ష్యంతో ఏర్పాటు అవుతున్నాయి. గ్రామీణ-పట్టణ ప్రాంతాల మధ్య ఉన్నవిద్యా అంతరాన్ని తగ్గించి, ప్రభుత్వ పాఠశాలల ప్రతిష్ఠను పెంచడంలో ఇవి కీలక పాత్ర పోషించనున్నాయి.

- టి. శ్రీనివాస్, చొప్పదండి

### రాష్ట్రాలకు నిధులు పెంచాలి

**ఉపాధిపైన** తీవ్ర గందరగోళంనెలకొన్న పరిస్థితి కనబడుతుంది. ఒకవేళ ప్రభుత్వం చెపుతున్నట్టుగా ఆస్తుల సృష్టికి తగ్గట్టు ఖర్చు ఎక్కువ అవుతుంది అనుకుందాం. అప్పుడు నేషనల్ లెవల్ మానిటరింగ్ కమిటీలు ఏమి చేస్తున్నట్టు. అసలు చిక్కుఏమిటి కేంద్రం తమబాధ్యతల నుండి తప్పుకోవడమే కదా రాష్ట్రాల ఆదాయాలను లెక్కలోకి తీసుకొనే కొత్త బిల్ తీసుకోస్తాం అని మొత్తుకుంటున్నా అది ఎంత వరకునిజం అనేది అసలుప్రశ్న. రాష్ట్రాలకు తమ అవసరాలకు తగ్గట్టుపనులు చేసుకునే స్వేచ్ఛఇస్తారా లేక ఆర్థిక భారం మాత్రమే మోపుతారా అనేది కూడా అసలు ప్రశ్నే.

- భారత అవినాష్, జనగామ

### పోస్టులను భర్తీ చేయాలి

**ఆంధ్రప్రదేశ్** జూనియర్ కళాశాలలో పూర్వకాలంలో లైబ్రేరియన్ పోస్టు జూనియర్ లెక్చరర్ ఇన్ లైబ్రరీ సైన్స్‌గా మార్చారు. శాశ్వత ప్రాతిపదికన ఖాళీలు నింపడానికి సర్వీస్ కమిషన్ నోటిఫికేషన్ ఇచ్చారు. అందులో జోన్ రెండు జోన్ మూడులలో షెడ్యూల్డ్ ట్రైబ్ కేటగిరీలో రెండు పోస్టులు నింపడానికి నోటిఫికేషన్ ఇచ్చారు. క్యారీ ఫార్వర్డ్ పోస్టులను ఓపెన్ క్యాటగిరిగా మార్చమని అర్హత గల నిరుద్యోగులు అందరికీ అవకాశం కల్పించాలి.

- కె.హరికృష్ణ, విజయవాడ

### ఆధార్ సురక్షితమేనా?

**దేశంలో** ప్రభుత్వ, ప్రైవేటుసేవలకు ఆధార్ తప్పనిసరి గుర్తింపు పత్రంగామారడంతో, దీని వినియోగం విశిష్టస్థాయికి చేరుకుంది. ఈ విస్తృత వినియోగమే ఆధార్‌ను అత్యంత శక్తిమంతమైన సాధనంగా మార్చింది. అదే సమయంలో, ఇది కోట్ల మంది భారతీయుల సున్నితమైన వ్యక్తిగత సమాచారాన్ని కలిగి ఉన్న అతిపెద్దడేటాబేస్‌గామారింది. దీంతో, ఈడేట ఎంత సురక్షితం? అనే ప్రశ్నబలంగా వినిపిస్తోంది. ఆన్‌లైన్ ధృవీకరణలో యూఐడీఏఐ సర్వర్ల వద్ద భద్రత ఉన్నప్పటికీ, ప్రధాన సమస్య ఆఫ్‌లైన్ వినియోగంలోనే ఉంది. హోటళ్లు, ప్రైవేటు సంస్థలు ఫోటోకాపీలు, స్కానింగ్‌ల రూపంలో ఆధార్‌ను నిర్లక్ష్యంగా సేకరించి నిల్వ చేయడం డేటా భద్రతకు తీవ్ర ముప్పుగా మారుతోంది. ఇది చట్టబద్ధమైన అవసరమా, దుర్వినియోగమా అన్నదానిపై స్పష్టత కొరవడింది.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### ప్రైవేట్ పాఠశాలలపై నియంత్రణ అవసరం

**ఆంధ్రప్రదేశ్** రాష్ట్రప్రభుత్వం విద్యాశాఖలోవినూత్న మార్పులకు శ్రీకారం చుట్టింది. బ్లాక్ బోర్డ్ స్థానంలో గ్రీన్ బోర్డులు వాటికి అనుసంధానంగా ఎలక్ట్రానిక్ పానెల్ బోర్డ్స్ అమర్చారు. ఇంటర్నెట్ కనెక్షన్‌తో ఎంతో ఉపయోగకరమైన సమాచారాన్ని విస్తృతంగా అందరికీ అందించగలుగుతున్నారు. ఉపాధ్యాయ ఉపాధ్యాయులకు మెరుగైన జీతాలు మంచి సౌకర్యాలు కల్పించినప్పటికీ వారుచక్కగా బోధిస్తూ ఉన్నప్పటికీ విద్యార్థిని విద్యార్థులకు కనీసం నైపుణ్యాలైన చదవడం రాయడం చతుర్విధ ప్రక్రియలుసరిగారావడం లేదు. ప్రైవేటు కార్పొరేట్ విద్యాసంస్థల బాటను అధికారులు అనుసరిస్తూ రిజల్ట్స్ పరీక్షల్లో పాస్ మార్కులు శత శాతం రావాలని తీవ్రమైన ఒత్తిడి ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు కల్పిస్తున్నారు.

-వీరగంట భాస్కర్ రావు, బొబ్బిలి

### కుటుంబ నిర్వహణ ఒక కళ

**కుటుంబ** నిర్వహణ ఒక కళ. అది అందరికీ లేకపోవడం వల్ల కుటుంబ వ్యవస్థ అతలాకుతలం కావడానికి కారణమౌతుంది. సాటి మానవ ప్రవర్తనపై కనీస అవగాహనలేని దుస్థితి వచ్చింది. మొరటు ప్రవర్తన, సుఖలాలసత్వం, సుఖాలకు అడ్డు పడే రక్తసంబంధీకులనైనా చంపడానికి వెనుకాడకపోవడం. అంత్య నిష్ఠూరంకంటే ఆది నిష్ఠూరమే మంచిదని పిల్లలకు పెళ్లి కాగానే ఇంట్లో వేరుపడేయటం ఆచారమైనది..

-డా. దన్నాన అప్పలనాయుడు, చీపురుపల్లి

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# ఆర్థిక సమానత్వంతోనే సామాజికాభివృద్ధి

**అసమానతలను పట్టించుకోని అభివృద్ధి చివరకు ప్రజాస్వామ్యానికే ప్రమాదం. ఇది కేవలం ఆర్థిక నివేదిక కాదు, ఇది పాలకులకు ఒక హెచ్చరిక లాంటిది, ప్రజలకు ఒక అద్దం లాంటిది, రాజ్యాంగానికి ఒక స్మరణ లాంటిది. భారతదేశం ఈ హెచ్చరికను గమనిస్తే సమా నత్వం ఉన్న దేశంగా మారే అవకాశం ఉంది. అంబేద్కర్ హెచ్చరికలు నేటికీ నిజమవుతు న్నాయి. అసమానతలపై పోరాటం లేకుండా భారత ప్రజా స్వామ్యం నిలబడదని, భారతదేశం ఒకసమానత్వప్రయోగం. ఆ ప్రయోగం విజయం సాధించాలంటే రాజకీయ పార్టీలు రాజ్యాంగానికి విధేయులవ్వాలి, ప్రజలు సమానత్వానికికాప లాదారులవ్వాలని వక్కాణించారు. అసమానతలను పట్టించు కోని అభివృద్ధిచివరకు ప్రజాస్వామ్యానికే ప్రమాదం, అందుకే రాజ్యాంగాన్ని కాపాడుకుంటూ ప్రభుత్వం, వ్యవస్థలు చేసే తప్పులను ప్రజలే పోరాటాల రూపంలో ఎత్తిచూపిస్తూ అన్నింటిలోనూ సమానత్వాన్ని సాధించుకోవాలి.**

డా. ఎ . భాగ్యరాజ్

భారతదేశం ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్యంగా గుర్తింపు పొందిన దేశం. కానీ అదే సమయంలో ప్రపంచంలో అత్యధిక ఆర్థిక, సామాజిక, లింగ, ప్రాంతీయ అసమానతలు ఉన్న దేశాలలో ఒకటిగా కూడామారుతోంది. ప్రపంచం అభివృద్ధి, వృద్ధి రేటు, జాతీయ స్థూల ఉత్పత్తి (జీడీపీ) అనే పదాలతో మత్తెక్కిపోతున్న ఈ కాలంలో, ఈ ప్రశ్నకు నిర్దాక్షిణ్యమైన సమాధానం చెప్పే రీతిలో ఉన్నదే ప్రపంచ అసమానతల నివేదిక (వరల్డ్ ఇనీక్వాలిటీ రిపోర్ట్). అభివృద్ధి అనే పదం గణాంకాల్లో మెరుస్తున్నా, ఆ అభివృద్ధి ఫలాలు సమానంగా ప్రజలందరికీ అందుతున్నాయా? అభివృద్ధి ఫలాలు ఎవరి చేతుల్లోకి వెళ్తున్నాయి? అనే ప్రశ్న మరింత కీలకంగా మారింది. ఈ రోజు భారత సమాజం ముందు నిలిచిన కఠిన సత్యం. వరల్డ్ ఇనీక్వాలిటీ రిపోర్ట్ తాజా నివేదిక, గత కొన్నేళ్ల గణాంకాలు ఒక స్పష్టమైన సంకేతం ఇస్తున్నాయి. ప్రపంచ సంపద పెరుగుతోంది, కానీ సమానత్వం తగ్గుతోంది. ఈ ప్రపంచ ధోరణిలో భారత దేశం ఒక ప్రధాన ఉదాహరణగా నిలుస్తోంది. వేగవంతమైన ఆర్థిక వృద్ధి, డిజిటలైజేషన్, మౌలిక సదుపాయాలనిర్మాణం ఇవన్నీ ఒకవైపు కనిపిస్తే, మరోవైపు పెరుగుతున్న అసమానతలు భారత ప్రజాస్వామ్యానికి సవాలుగా మారుతున్నాయి. అసమానతలు సంఖ్యల సమస్య కాదు, సమాజ నిర్మాణ సమస్య. అసమానత అనగానే చాలామంది దానిని పేద, ధనిక మధ్య తేడాగా మాత్రమే చూస్తారు. కానీ ప్రపంచ అసమానతల నివేదిక (వరల్డ్ ఇనీక్వాలిటీ రిపోర్ట్) చెబుతున్నది వేరే విషయం. అసమానతలంటే ఆదాయంలో తేడా, సంపదలో కేంద్రీకరణ, అవకాశాలలో లోపం, విద్య, ఆరోగ్యం, ఉపాధిలో అసమాన పంపిణీ, కుల, లింగ, ప్రాంతీయ వివక్షలు. ఇవన్నీ కలిసినప్పుడు ఒక దేశం నిజంగా అభివృద్ధి చెందిందా లేదా అన్నది తెలుస్తుంది. భారతదేశం స్వాతంత్రం పొందిన తరువాత ప్రజలందరికి ఒక గొప్ప హామీ ఇచ్చింది. ఆ హామీ పేరు సమానత్వం. కులం, మతం, లింగం, ఆర్థిక స్థితి ఆధారంగా ఎవ్వరూ వెనుకబడకూడదు అన్నది డా. బి.ఆర్. అంబేద్కర్ దృష్టిలో అసమానత ఒక ఆర్థిక సమస్య కాదు. ఆయన అసమానతను కేవలం ఆదాయం లేదా పేదరిక సమస్యగా చూడలేదు. ఆయనదృష్టిలో అసమానత అనేది సామాజిక నిర్మాణం, కుల వ్యవస్థ ఫలితం, ఆర్థిక దోపిడీకి పునాది, రాజకీయ ప్రజాస్వామ్యానికి ప్రధాన అడ్డంకి అని స్పష్టంగా చెప్పారు. సామాజిక సమానత్వం లేకుండా రాజకీయ ప్రజాస్వామ్యం నిలబడదు అని స్పష్టంగా చెప్పారు. అంటే రాజకీయంగా సమానత్వం, సామాజికంగా అసమానత ఈ విరుద్ధత కొనసాగితే ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడుతుందని ఆయన హెచ్చరించారు. నేడు అదే జరుగుతోంది. డా.బి.ఆర్. అంబేద్కర్ దృష్టిలో సమానత్వంభారత రాజ్యాంగం ఆర్టికల్ 14 (సమానత్వం), ఆర్టికల్ 15 (వివక్ష నిషేధం), ఆర్టికల్ 17 (అంటరానితనం రద్దు) చేసింది. కానీ వాస్తవంలో కుల వివక్ష కొనసాగుతోంది, ఆర్థిక అసమానత పెరుగుతోంది, అవకాశాలు సమానంగా లేవు అంబేద్కర్ భయపడిన పరిస్థితి ఇదే. ఆర్థిక అసమానతలపై అంబేద్కర్ ఆలోచన ఒక అపోహని తీవ్రంగా ఖండించారు. ముందు ఆర్థిక సమానత్వం వస్తే, సామాజిక సమానత్వం వస్తుంది అన్న వాదనను ముందుచారు. కానీఆయన చెప్పింది సామాజిక అసమానత ఉన్నంత కాలం, ఆర్థిక సమానత్వం అసాధ్యం. భూమి, వనరులు, పరిశ్రమలు కొద్దిమంది చేతుల్లో ఉంటే, పేద వర్గాలు ఎప్పటికీ విముక్తి పొందలేరని ఆయనవెల్లడించారు. అంబేద్కర్ రాజకీయ పార్టీలను ప్రజాస్వామ్యానికి అవసరమైన సాధనంగా చూశారు. కానీ ఆయన ఒక విషయాన్ని



స్పష్టంగా చెప్పారు. నేడు రాజకీయ పార్టీలు అధికార సాధనకే పరిమితమవుతున్నాయి కానీ, కులం, మతం, భావోద్వేగాల మీద రాజకీయాలు చేస్తున్నాయి. అసమానతలమూలాలపై మాట్లాడటం లేదు. ఇది అంబేద్కర్ ఆశించినరాజకీయ సంస్కృతి కాదు. భారతదేశంలోని అసమానతల మూలం కుల వ్యవస్థ. కులం జన్మతో నిర్ణయించబడుతుంది, వృత్తి జన్మతోనే బంధించబడుతుంది. గౌరవం కూడా కులంతోనే కొలవబడుతుంది. ఇది ఆర్థిక అసమానతకు మాత్రమేకాదు, మనుషుల మధ్య మానవత్వం లేని విభజనకు కారణమవుతుంది. అంబేద్కర్ కుల వ్యవస్థను ఒకరు పైగా, మరొకరు కిందగా ఉండే వ్యవస్థ అని వెలిబుచ్చారు. ప్రపంచంలో, భారతదేశంలోని అత్యంత ధనిక ఒక శాతం వర్గం అపూర్వమైన సంపదను సొంతం చేసుకుంటోంది, మధ్యతరగతి వర్గం క్రమంగా క్షీణిస్తోంది. కోవిడ్ అనంతరం పేదరికం తగ్గినట్టు కనిపించినా, అసమానత మరింత పెరిగింది. ప్రభుత్వాలు పన్ను విధానాల ద్వారా సంపదను పునర్విభజించడంలో విఫలమవుతున్నాయి. ఈ పరిస్థితుల్లో భారతదేశం ఎమర్జింగ్ ఎకానమీగా ప్రశంసలు పొందుతున్నప్పటికీ, అసమానతల విషయంలో ప్రపంచంలోనే ముందంజలో ఉన్న దేశాల జాబితాలోకి చేరుతోంది. భారత ఆర్థిక వ్యవస్థ వేగంగా పెరుగుతోందని అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. కానీ వరల్డ్ ఇనీక్వాలిటీ నివేదికాక వెల్లడించేది ఈ వృద్ధి ఎవరి జీవితాలను మార్చింది అని. భారతదేశంలో సంపద కేంద్రీకరణ అత్యంత ధనిక ప్రజలు దేశ సంపదలో భారీ భాగాన్ని నియంత్రిస్తున్నారు, మరోవైపు, దేశంలోని క్రింది 50 శాతం ప్రజలకు కలిపి ఉన్న సంపద అత్యంతస్వల్పం. ఇది స్వాతంత్ర్యానంతరం ఎప్పుడూ లేని స్థాయిలో సంపద కేంద్రీకరణ పెరిగిందని నివేదికల ధోరణులు సూచిస్తున్నాయి. ఆదాయంకంటే సంపదలోనే తీవ్ర అసమానత, భారత దేశంలో ఆదాయ అసమానత కంటే సంపద అసమానత చాలా ప్రమాదకరంగా మారింది. సంపద అంటే భూమి, ఇళ్లు, పరిశ్రమలు, షేర్లు, వారసత్వ ఆస్తులు, ప్రభుత్వ భూములు, ఖనిజ సంపదలు, ఈ ఆస్తులు కొద్దిమంది చేతుల్లోనే కేంద్రీకృతమవుతున్నాయి. దీని ఫలితంగా పేద కుటుంబాలు తరతరాలుగా పేదలుగానే మిగిలిపోతున్నాయి, ధనిక కుటుంబాలు మరింత ధనికులవుతున్నాయి, ఇది సామాజిక చలనశీలతను పూర్తిగా దెబ్బతీస్తోంది. భారత దేశంలో విద్య, ఆరోగ్యం ఖర్చులు క్రమంగా పెరుగుతున్నాయి. ఉద్యోగ భద్రత తగ్గుతోంది, ఆదాయం స్థిరంగా పెరగడం లేదు, సామాజిక అసంతృప్తి పెరుగుతోంది. ఇది దీర్ఘకాలంలో దేశస్థిరత్వానికే ముప్పుగా మారే ప్రమాదముంది. ఉపాధి లేని వృద్ధితో అసమానతలకు ప్రధాన కారణం, భారతదేశ ఆర్థిక వృద్ధి ఒక ప్రధాన లోపంతో ముందుకెళ్తోంది. యువతలో నిరుద్యోగం పెరుగుతోంది, అనధికార రంగం విస్తరిస్తోంది, కాంట్రాక్ట్, గిగ్ ఉద్యోగాలు పెరిగి భద్రత తగ్గుతోంది. వరల్డ్ ఇనీక్వాలిటీ రిపోర్ట్ సూచన ఏమిటంటే ఉద్యోగాలు సృష్టించని అభివృద్ధి అసమానతలను తప్పనిసరిగా పెంచుతుందని. కులం, లింగం, ప్రాంతం ఇలా బహుముఖ అసమానతలు, భారత అసమానత కేవలం ఆర్థికమేకాదు, అది సామాజికంగా కూడా ఉంది. మహిళల శ్రామికంగా పాల్గొనే రేటు తక్కువ. మహిళల ఆదాయం పురుషులతో పోలిస్తే గణనీయంగా తక్కువ, కుల అసమానత, ఎస్సీ, ఎస్టీ వర్గాలు ఇంకా భూమి, విద్య, ఉపాధిలో వెనుకబడి ఉన్నాయి. ప్రాంతీయ అసమానతలు కొన్ని రాష్ట్రాలు వేగంగా అభివృద్ధి చెందుతుంటే, మరికొన్ని రాష్ట్రాలు మౌలిక సదుపాయాలకే నోచుకోలేకపోతున్నాయి. ఇవన్నీ కలిపి భారతదేశాన్ని బహుముఖ అసమానతల దేశంగా మారుస్తున్నాయి. ప్రపంచ అసమానతల నివేదిక ప్రకారం భారతదేశానికి ఇచ్చే సందేశం సుస్పష్టంగా తెలియజేసింది, అసమానతలను పట్టించుకోని అభివృద్ధి చివరకు ప్రజాస్వామ్యానికే ప్రమాదం. ఇది కేవలం ఆర్థిక నివేదిక కాదు, ఇది పాలకులకు ఒక హెచ్చరిక లాంటిది, ప్రజలకు ఒక అద్దం లాంటిది, రాజ్యాంగానికి ఒక స్మరణ లాంటిది. భారతదేశం ఈ హెచ్చరికను గమనిస్తే సమానత్వం ఉన్న దేశంగా మారే అవకాశం ఉంది. అంబేద్కర్ హెచ్చరికలు నేటికీ నిజమవుతున్నాయి. అసమానతలపై పోరాటం లేకుండా భారత ప్రజాస్వామ్యం నిలబడదని, భారతదేశం ఒకసమానత్వప్రయోగం. ఆ ప్రయోగం విజయం సాధించాలంటే రాజకీయ పార్టీలు రాజ్యాంగానికి విధేయులవ్వాలి, ప్రజలు సమానత్వానికికాపలాదారులవ్వాలని వక్కాణించారు. అసమానతలను పట్టించుకోని అభివృద్ధిచివరకు ప్రజాస్వామ్యానికే ప్రమాదం, అందుకే రాజ్యాంగాన్ని కాపాడుకుంటూ ప్రభుత్వం, వ్యవస్థలు చేసే తప్పులను ప్రజలే పోరాటాల రూపంలో ఎత్తిచూపిస్తూ అన్నింటిలోనూ సమానత్వాన్ని సాధించుకోవాలి. ●

# వ్యవసాయంలోనూ సంస్కరణలు అవసరం

బుగ్గన మధుసూదనరెడ్డి

ఇప్పటివరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయ రంగానికి కొద్దో గొప్పో ప్రాముఖ్యత ఇచ్చే పనిలో భాగంగా పీఎం కిసాన్ నిధి, రైతు భరోసా, కొన్ని పంటలకు మాత్రమే ఇస్తున్న నష్ట పరిహారం, రైతు పండించే పంటలకు అతి కొద్దిశాతం మాత్రమే ఇచ్చే సబ్సిడీ విత్తనాలు, ట్రాక్టర్, వ్యవసాయ పరికరాల కొనుగోలు వంటి వాటిపై అరకొరగా మాత్రమే రైతులకు సబ్సిడీగా అందజేస్తున్నారు అనే మాట సత్య దూరం కాదు. అయితే దేశ వ్యాప్తంగా 60 శాతానికి పైగా ప్రజానీకం ఇప్పటికి వ్యవసాయ రంగంపై ఆధారపడి జీవనం సాగిస్తున్న నేపథ్యంలో అయా రంగ అభివృద్ధిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మరింతగా శ్రద్ధ కనబరచాల్సిన ఆవశ్యకత ఎంతైనా వుంది. ఎందుకంటే దేశవ్యాప్తంగా వున్న రైతులలో చాలా మటుకు ఎక్కువ భాగం చిన్న, సన్నకారు రైతులు వున్న నేపథ్యంలో వారికున్న అరకొర ఆదాయాన్ని దృష్టిలో ఉంచుకొని వారికి పెన్షన్ సౌకర్యం కలిగించడంతో పాటు ఏదేని కుటుంబాన్ని పోషించే రైతు అనుకోని పరిస్థితుల్లో ఏదేని ప్రమాదం వల్లనో లేక అన్యాయమైన రీతిలో ఆ రైతుకు మరణం సంభవించినప్పుడో ఆ రైతు తరపున ఆ కుటుంబానికి ఆర్థిక వెసులుబాటు లభించేలా ఆ రైతు తరపున లైఫ్ ఇన్సూరెన్సు సౌకర్యం మన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెడితే వారి జీవితాలకు ఎనలేని భరోసాను కల్పించిన వారవుతారు. అదేవిధంగా ఒక చిన్న, పెద్ద కుటుంబాన్ని పోషించే రైతు దురదృష్టవశాత్తు అనారోగ్యం పాలు అయితే ఆయనపై ఆధారపడిన కుటుంబం ఆ రైతుకు వచ్చిన జబ్బును నయం చేసేందుకు తగినంత ఆర్థిక వనరులు వారి దగ్గర లేకపోవొచ్చు. అలాంటి సందర్భాలలో హెల్త్ ఇన్సూరెన్సు అత్యంత అవశ్యకం. ఈ స్కీమ్ సైతం అమలు చేసేందుకు కేంద్రప్రభుత్వాలు ఆలోచించాల్సిన అవశ్యకత ఎంతైనా వుంది. ఇంకా చెప్పుకుంటూపోతే రాత్రనక, పగలనక, వాననక, ఎండనక ఆరుగాలాలు శ్రమించి పండించే పంటలకు గిట్టుబాటు ధరలు లభించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్ర కృషి సల్పాల్సిన గురుతర బాధ్యత వారి



భుజస్కంధాలపై ఎంతైనా వుంది. అదేవిధంగా రైతు సోదరులు పంటలు విత్తే విషయంలో వారు తీసుకునే విత్తనాలపై సబ్సిడీ సౌకర్యం, అలాగే పంటవేసిన తరువాత వాటిని కాపాడే నిమిత్తమై వాడే బయో ఫర్టిలైజర్, బయో ఫెస్టిసైడ్స్ మందులపై సబ్సిడీ సౌకర్యాన్ని ప్రవేశపెడితే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతు సోదరులకు ఎంతో మేలు చేసిన వారవుతారు. ఇలాంటి సౌకర్యాలు అన్ని ప్రతి రైతు పొందేలా వారికి ఒక ప్రత్యేక కార్డును అందజేస్తే ఎలాంటిపొరపాట్లకు తావు లేకుండా ప్రతిఒక్క రైతు వీటివల్ల లబ్ధి పొందగలడు. అన్నింటికి మించి ఇప్పటి కాలంలో వ్యవసాయరంగం అనేది మోయలేని భారం వంటిది అని ప్రతి ఒక్కరూ భావిస్తూ ఆయా రంగం వైపు వెళ్లాలంటేనే జంకే పరిస్థితులుప్రస్తుతం నెలకొన్న నేపథ్యంలో, ప్రస్తుత యువతరం సైతం ఈ రంగంపైఅనాసక్తి కనబరుస్తున్న నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ విషయంలో ఒకటికి, రెండు సార్లు ఆలోచించి ఎలాంటి స్ఫూర్తిదాయకమైన సంస్కరణలు వ్యవసాయరంగంలో చేపడితే యువత వ్యవసాయరంగంపై మెగ్గు చూపుతారో, ఆయా వ్యవసాయ నిపుణులతోచర్చించి మరీ కసరత్తు చేయాల్సిన తక్షణ కర్తవ్యం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పెద్దలపై ఎంతైనా వుంది. ఏదిఏమైన అనాదిగా భారతదేశ సంస్కృతి, సంప్రదాయాలలో ఒక భాగంగా వుంటూ రావడమే కాదు నిన్న, మొన్నటి వరకు ఒక వెలుగువెలిగిన వ్యవసాయ రంగం అనేక కారణాలరీత్యా, ప్రస్తుతం తీవ్ర గడ్డుపరిస్థితులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో వ్యవసాయరంగం తిరిగి పూర్వపు వైభవం దిశగా పయనించేలా, అది ప్రస్తుత, రాబోయే తరం యువతకు మంచి లాభదా యకమైన వృత్తిగా మారేలా చేయాల్సిన గురుతర బాధ్యత మాత్రం ముమ్మాటికీ మన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పెద్దలదే అనడంలో ఇసుమంతైనను సందేహంలేదు. ఏమైనాయావత్ దేశానికి పట్టెడు అన్నం పెట్టే అన్నదాతలు తమ వ్యవసాయ రంగంలో ఎలాంటి ఇబ్బందులు, ఒడిదుడుగులు, ఆటుపోట్లు, ప్రతికూల, దయనీయ పరిస్థితులు ఎదుర్కొనకుండా పచ్చగా, సుభిక్షంగా ఉంటేనే మనదేశం అభివృద్ధి పథంలో దూసుకుపోయేది అనేమాట అక్షరసత్యం. ఇప్పటికి దేశవ్యాప్తంగా కూడా మెజారిటీ ప్రజలు ఎక్కువగా ఆధారపడేది వ్యవసాయ మీదే. కాబట్టి మన దేశ పాలకులు ఎక్కువగా వ్యవసాయరంగం మీద ఫోకస్ చేసి, యుద్ధ ప్రాతిపదికన ఆ రంగ అభివృద్ధికి పెద్దపీట వేయాలి. ●

# విద్యార్థుల వైఫల్యానికి బాధ్యులు ఎవరు?

తిప్పర్తి శ్రీనివాస్

సమాజంలో తరచుగా వినిపించే ప్రశ్నవిద్యార్థి ఎందుకు విఫలమయ్యాడు? పరీక్షల్లో తక్కువ మార్కులు వచ్చినా, ఆశించిన ఫలితాలు రాకపోయినా, భవిష్యత్తుపై నమ్మకం కోల్పోయినా వెంటనే ఆ విద్యార్థినే తప్పుపట్టే ధోరణి మనలో ఎక్కువగా కనిపిస్తుంది. కానీ నిజంగా విద్యార్థి వైఫల్యానికి విద్యార్థి ఒక్కడేబాధ్యుడా? లేక కుటుంబం, ఉపాధ్యాయులు, విద్యావ్యవస్థ, సమాజం అన్నీకలిసి ఈ వైఫల్యానికి కారణమవుతున్నాయా? ఈ ప్రశ్నకు సమాధానం వెతకాల్సిన అవసరం ఉంది. చదువుపై ఆసక్తి లేకపోవడం, క్రమశిక్షణ లోపించడం, సమయాన్ని వృథా చేయడం, మొబైల్ ఫోన్లు-సోషల్ మీడియాకు బానిసకావడం వంటి కారణాలు కొంతవరకు విద్యార్థి వైఫల్యానికి దారితీస్తాయి. లక్ష్యనిర్దేశం లేకుండా చదవడం, కష్టపడాలనే తపన లేకపోవడం కూడా ఫలితాలపై ప్రభావం చూపుతాయి. అయితే ఇవన్నీ విద్యార్థి స్వయంగా ఏర్పరుచుకున్న లోపాలా? లేక అతడిని చుట్టుముట్టిన పరిస్థితుల ఫలితమా అన్నది ఆలోచించాలి. విద్యార్థి ఎదుగుదలలో కుటుంబం కీలకపాత్ర పోషిస్తుంది. తల్లిదండ్రుల ప్రోత్సాహం, అవగాహన, మార్గనిర్దేశం విద్యార్థి భవిష్యత్తును నిర్దేశిస్తాయి. అయితే కొంత మంది తల్లిదండ్రులు తమ ఆశలను పిల్లలపై బలవంతంగా మోపుతారు. పిల్లల అభిరుచులు, సామర్థ్యాలు గమనించకుండా ఒకే రకమైన కోర్సులు, ఒకే లక్ష్యాలను విధిస్తారు. మరికొందరు చదువుపై శ్రద్ధ చూపకుండా పూర్తిగా ఉపాధ్యాయులపై బాధ్యత నెట్టేస్తారు. ఆర్థిక ఒత్తిళ్లు, కుటుంబ కలహాలు, తల్లిదండ్రుల నిర్లక్ష్యం కూడా విద్యార్థి మనసుపై తీవ్ర ప్రభావం చూపి వైఫల్యానికి దారి తీస్తాయి. కాబట్టి విద్యార్థి వైఫల్యానికి కుటుంబం బాధ్యత కూడా గణనీయమే ఉపాధ్యాయుల పాత్రను విస్మరించలేం. ఉపాధ్యాయుడు కేవలం పాఠాలు చెప్పే వ్యక్తిమాత్రమే కాదు, విద్యార్థి జీవితానికి మార్గదర్శి. అయితే నేటి విద్యావ్యవస్థలో కొంతమంది ఉపాధ్యాయులు బోధనను కేవలం ఉద్యోగంగా మాత్రమే భావిస్తున్నారు. విద్యార్థుల మనోస్థితిని అర్థం చేసుకోకుండా, వ్యక్తిగత శ్రద్ధ చూపకుండా యాంత్రికంగా పాఠాలు పూర్తిచేస్తున్నారు. పరీ



క్షల మార్కులకే పరిమితమై, సృజనాత్మకతను, ఆలోచనా శక్తిని పెంపొందించడంలో విఫలమవుతున్నారు. ఉపాధ్యాయుడు విద్యార్థిని ప్రోత్సహించాల్సినచోట, నిరుత్సాహపరిస్తే అది విద్యార్థి వైఫల్యానికి కారణమవుతుంది. విద్యా వ్యవస్థ కూడా విద్యార్థి వైఫల్యంలో ప్రధానపాత్రపోషిస్తుంది. మన విద్యావిధానం ఇప్పటికీ మార్కుల కేంద్రంగా కొనసాగుతోంది. పరీక్షల్లో ఎక్కువ మార్కులు సాధించడమే విజయంగా భావించే పరిస్థితినెలకొంది. విద్యార్థి ప్రతిభను, నైపుణ్యాలను, ఆసక్తులను గుర్తించడంలో వ్యవస్థ విఫలమవుతోంది. రాటుదేల్చే పద్ధతి, భారం మోపే పాఠ్యాంశాలు, ఒత్తిడిని పెంచే పరీక్షా విధానం విద్యార్థులను మానసికంగా బలహీనులను చేస్తోంది. కొంతమంది విద్యార్థులు ఈ ఒత్తిడిని తట్టుకోలేక పూర్తిగా వెనుకబడిపోతున్నారు. ఇది విద్యార్థి తప్పుకంటే వ్యవస్థ వైఫల్యంగా భావించాలి. సమాజ ప్రభావం కూడా విద్యార్థి జీవితాన్ని ప్రభావితంచేస్తుంది. సమాజం విజయాన్ని ఒకే కొలమానంతో కొలుస్తోంది. డాక్టర్, ఇంజనీర్, ప్రభుత్వ ఉద్యోగం. ఈ పరిమిత దృక్పథం విద్యార్థుల్లో అనవసరమైన పోటీని, ఒత్తిడిని పెంచుతోంది. వృత్తివిద్య, కళలు, క్రీడలు వంటి రంగాలను తక్కువగా చూడటం వల్ల అనేక మంది విద్యార్థులు తమ సహజ ప్రతిభను వెలికితీయలేకపోతున్నారు. సమాజం అంగీకారం లేకపోవడం వల్ల వారు విఫలులుగా ముద్ర వేయబడుతున్నారు. ఇక సాంకేతిక పరిజ్ఞానం విషయానికి వస్తే, అది విద్యార్థికి వరమా శాపమా అన్నది వినియోగంపై ఆధారపడి ఉంటుంది. సరైన మార్గనిర్దేశం లేకపోతే ఇంటర్నెట్, సోషల్ మీడియా విద్యార్థిని చదువు నుంచి దూరం చేస్తాయి. ఈ విషయంలో కూడా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు బాధ్యత వహించాల్సిన అవసరం ఉంది. అంతిమంగా చెప్పాలంటే, విద్యార్థివైఫల్యానికి ఒకరిని మాత్రమే బాధ్యుడిగా చూపడం సరికాదు. విద్యార్థి, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యావ్యవస్థ, సమాజం అందరూ కలిసి బాధ్యత వహించాలి. విద్యార్థిని అర్థంచేసుకొని, అతని సామర్థ్యాలకు అనుగుణంగా మార్గనిర్దేశం చేయగలిగితే వైఫల్యం తగ్గుతుంది. తప్పులను చూపించడమే కాకుండా, సరిదిద్దే అవకాశాలు కల్పించాలి. అప్పుడు మాత్రమే విద్యార్థి నిజమైన విజయాన్ని సాధించగలడు. వైఫల్యం అంతిమం కాదు. అది ఒక పాఠం. ఆ పాఠాన్ని సమాజం మొత్తం కలిసి నేర్చుకున్నప్పుడే విద్యార్థి విజయవంతమైన పౌరుడిగా ఎదుగుతాడు. ●

# విబి జి రామ్‌జి బిల్లుకు లోక్‌సభ సై



- ఉపాధి హామీ చట్టం రద్దు పట్ల సభ్యుల తీవ్ర ఆందోళన
- ప్రతులను చించేసిన విపక్షాలు
- స్పీకర్ ఓం బిర్లా ఆగ్రహం
- సభాసంప్రదాయాలు పాటించాలని వినతి
- విపక్షాల ఆరోపణలను తిప్పికొట్టిన కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్
- సభ నేటికి వాయిదా

**న్యూఢిల్లీ, డిసెంబరు 18:** మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం స్థానంలో కొత్త చట్టాన్ని తీసుకొచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపింది. "వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్‌గ్రామీణ్ (విబి జి రామ్ జి) పేరుతో రూపొందించిన ఈ బిల్లుపై గురువారం సభలో తీవ్ర గందరగోళం నెలకొంది. ఈ బిల్లుపై చర్చ సందర్భంగా విపక్షాలు తీవ్ర నిరసన వ్యక్తం చేశాయి. అయితే, బిల్లును స్టాండింగ్ కమిటీకి పంపించాలని డిమాండ్ చేస్తూ ప్రతిపక్ష సభ్యులు వెల్‌లోకి దూసుకొచ్చి నిరసన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా, డిఎంకే నాయకులు టిఆర్ బాలు, సమాజ్‌వాదీ పార్టీ నాయకులు ధర్మేంద్ర యాదవ్ సహా పలువురు విపక్ష పార్టీల సభ్యులు.. జి రామ్‌జి బిల్లును తీవ్రంగా వ్యతిరేకించారు. బిల్లుకు వ్యతిరేకంగా సభలో ఆందోళన చేపట్టారు. ఈ పథకానికి మహాత్మా గాంధీ పేరును తొలగించడంఅంటే జాతిపితను అవమానించడమేనని, కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ఈ బిల్లుతో రాష్ట్రాలపై మరింత భారం పడుతుందని ఆరోపించారు.

మరోవైపు జి రామ్‌జి బిల్లును కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ సమర్థించారు. బిల్లుపై లోక్‌సభలో మాట్లాడిన శివరాజ్ సింగ్.. కాంగ్రెస్ ప్రభుత్వం అనేక పథకాలకు నెహ్రూ పేరును పెట్టిందని గుర్తుచేశారు. ఇప్పుడు ఎన్డీయే ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తోందని విమర్శించారు. ప్రభుత్వానికి పేర్లు మార్చాలనే దురుద్దేశం ఉందంటూ ప్రియాంక గాంధీచేసిన వ్యాఖ్యలనుసైతం ఆయన ఖండించారు. పేర్లు మార్చాలనే ఉద్దేశం కేవలం ప్రతిపక్ష పార్టీలకు మాత్రమే ఉందన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వంలోని తమ ప్రభుత్వం కేవలం పనిపై మాత్రమే దృష్టి పెడుతోందని చెప్పుకొచ్చారాయన. ఎంజిఎన్‌ఆర్ ఇజిఎ అవినీతి సాధనం తప్ప మరొకటి కాదని, అందరితో చర్చించిన తర్వాతే కొత్త చట్టాన్ని తీసుకువచ్చామని కేంద్రమంత్రి ఉద్ఘాటించారు. కేంద్రమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ కామెంట్స్‌పై ప్రతిపక్ష సభ్యులు మరింత ఆగ్రహం వ్యక్తం చేశారు. పలువురు ఎంపీలు సభ వెల్‌లోకి ప్రవేశించి.. బిల్లుకు వ్యతిరేకంగా నిరసన తెలిపారు. బిల్లు ప్రతులను చించేశారు. ఈ సందర్భంగా స్పీకర్ ఓంబిర్లా మాట్లాడుతూ.. 'కాగితాలను చించివేయడానికి ప్రజలు మిమ్మల్ని ఇక్కడికి పంపలేదు. దేశం మిమ్మల్ని చూస్తోంది'. అని విపక్ష సభ్యులను హెచ్చరించారు. బిల్లుపై సుదీర్ఘంగా చర్చించారని చెప్పారు. దీంతో మరింత ఆగ్రహానికి గురైన విపక్ష సభ్యులు.. బిల్లు ప్రతులను చించిపడేశారు. వీరిఆందోళనల మధ్యే బిల్లు ఆమోదం పొందినట్లు స్పీకర్ ప్రకటించారు. అనంతరం సభను వాయిదా వేశారు.

సభ వాయిదా పడిన తరువాత పార్లమెంట్ వెలుపల ప్రియాంక గాంధీ వాద్రా మీడియాతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన జి రామ్‌జి బిల్లును ప్రతిపక్షాలు తీవ్రంగా వ్యతిరేకించాయన్నారు. "బిల్లులోని వివరాలను చదివిన ఎవరికైనా గ్రామీణ ఉపాధి హామీ పథకం ఎలా పూర్తి కాబోతోందో అర్థమవుతుంది. ఈ బిల్లు వలన రాష్ట్రాలపై మరింత ఆర్థిక భారం పడనుంది. రాష్ట్రాలు ఆర్థికంగా ఇబ్బంది పడే అవకాశంఉంది. ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎ పథకం పేదలకు అండగాఉండేది. కానీ, ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన బిల్లు పేదలకు పూర్తి వ్యతిరేకంగా ఉంది"అంటూ కేంద్రప్రభుత్వం తీరుపై ప్రియాంక గాంధీ తీవ్ర విమర్శలు చేశారు.

కేంద్ర మంత్రి ఎస్పీ సింగ్ బఘేల్ మాట్లాడుతూ.. లోక్‌సభలో విపక్ష సభ్యులు వ్యవహరించిన తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సభలో బిల్లు కాగితాలను చించివేశారని.. ఇది ఖండించాల్సిన అంశమన్నారు. ప్రజాస్వామ్యంలో ఇలాంటి చర్యలకు చోటు లేదన్నారు. జీ రామ్‌జీ బిల్లుపై సుదీర్ఘంగా చర్చించారని.. అయినప్పటికీ విపక్ష సభ్యులు బిల్లు ప్రతులను చించడం దారుణమన్నారు. ప్రజల ప్రయోజనాల కోసమే ఈ బిల్లును తీసుకురావడం జరిగిందని కేంద్ర మంత్రి స్పష్టం చేశారు.

కేంద్ర మంత్రి చిరాగ్ పాశ్వాన్ మాట్లాడుతూ.. లోక్‌సభలో ప్రతిపక్ష సభ్యులు వ్యవహరించిన తీరు ఏమాత్రం ఆమోదనీయం కాదన్నారు. మీకు వ్యతిరేకించే హక్కుఉంది. కానీ, ఈ రకమైన ప్రవర్తనసరికాదు. బిల్లు ప్రతులను చించివేయడం, విమానాలు తయారుచేయడం, స్పీకర్‌పై విసరడంసరికాదు. దేశంలోనేఅతిపురాతన పార్టీగా చెప్పుకునే కాంగ్రెస్‌పార్టీ సభ్యులు.. ఇలా ప్రవర్తించడం గర్హనీయం. బిల్లుకు పెట్టిన పేరును విపక్ష సభ్యులు వ్యతిరేకిస్తున్నారు. కానీ, రాముడి పేరు ఆ మహాత్మా గాంధీకి ఎంతో ఇష్టమైన పేరు. ఆయన తుదిశ్వాస విడిచే సమయంలోనూ హే రామ్ అనే అన్నారు అంటూ కేంద్ర మంత్రి పేర్కొన్నారు. ఇక లోక్‌సభలో బిల్లు ఆమోదం పొందిన నేపథ్యంలో.. ఈ బిల్లును రాజ్యసభలో ప్రవేశపెట్టనున్నారు.



# యుట్యూబర్ ఇంట్లో ఇడి సోదాలు

## కోట్ల విలువైన కార్లు సీజ్

## పిఎంఎల్‌ఏ కింద కేసు నమోదు

**న్యూఢిల్లీ, డిసెంబరు 18:** కేంద్ర దర్యాప్తు సంస్థ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) అధికారులు ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన ఓ యూట్యూబర్ ఇంట్లో సోదాలు చేసింది. ఆన్‌లైన్ బెట్టింగ్, గ్యాంబ్లింగ్ యాప్‌ల ద్వారా కోట్ల రూపాయలు సంపాదించినట్లు అందిన ఫిర్యాదు మేరకు తనిఖీలు చేసినట్లు తెలిపింది. ఉత్తరప్రదేశ్‌లోని ఉన్నావ్‌కు చెందిన అనురాగ్ ద్వివేది అనే యూట్యూబర్ ఇంట్లో సోదాలు నిర్వహించి లంబోర్ఘిని ఉరుస్, బీఎండబ్ల్యూ జెడ్4, మెర్సిడెస్ బెంజ్ వంటి తొమ్మిది ఖరీదైన స్పోర్ట్స్ కార్లను స్వాధీనం చేసుకుంది.

అనురాగ్ తన యూట్యూబ్ ఛానెల్ ద్వారా 'స్కై ఎక్స్చేంజ్' వంటి పలు నిషేధిత బెట్టింగ్ యాప్‌లను ప్రమోట్ చేసేవాడని ఇడి అధికారులు తెలిపారు. దేశంలో ఆన్‌లైన్ బెట్టింగ్ చట్టవిరుద్ధమైనప్పటికీ, అతని ప్రచార వీడియోలు చూసి పెద్ద సంఖ్యలో ప్రజలు ఈ యాప్‌లలో చేరినట్లు దర్యాప్తులో తేలింది. ఈ యాప్‌ల ద్వారా వచ్చిన అక్రమ సంపాదనను మనీ లాండరింగ్ నిరోధక చట్టం (పిఎంఎల్‌ఏ) కింద దర్యాప్తు చేస్తున్నారు. హవాలా ఆపరేటర్లు, బినామీ బ్యాంకు ఖాతాలు (మ్యూల్ అకౌంట్స్), మధ్యవర్తుల ద్వారా నగదు రూపంలో చెల్లింపులు స్వీకరించినట్లు అధికారులు గుర్తించారు.

ఈ డబ్బును చట్టబద్ధమైనదిగా చూపించేందుకు ప్రయత్నిస్తూ లగ్జరీ కార్లు, ఇతర ఖరీదైన వస్తువులు కొనుగోలు చేసినట్లు తేలింది. అంతేకాకుండా, ఈ అక్రమ సంపాదనతో దుబాయ్‌లో స్థిరాస్తులు కొనుగోలు చేసినట్లు కూడా ఇడి దర్యాప్తులో వెల్లడైంది. ఈ నెట్‌వర్క్‌పై పశ్చిమ బెంగాల్ పోలీసులు కూడా సిలిగురిలో సోదాలు నిర్వహించారు. సోను కుమార్ ఠాకూర్, విశాల్ భరద్వాజ్ అనే మరో ఇద్దరు నిందితులను గుర్తించారు. ఈ వ్యవహారంలో ఇంకా ఎవరెవరు ఉన్నారు, ఎంత మొత్తం అక్రమంగా సంపాదించారనే కోణంలో ఇడి దర్యాప్తు ముమ్మరం చేసింది.

# నాకిష్టమైన పదం టారిఫ్స్

## 10 నెలల్లో 8 యుద్ధాలు ఆపా: అమెరికా అధ్యక్షుడు ట్రంప్



**వాషింగ్టన్, డిసెంబరు 18:** ఇంగ్లీష్ భాషలో నాకు అత్యంత ఇష్టమైన పదం 'టారిఫ్స్' అని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. ఆ టారిఫ్‌లతోనే తాను అధికారంలోకి వచ్చిన పది నెలల్లోనే ఎనిమిది యుద్ధాలను ఆపానని పేర్కొన్నారు. సుంకాల వల్లే ఇది సాధ్యమైందని ట్రంప్ పునరుద్ఘాటించారు. తన ముందు అధ్యక్షుడిగా ఉన్న జో బైడెన్ దేశాన్ని గందరగోళ పరిస్థితుల్లోకి నెట్టి తన చేతుల్లో పెట్టారని ఆయన తీవ్రంగా విమర్శించారు. దేశ ప్రజలను ఉద్దేశించి ప్రసంగించిన 79 ఏళ్ల ట్రంప్ తన ప్రభుత్వ 2026 అజెండాను ఆవిష్కరించారు. కెనడా, మెక్సికో, భారత్ వంటి దేశాలపై విధించిన టారిఫ్‌ల వల్లే అమెరికా ఆర్థిక వ్యవస్థకు మేలు జరిగిందని సమర్థించుకున్నారు. "టారిఫ్‌ల వల్ల మేం అనుకున్నదానికంటే చాలా ఎక్కువ డబ్బు సంపాదించాం" అని తెలిపారు. వలసలు, ద్రవ్యోల్బణం వంటి సమస్యలకు బైడెన్ ప్రభుత్వమే కారణమని ఆరోపించారు. తాను అధికారం చేపట్టే నాటికి దేశం గందరగోళంలో ఉంది. ఇప్పుడు దాన్ని నేను సరిదిద్దుతున్నాని ట్రంప్ పేర్కొన్నారు.



# ఎఐ రాక... అందరికీ మంచిదే

## - ఎలాన్ మస్క్

**వాషింగ్టన్, డిసెంబరు 18:** టెక్నాలజీ కొత్త పుంతలు తొక్కుతున్న వేళ... ఎఐ రాకతో అందరికీ మంచే జరుగుతుందని ప్రపంచ కుబేరుడు, టెక్ దిగ్గజం ఎలాన్ మస్క్ అభిప్రాయపడ్డారు. భవిష్యత్తులో ప్రజలు డబ్బు ఆదా చేసుకోవాల్సిన అవసరమే ఉండదని, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రాకతో "యూనివర్సల్ హై ఇన్‌కమ్" (అందరికీ అధిక ఆదాయం) అందుబాటులోకి వస్తుందని మస్క్ జోస్యం చెప్పారు. ఎఐ, రోబోటిక్స్ రంగాల్లో వస్తున్న విప్లవాత్మక మార్పుల వల్ల పేదరికం పూర్తిగా తొలగిపోతుందని, సంప్రదాయ ఉద్యోగాల అవసరం కూడా తగ్గుతుందని పునరుద్ఘాటించారు. ఉత్పాదకత విపరీతంగా పెరిగితే, గాలి మాదిరిగానే డబ్బే అసంబద్ధంగా మారుతుందని ఆయన అభిప్రాయపడ్డారు.

అయితే, మస్క్ వ్యాఖ్యలపై సోషల్ మీడియాలో తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. 600 బిలియన్ డాలర్ల సంపద కలిగిన వ్యక్తి, ఇతరులకు డబ్బు దాచుకోవద్దని సలహా ఇవ్వడం విడ్డూరంగా ఉందని పలువురు నెటిజన్లు ఎద్దేవా చేస్తున్నారు. "అన్నీ ఉచితంగా లభిస్తే, వస్తువులను ఉత్పత్తి చేయడానికి ఎవరికి ప్రోత్సాహం ఉంటుంది?" అని ఒకరు ప్రశ్నించగా, "అందరికీ ఆదాయం వచ్చినా, అధిక ఆదాయం అనే నిర్వచనం ఎప్పటికప్పుడు మారుతూనే ఉంటుంది" అని మరొకరు అభిప్రాయపడ్డారు.

# బ్రిక్స్ అధ్యక్ష బాధ్యతలు భారత్‌కు

- అధికారికంగా జనవరి 1న స్వీకరణ
- బదలీ చిహ్నం అందించిన బ్రెజిల్




**న్యూఢిల్లీ, డిసెంబరు 18:** బ్రిక్స్ అధ్యక్ష పదవి తాజాగా భారత్‌కు దక్కింది. బ్రెజిల్ నుండి భారత్‌కు ఈ బాధ్యత బదిలీ అయ్యింది. 2026 జనవరి 1న భారత్ అధికారికంగా బ్రిక్స్ అధ్యక్షపదవిని చేపట్టనుంది. బ్రిక్స్ అధ్యక్ష పదవి బదిలీచిహ్నాల ద్వారా బ్రెజిల్ బలమైన సందేశాన్ని అందించింది. 2024లో రష్యా నుండి అందుకున్న ఉక్కు సుత్తి తర్వాత, బ్రెజిల్ అమెజాన్ రెయిన్‌ఫారెస్ట్ నుండి రీసైకిల్‌చేసిన కలపతో తయారు చేసిన సుత్తిని భారత దేశానికి బహూకరించింది. బ్రెజిల్‌కు చెందిన బ్రిక్స్ ప్రతినిధి మోరిసియో లిరియో మాట్లాడుతూ, ఈచిహ్నం స్థిరమైన అభివృద్ధి, భాగస్వామ్యాల బలం, భారతదేశ నాయకత్వంపై విశ్వాసాన్ని సూచిస్తుందని అన్నారు. డిసెంబర్ 11-12 తేదీలలో బ్రెసిలియాలో నిర్వహించిన బ్రిక్స్ షెర్పాస్ సమావేశం, కేవలం ప్రతీకాత్మక అంశాలపై కాకుండా, నిర్దిష్ట పురోగతిని సమీక్షి ంచడంపై దృష్టి సారించింది. 2025 వరకు బ్రెజిల్ అధ్యక్ష పదవిలో సాధించిన విజయాలను 11సభ్యదేశాల ప్రతినిధులు సమీక్ష నిర్వహిం చారు. బ్రెజిల్ విదేశాంగమంత్రి మోరో వియెరామాట్లాడుతూ, బ్రిక్స్ ఔచిత్యాన్ని ఇకపై కేవలం దౌత్య ప్రకటనలద్వారా కొలవలేమని, సాధారణ ప్రజల జీవితాలపై దానినిజమైన ప్రభావంద్వారా ఆధారపడి

# వివాహ వివాదం.. తల్లిదండ్రులను చంపి, ముక్కలుగా నరికిన కిరాతకుడు

## ఉత్తర ప్రదేశ్‌లో దారుణం



**లక్నో, డిసెంబరు 18:** ముస్లిం భార్య వల్ల వివాదం నేపథ్యంలో ఓ వ్యక్తి అత్యంత దారుణానికి పాల్పడ్డాడు. గ్రైండింగ్ రాయితో తల్లిదండ్రులను కొట్టిచంపాడు. మృతదేహాలను ముక్కలుగా నరికాడు. ఆభాగాలను సిమెంట్ సంచుల్లో పట్టు కెళ్లినదిలోపడేశాడు. వృద్ధదంపతుల మిస్సింగ్‌పై దర్యాప్తుచేసిన పోలీసులు చివరకు నిందితుడిని అరెస్టుచేశారు. యుపిలోని జౌన్‌పూర్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. 62 యేళ్ల శ్యామ్ బహదూర్ రిటైర్డ్ రైల్వే ఉద్యోగి. 60 యేళ్ల భార్య బబితతో కలిసి అహ్మద్‌పూర్‌లో నివసిస్తున్నాడు. వారికి ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. కాగా, ఐదేళ్లకిందట ఇంజినీర్ అయినకొడుకు అంబేష్ కోల్‌కతాకు చెందిన ముస్లిం మహిళను పెళ్లిచేసుకున్నాడు. ఈ జంటకు ఇద్దరు పిల్లలు. అయితే కొడుకు మతాంతర వివాహాన్ని తల్లి దండ్రులు అంగీకరించలేదు. ముస్లిం భార్యను విడిచిపెట్టాలని కొడుకుఅంబేష్‌కు తండ్రి తెగేసి చెప్పాడు. దీంతో ఈ విషయమై చాలాకాలంగా ఆ కుటుంబంలో గొడవలు జరుగుతున్నాయి. మరోవైపు ముస్లిం భార్యను వదిలేయాలని అంబేష్ నిర్ణయించాడు దీనికి ఆమెకూడా అంగీకరించింది. భరణం కింద రూ. 5లక్షలు ఇవ్వాలని ఆమె డిమాండ్ చేసింది. ఈ నేపథ్యంలో అంబేష్ మూడు నెలల కిందట కోల్‌కతానుంచి సొంత గ్రామానికి చేరుకున్నాడు. తల్లిదండ్రుల ఇంట్లో ఉంటున్నాడు. భార్యకు భరణంఇచ్చేందుకు రూ.5లక్షలు ఇవ్వాలని తల్లిదండ్రులతో గొడవ పడుతున్నాడు. ఈనెల 8న డబ్బువిషయమై తల్లి దండ్రులు, అంబేష్ మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. ఆగ్రహించిన అతడు గ్రైండింగ్ రాయిలో తల్లి బబితతలపై కొట్టడంతో ఆమె కుప్పకూలిపోయింది. ఇదిచూసి తండ్రి శ్యామ్ ఆందోళన చెందాడు అరిచి స్థానికులను అప్రమత్తం చేశాడు. అయితే అదే గ్రైండింగ్‌రాయితో తండ్రితలపై పలుమార్లు కొట్టిచంపాడు. తర్వాత మృతదేహాలను రంపంతోనరికాడు. సిమెంట్ సంచుల్లో శరీరభాగాలను మూటకట్టి కారులో తీసుకెళ్లి సమీపంలోని నదిలో పడేశాడు.

# బెల్జియం కోర్టులో మెహుల్ చోక్సీకి పెద్ద షాక్

## త్వరలోనే భారత్‌కు అప్పగింత



**బ్రస్సెల్స్, డిసెంబరు 18:** పంజాబ్ నేషనల్ బ్యాంకు రూ.13 వేల కోట్ల కుంభకోణానికి పాల్పడి పరారీలో ఉన్న ప్రధాన నిందితుడు, వజ్రాల వ్యాపారి మెహుల్ చోక్సీకి బెల్జియంలో మరోసారి ఎదురుదెబ్బ తగిలింది. భారతదేశానికి తనను అప్పగించకుండా నిలువరించాలంటూ దాఖలు చేసిన అప్పీల్‌ను బెల్జియంలోని అత్యున్నత న్యాయస్థానం కోర్ట్ ఆఫ్ కసేషన్ తిరస్కరించింది. భారత్‌లో తనకు న్యాయం దక్కదని, తీవ్రంగా హింసకు గురి చేస్తారని చోక్సీ చేసిన వాదనలకు ఎలాంటి ఆధారాలు లేవని న్యాయస్థానంస్పష్టంచేసింది. చోక్సీపై భారత్‌లో కోర్టులు సక్రమంగా పనిచేస్తున్నాయి. అతడికి అన్యాయం జరిగే అవకాశంలేదని పేర్కొంది. అలాగే, అతడు ప్రస్తావించిన 'ఫ్లాగ్రంట్ డినైల్ ఆఫ్ జస్టిస్', హింస, అవమానకరమైన ప్రవర్తనకు సంబంధించిన ఆరోపణలు నమ్మదగినవిగా లేవని స్పష్టం చేసింది. అప్పీల్‌ను తిరస్కరించడమేకాకుండా, చోక్సీకి 104 యూరోల జరిమానా కూడా విధించింది. అయితే, అంతకుముందు అంట్వెర్ప్ కోర్ట్ ఆఫ్ అప్పీల్‌లోని ఇండిక్ట్‌మెంట్ ఛాంబర్ ఇచ్చిన తీర్పును కోర్ట్ ఆఫ్ కసేషన్ సమర్థించింది. మెహుల్ చోక్సీసమర్పించిన పత్రాలు, భారత్‌లో అతడికి వాస్తవంగా తీవ్రమైన ప్రమాదం ఉందని నిరూపించేందుకు సరిపోవని ఇప్పటికే దిగువ కోర్టు తేల్చింది. కోర్టు ఆఫ్ కసేషన్ పాత్ర చట్టం సరిగ్గా అమలైందా? న్యాయపరమైన ప్రక్రియలు పాటించబడ్డాయా?అన్నదాన్ని మాత్రమే పరిశీలించడమేనని స్పష్టంచేస్తూ, ఈకేసులో ఎలాంటి చట్టపరమైన లోపాలు లేవని వెల్లడించింది.

ఇక, మెహుల్ చోక్సీ తన అప్పీల్‌లో అంటిగ్వా నుంచి తనను కిడ్నాప్ చేయడానికి ప్రయత్నించారన్న ఆరోపణలు, ఇంటర్‌పోల్ రెడ్ నోటీసు తొలగింపు, మీడియా కథనాలు, భారత్‌లో న్యాయమైన విచారణ జరగదన్న వాదనలను ప్రస్తావించాడు. అయితే, 2022 నవంబరులో ఇంటర్‌పోల్‌కు చెందిన సిసిఎఫ్ అతడి పేరును రెడ్ నోటీసు జాబితా నుంచి తొలగించి నప్పటికీ, అది ఈ కేసుపై ప్రభావం చూపదని బెల్జియం కోర్టు స్పష్టంచేసింది. మొదటిసారి అన్ని వివరాలు సమర్పించకపోయినా, అప్పీల్ దశలో పూర్తి వాదనలు వినిపించే అవకాశం లభించినందున చోక్సీ హక్కును ఉల్లంఘించబడలేదని తెలిపింది. కాగా, ముంబై ప్రత్యేక కోర్టు 2018 మే, 2021జూన్‌లో జారీచేసిన అరెస్టువారెంట్లు చెల్లుబాటవుతాయని ఇప్పటికే బెల్జియంలోని దిగువ కోర్టులు తేల్చిన విషయాన్ని కోర్ట్ ఆఫ్ కసేషన్ మరోసారి ధ్రువీకరించింది.

కాగా, బెల్జియం కోర్టు ఇచ్చిన తీర్పుతో వజ్రాల వ్యాపారి మెహుల్ చోక్సీని భారత్‌కు అప్పగించే ప్రక్రియకు మార్గంసుగమమైంది. అయితే, చోక్సీ 2018 జనవరిలో, పిఎన్‌బి కుంభకోణం వెలుగులోకి రావడానికి కొద్ది రోజుల ముందే భారత్‌ను విడిచిపెట్టాడు. ఈ కేసులో సిబిఐ ఆరోపణల ప్రకారం.. మొత్తం రూ. 13 వేల కోట్ల స్కాం కేసులో చోక్సీ ఒక్కరే రూ.6,400 కోట్లను కాజేశాడు. భారత్ అభ్యర్థనమేరకు 2018 డిసెంబరులో ఇంటర్‌పోల్ అతడి పేరును రెడ్ నోటీసులో చేర్చింది. 2024 ఆగస్టు 27న భారత్ బెల్జియంకు అధికారికంగా చోక్సీ అప్పగింత అభ్యర్థన పంపింది. విచారణ సమయంలో అతడి భద్రత, మానవ హక్కులు, వైద్య అవసరాలు, జైలు సదుపాయాలపై బెల్జియంకు ఇండియా హామీలు కూడా ఇచ్చింది. తాజా తీర్పుతో చోక్సీ భారత్‌కు రప్పించే ప్రయత్నాలకు మరింత బలం చేకూరినట్టయింది.



# సూపర్ పవర్ అంత ఈజీ కాదు

## ఆర్‌బిఐ మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్

**న్యూఢిల్లీ, డిసెంబరు 18:** భారతదేశం సూపర్ పవర్ హోదా వైపు దూసుకుపోతున్నప్పటికీ, ఇంకా చేయాల్సిన పని చాలా ఉందని ఆర్‌బిఐ మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్ అభిప్రాయపడ్డారు. ఇటీవల ఓ పాడ్‌కాస్ట్‌లో ఆయన మాట్లాడుతూ, రాబోయే 30 సంవత్సరాల కాలంలో దేశ ప్రజలందరూ ఎంతో కష్టపడినప్పుడే ఆ లక్ష్యాన్ని చేరుకోగలుగుతామని అన్నారు. ప్రస్తుతం మనంసాధిస్తున్న వృద్ధిని చూసి అలసత్వం ప్రదర్శించరాదంటూ ఉద్యోగ, నైపుణ్య కల్పనలోను, నాణ్యమైన విద్య, ఉత్పాదకత వంటి విషయాల్లోను ఎన్నో సవాళ్లు ఎదుర్కొంటున్నట్టు చెప్పారు. ప్రస్తుత వృద్ధి గణాంకాలు చూసి మనం ఆర్థిక బలంగా ఉన్నట్టు భావించకూడదని వ్యాఖ్యానించారు. భారతదేశం సూపర్ పవర్‌కాదని, అలా అనుకోవడం పరిణతి లేనితనానికి నిదర్శనమని రాజన్ అన్నారు.

# సంక్షిప్తంగా..

## బంగ్లాదేశ్‌లో మరో రెండు భారత వీసా కేంద్రాలు మూసివేత

**ఢాకా, డిసెంబరు 18:** పొరుగు దేశమైన బంగ్లాదేశ్‌లో మరో రెండు భారత వీసా కేంద్రాలు మూతపడ్డాయి. రాజ్‌షాహి, ఖుల్నాలోని వీసా కేంద్రాలను భారత్ మూసేసింది. రాజధాని ఢాకాలోని వీసా కేంద్రాన్ని ఇప్పటికే భారత్ మూసివేసిన విషయం తెలిసిందే. బంగ్లాదేశ్ నాయకులు, అసాంఘిక శక్తుల నుంచి బెదిరింపులు నేపథ్యంలో భద్రతా కారణాల దృష్ట్యా వీసా కేంద్రాలను భారత్ మూసివేసింది. భద్రతా పరిస్థితుల దృష్ట్యా రాజ్‌షాహి, ఖుల్నాలోని వీసా కేంద్రాలను మూసివేస్తున్నాం. వీసా దరఖాస్తు కోసం గురువారం బుక్ అయిన అపాయింట్‌మెంట్ స్లాట్‌లను మరో తేదీకి మారుస్తాం' అని భారత్ ప్రకటించింది. మరోవైపు ఢాకాలోని జమున ఫ్యూచర్ పార్క్‌లో భారత వీసా అప్లికేషన్ సెంటర్ భారత్ బుధవారం మూసివేసిన విషయం తెలిసిందే.

## బంగ్లాలో రాజకీయ సంక్షోభం భారత్‌కు ముప్పే: వాజిద్

**ఢాకా, డిసెంబరు 18:** బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా కుమారుడు సాజిబ్‌వాజేద్ సంచలన వ్యాఖ్యలు చేశారు. బంగ్లాలో రాజకీయ సంక్షోభం భారత్‌కు పెద్ద ముప్పు అని పేర్కొన్నారు. ఆ దేశంలో ఇప్పటికే ఉగ్రవాద శిక్షణ శిబిరాలు నెలకొన్నాయని ఆరోపించారు. ఓ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ సాజిబ్‌వాజేద్ ఈ వ్యాఖ్యలు చేశారు. వచ్చే యేడాది ఫిబ్రవరిలో బంగ్లాలో ఎన్నికలు జరగనున్న సంగతి తెలిసిందే. దీనిపై స్పందిస్తూ.. ప్రజాస్వామ్యాలను అణగదొక్కేలా ప్రస్తుత తాత్కాలిక ప్రభుత్వం విధానాలను అనుసరిస్తోందని ఆరోపించారు. ఇస్లామిక్ పార్టీలకు అధికారం కట్టబెట్టాలనే ప్రయత్నం జరుగుతోందన్నారు. ఈ మార్పు భారత భద్రతపై ప్రత్యక్షమైన ప్రభావం చూపనుందన్నారు.

## క్షమాపణ చెప్పకపోతే చంపేస్తానని సిఎం నితీష్‌కు వార్నింగ్

**పాట్నా, డిసెంబరు18:** బీహార్‌లో హిజాబ్ వ్యవహారం ముదురుతోంది. ముఖ్యమంత్రి నితీష్‌కుమార్ వ్యవహారశైలిని ఇప్పటికే విపక్ష పార్టీలు దుమ్మెత్తిపోస్తుంటే ఇప్పుడు దాయాది దేశానికి చెందిన ఓ గ్యాంగ్‌స్టర్ బెదిరింపులకు దిగాడు. పాకిస్థాన్‌కు చెందిన ఒక గ్యాంగ్‌స్టర్ షాజాద్ భట్టి వీడియో సందేశం ద్వారా బీహార్ ముఖ్యమంత్రి నితీష్‌కుమార్‌ను హెచ్చరించారు. వైద్యురాలి హిజాబ్‌ను తొలగించినందుకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశాడు. లేదంటే చంపేస్తానంటూ బెదిరించాడు రాజ్యాంగ పదవిలో ఉన్న వ్యక్తి ఇలా ప్రవర్తిస్తాడా? అని ప్రశ్నించాడు. తక్షణమే క్షమాపణ చెప్పాలని కోరాడు. చెప్పకపోతే పరిణామాలు తీవ్రంగా ఉండవచ్చని వార్నింగ్ ఇచ్చాడు. గ్యాంగ్‌స్టర్ వీడియోను పరిశీలిస్తున్నట్లు బీహార్ డిజిపి వినయ్‌కుమార్ అన్నారు. వీడియోపై పాట్నా డిజి స్థాయిలో విచారణ జరుగుతోందని మిగతా విషయాలు తర్వాత పంచుకుంటామని చెప్పారు.

## ఓల్డ్ కార్లకు ఢిల్లీలో నో ఎంట్రీ

**న్యూఢిల్లీ, డిసెంబరు 18**: ఢిల్లీలో కాలుష్య నియంత్రణకు అధికారులు కఠిన చర్యలు చేపట్టారు. ముఖ్యంగా పాత వాహనాల విషయంలో ఎలాంటి మినహాయింపులకు తావివ్వడం లేదు. ఢిల్లీ సరిహద్దులతో పాటు నగరంలోనూ వివిధ ప్రాంతాల్లో చెక్ పోస్టులు ఏర్పాటు చేసి తనిఖీలు నిర్వహిస్తున్నారు. బీఎస్ 4, ఆపై ప్రమాణాలు ఉన్న వాహనాలకు తప్ప మిగతా వాహనాలను ఢిల్లీలోకి అనుమతించడం లేదు. పాత వాహనాలతో వచ్చే వారికి భారీ మొత్తంలో జరిమానాలు విధిస్తున్నారు. బిఎస్ 3 కార్లలో వచ్చే వారికి రూ.20 వేలు ఫైన్ వేస్తామని హెచ్చరిస్తున్నారు. జరిమానా తప్పించుకోవాలంటే సరిహద్దు నుంచే వెనక్కి వెళ్లిపోవాలని ఆదేశిస్తున్నారు. పోలీసుల తనిఖీలతో ఢిల్లీ, ఫరీదాబాద్ వాసులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. కాలుష్య నియంత్రణలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని విమర్శిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ వైఫల్యానికి తాము మూల్యం చెల్లించాల్సి వస్తోందని వాపోతున్నారు.

## ఇమ్రాన్ ఖాన్ చెల్లెళ్లపై ఉగ్ర కేసు

**ఇస్లామాబాద్, డిసెంబరు 18:** పాక్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ చెల్లెళ్లపై అక్కడి పోలీసులు యాంటీ టెర్రరిస్ట్ యాక్ట్ కింద కేసు నమోదు చేశారు. ఇమ్రాన్‌ను కలుసుకోవడానికి అధికారులు నిరాకరించడంతో ఆయన సోదరీమణులు అడియాలా జైలు ముందు ఆందోళన చేయగా పోలీసులు వారిపై ఎఫ్‌ఐఆర్ నమోదు చేశారు. వారితో పాటు పిటిఐ నేతలు, కార్యకర్తలపైన కేసు నమోదు చేసినట్లు రావల్పిండి పోలీసులు తెలిపారు. పాకిస్థాన్ పీనల్ కోడ్‌లోని సెక్షన్ 120బి (నేరపూరిత కుట్ర) ఆరోపణలు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఇటీవల ఇమ్రాన్ ఖాన్ జైలులో చనిపోయారని ప్రచారం జరిగింది. దీంతో ఆయన కుటుంబ సభ్యులతో పాటు పార్టీ నేతలు, కార్యకర్తలు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. ఈ క్రమంలోనే ఇమ్రాన్ ఖాన్‌ను ఉంచిన రావల్పిండిలోని అడియాలా జైలు ముందు ఆందోళనకు దిగారు.



# నాంపల్లి కోర్టుకు హాజరైన మంత్రి సీతక్క

## కరోనాను ఆరోగ్యశ్రీలో చేర్చాలని 2021లో ధర్నా

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, డిసెంబరు 18:** తెలంగాణ మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క ఈరోజు నాంపల్లిలోని ప్రజాప్రతినిధుల కోర్టుకు హాజరయ్యారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నమోదైన కేసు విచారణలో భాగంగా ఆమెతో పాటు ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ కూడా కోర్టు ఎదుట హాజరయ్యారు. 2021లో కరోనా మహమ్మారి తీవ్రంగా ఉన్న సమయంలో, కోవిడ్ చికిత్సను ఆరోగ్యశ్రీ పథకంలో చేర్చాలని డిమాండ్ చేస్తూ సీతక్క, అప్పటి ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్ హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద నిరాహార దీక్ష చేపట్టారు. కరోనా రోగులకు ఉచిత అంబులెన్స్ సేవలు అందించాలని, వ్యాధితో మరణించిన వారి కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ఆర్థిక సాయం చేయాలని వారు అప్పటి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

అయితే, లాక్‌డౌన్ నిబంధనలు అమల్లో ఉండగా ఇందిరాపార్క్ వద్ద ధర్నా నిర్వహించి, కరోనా వ్యాప్తికి కారణమవుతున్నారని ఆరోపిస్తూ అప్పటి కేసీఆర్ సర్కార్ సీతక్క, బల్మూరి వెంకట్‌పై కేసు నమోదు చేసింది. ఆ కేసుకు సంబంధించిన విచారణలో భాగంగానే ఇవాళ వారిద్దరూ న్యాయస్థానం ముందు హాజరయ్యారు.

# గిరిజన ఉద్యోగులకు బడ్జెట్ నిధులు విడుదల

**హైదరాబాద్, డిసెంబరు 18, ప్రభాతవార్త :** రాష్ట్రంలోని పలు జిల్లాల్లో గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పనిచేస్తున్న ఉద్యోగులకు మూడవ విడత బడ్జెట్ నిధులను విడుదల చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు దీనికి సంబంధించి గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రధానంగా రాష్ట్రంలోని అసిఫాబాద్, ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల జిల్లాల్లో గిరిజన సంక్షేమ శాఖలో పనిచేస్తున్న 4వ తరగతి ఉద్యోగుల గౌరవ వేతన మూడో విడత బడ్జెట్‌కు సంబంధించిన సొమ్మును విడుదల చేశారు. ఇందులో భాగంగా ఆసిఫాబాద్ జిల్లాలో పనిచేస్తున్న నాలుగో తరగతి ఉద్యోగుల వేతన నిధులు రూ.42 లక్షల 50 వేలు, నిర్మల్ జిల్లాకు రూ.16 లక్షల 20వేలు, అదిలాబాద్ జిల్లాకు రూ.75 లక్షల 55 వేలు, మంచిర్యాల జిల్లాకు రూ.13 లక్షల 50 వేలు విడుదలయ్యాయి.

# హీరోయిన్ నిధిఅగర్వాల్‌కు చేదు అనుభవం

## కెపిహెచ్‌బి కాలనీలో కేసు నమోదు

**హైదరాబాద్ (కెపిహెచ్‌బి కాలనీ), డిసెంబరు 18, ప్రభాతవార్త:** సంపత్తి ప్రమోషన్‌కు హాజరైన ప్రముఖ సినీనటి నిధి అగ్రవాల్‌కు చేదు అనుభవం ఎదురయింది. ముఖ్యఅతిథిగా హాజరైన ఆమెపై కొందరు అసభ్యంగా ప్రవర్తించడంతో నిర్వాహ కులపై కెపిహెచ్‌బి కాలనీ పోలీసులు కేసు నమోదు చేశారు. కెపిహెచ్బి కాలనీలోని లులు మాల్‌లో బుధవారం ప్రభాస్ హీరోగా నటించే రాజా సాబ్ రెండవ పాట లాంచ్ ఈవెంట్ జరుగుతోంది. లాంచ్ అనంతరం నిధి అగర్వాల్ తిరిగి వెళుతుండగా అభిమానులు సెల్ఫీ దిగే క్రమంలో ఒక్కసారిగా గుంపుగా ఆమెపై అసభ్యంగా ప్రవర్తిస్తూ తాకడంతో అసహనానికి గురయ్యారు. దీంతో ఫిర్యాదు ఆధారంగా అసభ్యంగా ప్రవర్తించినందుకు కెపిహెచ్‌బి కాలనీ పోలీసులు సుమోటాగా తీసుకొని నిర్వాకులపై కేసును నమోదు చేశారు. పాట లాంచ్ కార్యక్రమానికి హాజరవుతున్నట్లు ఎలాంటి పర్మిషన్ తీసుకోకపోవడం వల్లే రద్దీ పెరిగి ఇలాంటి సంఘటన చోటుచేసుకుందని అందుకే నిర్వాకులపై కేసు దేశామని సీఐ రాజశేఖర్ రెడ్డి తెలియజేశారు.

# గాంధీ పేరును తొలగించిన ఈరోజు చరిత్రలో చీకటిరోజు

## పెద్దపల్లి ఎంపి గడ్డం వంశీకృష్ణ

**హైదరాబాద్, డిసెంబరు 18, ప్రభాతవార్త:** గాంధీ పేరును తొలగించిన ఈ గురువారం రోజు చరిత్రలో చీటిరోజని పెద్దపల్లి కాంగ్రెస్ ఎంపి గడ్డం వంశీకృష్ణ అన్నారు. పార్లమెంట్ సమావేశాలకు హాజరైన ఆయన మీడియాతో మాట్లాడారు. మహాత్మగాంధీ పేరును పార్లమెంట్ లో బిజెపి ప్రభుత్వం చంపేసిందని అన్నారు. 1948లో గాడ్సేను చంపినట్టుగానే మోడీ ప్రభుత్వం గాంధీ పేరును చంపే సిందని వ్యాఖ్యానించారు. ఉపాధి హామీ పథకం ఎంతోమంది పేదలకు ఉపయో గపడుతుందని చెప్పారు. ఇది ప్రజలు గమనించాలని అన్నారు. ఆర్ఎస్ ఎస్ ఎజెండాను అమలుపరుస్తున్నారని వ్యాఖ్యానించారు. నిరుద్యోగం పెరిగి పోతుంటే 2047 నాటికి వికసిత్ భారత్ ఎలా అవతరిస్తుందని మండిపడ్డారు. బిజెపి ప్రభుత్వం దృష్టిలో అంబానీ, అదానీ భారత్ అన్నారు. గాంధీ ముక్త భారత్ చేయాలనే లక్ష్యంగా బిజెపి పనిచేస్తుందని మండిపడ్డారు. కార్పొరేట్ శక్తుల కోసమే బిజెపి పాలకులు పనిచేస్తున్నారని చెప్పారు. గాంధీ పేరు ఎక్కడ ఉన్నా తుడిచి వేస్తూ తన పేరు ఉండేలా మోడీ చేస్తున్నాడని వ్యాఖ్యానించారు. ఇది మన దేశానికి వ్యతిరేకంగా తీసుకున్న నిర్ణయం అని

# అల్పాదాయ వర్గాల సొంతింటి స్వప్నం తీర్చనున్న హౌసింగ్ బోర్డు

## హైదరాబాద్, ఖమ్మం, వరంగల్‌లో 399 ఫ్లాట్లు విక్రయానికి సన్నాహాలు

**హైదరాబాద్, డిసెంబరు 18, ప్రభాతవార్త:** తెలంగాణ హౌసింగ్ బోర్డు అల్పాదయ వర్గాలకు సొంత ఇంటి స్వప్నం సాకారం చేసేందుకు 399 ఫ్లాట్లను విక్రయానికి పెట్టింది. హైదరాబాద్, ఖమ్మం, వరంగల్ ప్రాంతాల్లోని 339 ఫ్లాట్లను అందు బాటులోని ధరలతో ఎక్కడ ఉన్నమార్కెట్ రేటుకు అనుగుణంగా యథాస్థితిలో ఉన్న ప్రాతిపదికన విక్రయిస్తున్నది. అల్పాదాయ వర్గాల ప్రజలకు మంచి వసతులతో కూడిన సొంత ఇంటి వసతిని కల్పించాలన్న ఉద్దేశ్యంతో ఇప్పటికే అనేక కుటుంబాలు నివసిస్తున్న గేటెడ్ కమ్యూనిటీ అపార్ట్ మెంట్లలోని ఫ్లాట్లను ఆ వర్గాలకు చెందిన వారికే కేటాయించాలనే నిర్ణయం తీసుకున్నామని హౌసింగ్ బోర్డు వైస్ చైర్మన్ విపి గౌతం ఒక ప్రకటనలో తెలిపారు. ఇవన్నీ కూడా అభివృద్ధి చెందిన, అత్యధిక డిమాండ్ ఉన్న ప్రాంతాల్లోని ఫ్లాట్లే అని బహిరంగ మార్కెట్ కంటే చాలా తక్కువ ధరలతో విక్రయిస్తున్నట్లు ఆయన వివరించారు. వివిధ ప్రైవేటు సంస్థల భాగస్వామ్యంతో హౌసింగ్ బోర్డు నిర్మించిన అపార్ట్‌మెంట్లలోని ఈ ఫ్లాట్లను ప్రత్యేకించి అఫర్డబుల్ హౌసింగ్ కింద అల్పాదాయ వర్గాల ప్రజల సొంత ఇంటి కలను నెరవేర్చాలన్న లక్ష్యంతో ఏడాదికి ఆరు లక్షల రూపాయల (నెలకు రూ.50 వేలు) ఆదాయం ఉన్న వారికే వీటిని కేటాయించాలనే నిర్ణయం తీసుకున్నారు. హైదరాబాద్ గచ్చిబౌలి లోని 111 ఫ్లాట్లు, వరంగల్ రైల్వే స్టేషన్ సమీపంలోని అపార్ట్ మెంట్ లో 102 నూ, ఖమ్మంలో శ్రీరామ్ హిల్స్ వద్ద 126 ఫ్లాట్లు అందుబాటులో ఉన్నాయని వైస్ చైర్మన్ విపి గౌతం తెలిపారు. వీటిని కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపుతూ దరఖాస్తు చేసుకున్న వారికి పూర్తి పారదర్శకమైన విధానంలో లాటరీ పద్ధతిలో కేటాయిస్తామన్నారు. ఫ్లాట్ల విస్తీర్ణం 450 చదరపు అడుగుల నుంచి 650 చదరపు అడుగుల వరకు ఉన్నదనీ, గచ్చి బౌలి ప్రాంతంలోని ఫ్లాట్ల ధర రూ.26 లక్షల నుంచి గరిష్టంగా 36.20 లక్షల వరకు మాత్రమే ఉన్నదని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. అలాగే ఖమ్మం, వరంగల్ లో కనిష్టంగా రూ.19 గరిష్ఠంగా రూ.21.50 లక్షలకు, ఖమ్మంలో రూ.11.25 లక్షలకే అందుబాటులోకి తెచ్చా మన్నారు. ఈ ప్రాంతాల్లోని ఫ్లాట్లను కొనుగోలు చేయడానికి ఆసక్తి ఉన్న వారు ఆన్‌లైన్‌లోనూ, మీ సేవా కేంద్రాల్లోనూ దరఖాస్తు చేసుకోవచ్చును. గచ్చిబౌలి ప్రాంతం ఫ్లాట్ల కేటాయింపు లాటరీ ప్రక్రియ జనవరి 6వ తేదీన, వరంగల్‌లోని ఫ్లాట్ల కేటాయింపు జనవరి 8న, ఖమ్మం ఫ్లాట్ల లాటరీ జనవరి 10వ తేదీన నిర్వహిస్తారు. ఈ విక్రయాలకు సంబంధించిన వివరాలన్నీ కూడా హౌసింగ్ బోర్డు వెబ్‌సైట్ హెచ్‌టిటిపిఎస్:// టిజిహెచ్‌బి.//సిజిజి.జిఒవి.ఐఎన్ లో అందుబాటులో ఉన్నాయి.

## పోచంపల్లి హ్యాండ్లూమ్ పార్క్ పునరుద్ధరణకు

# రూ. 14 కోట్లు విడుదల చేయాలి

## కేంద్ర జౌళిశాఖ మంత్రి గిరిరాజ్‌సింగ్‌కు ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి వినతి



**హైదరబాద్, డిసెంబరు 18, ప్రభాతవార్త:** యాదాద్రి జిల్లా పోచంపల్లిలోని పోచం పల్లి హ్యాండ్లూమ్ పార్క్ పునరుద్ధరణకు అవసరమైన రూ 14.00 కోట్ల నిధులను తక్షణమే విడుదల చేయాలని భువనగిరి లోక్‌సభ సభ్యుడు చామల కిరణ్ కుమార్‌రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం ఢిల్లీలో కేంద్ర జౌళి శాఖ మంత్రి గిరిరాజ్‌సింగ్, హ్యాండ్లూమ్స్ కమిషనర్ డా. బీనామహాదేవన్ కలిసి వినతి పత్రం అందించారు. పోచంపల్లి ఇకాట్ హ్యాండ్లూమ్ అభివృద్ధి పథకం కింద ఈ నిధులు అవసరమని ఎంపి సూచించారు. గతంలో బ్యాంకుల నుండి తీసుకున్న పిఎండి రుణాల బకాయిల కారణంగా ఈ హ్యాండ్లూమ్ పార్క్ నిర్వీర్యమై వేలానికి వెళ్లిందని తెలిపారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం హ్యాండ్లూమ్ పార్క్‌ను కొనుగోలు చేసి, సంప్రదాయ నేసవృత్తిదారుల జీవనోపాధిని కాపాడుతూ హ్యాండ్లూమ్ కార్య కలాపాలను పునరుజ్జీవింపజేయడానికి కట్టుబడి ఉందని తెలిపారు. రాష్ట్రంలోని హ్యాండ్లూమ్స్, టెక్స్‌టైల్స్, అప్పారెల్ ఎగుమతి పార్కుల కమిషనర్, గ్రేటర్ నోయిడాలోని ఎన్‌హెచ్ డిసి మేనేజింగ్ డైరెక్టర్ కు అధికారికంగా లేఖ రాశామని గుర్తుచేశారు. కేంద్ర ప్రభుత్వం జౌళి మంత్రిత్వ శాఖ నుండి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి పెండింగ్‌లో ఉన్న నిధులు విడుదల చేయాలని ఎంపి కోరారు. పోచంపల్లి ఇక్కత్‌కు ఉన్న అంతర్జాతీయ గుర్తింపు దృష్ట్యా, ఈ నిధులు విడుదలైతే హ్యాం డ్లూమ్ పార్క్ పునరు ద్ధరించబడటంతో పాటు స్థానిక చేనేత వృత్తిదారులకు ఉపాధి కల్పన, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతోందని వివరించారు.

భారత దేశపు విలువైన హ్యాండ్లూమ్ సంస్కృతి వారసత్వ పరిరక్షణకు దోహదపడు తుందని ఎంపి తెలిపారు. చేనేత వృత్తిదారుల హితాన్ని దృష్టిలో ఉంచుకొని, చారిత్రక పోచంపల్లి హ్యాండ్లూమ్ పార్క్ పునరుద్ధరణకు కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా, వేగవంతమైన నిర్ణయం తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# ఎస్టీ గురుకులాల్లో ఫుడ్ పాయిజనింగ్‌పై ఈట్ రైట్

**హైదరాబాద్, డిసెంబరు 18, ప్రభాతవార్త :** తెలంగాణ వ్యాప్తంగా గిరిజన సంక్షేమ శాఖకు చెందిన గురుకులాలు, ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ సొసైటీల్లో (ఈఎంఆర్ఎస్) ఫుడ్ పాయిజన్ జరగకుండా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే కొన్నేండ్లుగా సాంఘిక సంక్షేమ గురుకులాల్లో ఈట్ రైట్ కొనసాగుతుండగా తాజాగా ఎస్టీ గురుకులాల్లోనూ ఇదే విధానాన్ని అమలు చేయాలని నిర్ణయించారు. ఈ ఈట్ రైట్ కార్యక్రమంలో భాగంగా సురక్ష, పౌష్టికాహారం, శుభ్రమైన గురుకులం పేరుతో ప్రత్యేక కార్యక్రమం చేపడుతున్నది. గతంలో గురుకులాల్లో కుక్ లకు ట్రైనింగ్ ఇవ్వగా, గత 3 నెలలుగా ఈఎంఆర్ఎస్ పరిధిలో పనిచేస్తున్న 300 మంది టీచర్లకు నిపుణులతో ట్రైనింగ్ ఇప్పిస్తుండగా, ఈ ప్రక్రియ చివరి దశకు చేరుకున్నది. వీరిని హెల్త్ వెల్‌నెస్ అంబాసిడర్లుగా అధికారులు ఖరారు చేశారు. కాగా రాష్ట్రంలో గిరిజన సంక్షేమ శాఖ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్ స్టిట్యూషనల్ సొసైటీ పరిధిలో 145 స్కూళ్లు, ఏకలవ్య మోడల్ రెసి డెన్షియల్ సొసైటీ పరిధిలో 23 స్కూళ్లు ఉన్నాయి. ఇందులో సుమారు లక్ష మంది స్టూడెంట్లు చదువుతున్నారు. వీరికి పండ్లు, కూరగాయలు, ఆకు కూరలు, వాటిలో ఉండే పోషకాలతో కూడిన బుక్ లను అధికారులు అందజేశారు. అందరూ విద్యార్థులకు కలిపి ఈట్ రైట్ బుక్, 1 నుంచి 5 తరగతి వరకు ది ఎల్లో బుక్, 6 నుంచి 8వ తరగతి స్టూడెంట్స్ కు పింక్ బుక్, 9, 10 స్టూడెంట్స్ కు గ్రీన్ బుక్ అందజేశారు. వారంలో రెండు రోజులు స్టూడెంట్లతో ఈ బుక్ చదివించాలని టీచర్లను సొసైటీ అధికారులు సూచిం చారు. అంతేకాకుండా ఫుడ్ సేఫ్టీ, హెల్త్ ఆఫీసర్లను సైతం గురుకులాల్లో వారానికి ఒకసారి ఈట్ రైట్‌పై టీచర్లు, వార్డెన్లు, స్టూడెంట్స్‌కు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సొసైటీ అధికారులు నిర్ణయించారు.

# ఉపాధి పథకం పేరు మార్పు గాంధీజీని అవమానించినట్లే

## పేరు తీసేస్తే చరిత్ర మారుతుందా?

## మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ధ్వజం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, డిసెంబరు 18:** మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో గాంధీజీ పేరును తొలగించడం ఆయనను అవమానించినట్లేనని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఆయన పేరును తొలగించడం సిగ్గుచేటని అన్నారు. నిరుపేద కుటుంబాలకు అండగా నిలవాలన్న లక్ష్యంతో 2005లో ఆనాటి యూపీఏ ప్రభుత్వం చారిత్రాత్మకమైన ఉపాధి హామీ పథ కాన్ని తీసుకువస్తే గడచిన పది సంవత్సరాల నుంచి బిజేపీ ప్రభుత్వం ఆ పథకానికి తూట్లు పొడు స్తూ నీరుగారు స్తోందని గురువారం విడుదల చేసిన ఒక ప్రకటనలో విమర్శించారు. మహాత్మా గాంధీ పేరును తొల గించి, రాష్ట్రాలపై 40 శాతం భారాన్ని నెట్టడం పేదల పొట్ట కొట్టడమేనని దుయ్య బట్టారు. ఈ రోజు పార్లమెంట్‌లో తీసుకు వచ్చిన బిల్లు అభివృద్ధి తిరోగమనమేనని, రాష్ట్రాలపై మోయలేని భార మని అన్నారు. భారతదేశ గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలిచిన మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (ఎంజిఎన్ఆర్ఈజిఏ) ఇప్పుడు వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవిక మిషన్ (విబి-జి ఆర్ఎఎం-జి))గా మార్చడం అన్యాయమని అన్నారు. లోక్‌సభలో బలవంతంగా గురువారం ఆమోదించిన ఈ కొత్త బిల్లు, పథకం స్వభా వాన్ని, నిధుల సమీకరణను పూర్తిగా మార్చి వేసిందని విమర్శించారు. దేశానికి స్వాతంత్ర్య ఫలాలు అందించిన మహనీయుడు, జాతిపిత మహాత్మా గాంధీ పేరు మీద 20 ఏళ్ల క్రితం యూ పీఏ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకం పేరు మార్చడం వెనుక కేంద్ర పాలకుల సంకుచిత మనస్తత్వం కనిపిస్తోందని, పేరు మార్చినంత మాత్రాన వారి వైఫల్యాల నుంచి కప్పిపుచ్చు కోలేరని అన్నారు. వికసిత్ భారత్ అని నినాదాలు ఇస్తూ, గ్రామీణ భారతానికి వెన్నెముకగా ఉన్న పథకాన్ని అగాధంలోకి నెడుతున్నారని మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే కేంద్ర ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని పొంగులేటి శ్రీనివాసరెడ్డి డిమాండ్ చేశారు. రాష్ట్రాల హక్కులను కాలరాస్తూ, పేదల కడుపు కొడితే ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

# పర్యాటక సంపదకు రాష్ట్రం నిలయం

## హండ్రెడ్ వీకెండ్ వండర్స్ ఆఫ్ తెలంగాణ కాంటెస్ట్‌లకు ఆహ్వానం

## టూరిజం ఎండి వల్లూరు క్రాంతి



100 వీకెండ్ వండర్స్ ఆఫ్ తెలంగాణ కాంటెస్ట్ పోస్టర్‌ను విడుదల చేస్తున్న జయేష్‌రంజన్. ఎండి వల్లూరు క్రాంతి తదితరులు.

**హైదరాబాద్ (బేగంపేట), డిసెంబరు 18, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఎంతో పర్యాటక సంపద ఉందని, హండ్రెడ్ వీకెండ్ వండర్స్ ఆఫ్ తెలంగాణా కాంటెస్ట్‌లకు ఆహ్వానం పలుకుతున్నట్లు ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని టూరిజం శాఖ ఎండీ వల్లూరు క్రాంతి అన్నారు. గురువారం టూరిజం ప్లాజాలో నిర్వహించిన కార్యక్రమంలో హండ్రెడ్ వీకెండ్ వండర్స్ ఆఫ్ తెలంగాణ పోస్టర్‌ను జయేష్ రంజన్‌తో కల్సి వల్లూరు క్రాంతి తదిత రులు ఆవిష్క రించారు. అనంతరం క్రాంతి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం పరిధిలోని వివిధ జిల్లాల్లో ఉన్న టూరిజం ప్రాంతాలైన నేచర్, వైల్డ్‌లైఫ్, ఆర్ట్, కల్చర్, హెరిటేజ్, వాటర్ బాడీస్, కులినరీ, ఫాం, రూరల్ స్టే, రిసార్ట్స్, స్పిరిచ్యువల్, అడ్వెంచర్ ఇలాంటి వాటిని గుర్తించి వాటి చరిత్ర, లొకేషన్, అక్కడికి ప్రయాణ దూరం, ఎంత ఖర్చు అవుతుంది. ఇలా పూర్తి వివరాలను ట్రావెల్ తెలంగాణా కు పంపాలన్నారు. అలా పంపిన వారందరికి కాంటెస్ట్‌లో ఎంపిక చేస్తామన్నారు. ఇందులో మొదటి బహుమతిగా రూ 50వేలు, రెండవ బహుమతి గా రూ30వేలు, మూడవ బహుమతి గా రూ 20వేలు అందజేయడం జరుగుతుందన్నారు. వీటితోపాటు 10 కన్సోలేషన్ బహుమతులు ఉంటాయన్నారు. ఈ కాంటెస్ట్ డిసెంబరు 10న ప్రారంభమైందని, జనవరి 5వరకు ఎంట్రీ చేసుకోవచ్చ న్నారు. విజేతలైన వారికి సంక్రాంతి రోజున బహుమతులు అందజేయ నున్నా మన్నారు. వీకెండ్ వండర్స్ కాంటెస్ట్ కోసం అన్ని జిల్లాల్లో కలెక్టర్ల ద్వారా పోస్టర్లను ఆవిష్క రించనున్నా మన్నారు. కస్టంటూర్స్‌ని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలన్నారు. ఈ టూర్ లో వినియోగదారుడుకి కావాల్సిన అన్ని సౌకర్యాలు వివిధ రకాలైన ప్యాకేజీలలో అందిం చనున్నా మన్నారు. టూరిస్ట్ డిమాండ్‌కు అనుగుణంగా వారికి కావాల్సిన హోటల్, వాహనం ఇలా ప్రతి ఒక్కటీ అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జీఎం మాన్వీ మహేష్, ప్రియాంక, ఓంప్రకాష్, ఉత్తర మండలం డీసీపీ ఎస్. రష్మీపెరుమాళ్ తదితరులు పాల్గొన్నారు.




యాప్‌ను ప్రారంభించి ప్రసంగిస్తున్న ఆచార్య వెలుదండ నిత్యానందరావు, కోట్లహనుమంతరావు, వనజ ఉదయ్, సుబ్రహ్మణ్యం, శ్రీనివాసరెడ్డి తదితరులు

# తెలుగు వర్సిటీ యునిక్యాంపస్ యాప్ ఆవిష్కరణ

## విద్యార్థుల కోసం రూపొందించాం:

## విసి ఆచార్య వెలుదండ నిత్యానందరావు

**హైదరాబాద్ (నాంపల్లి), డిసెంబరు 18, ప్రభాతవార్త :** తెలుగు భాషా, సంస్కృతుల పరిరక్షణకు కట్టుబడివున్న తెలుగు విశ్వవిద్యాలయం విద్యార్థుల సౌకర్యార్థం యునిక్యాంపస్ పేరున ఒక ప్రత్యేక డిజిటల్ యాప్‌ను అందుబాటులోకి తీసుకురావడం జరిగిందని సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడు ఆచార్య వెలుదండ నిత్యానందరావు నాంపల్లి ప్రాంగణంలో విశ్వవిద్యాలయంలోని నందమూరి తారక రామారావు కళావేదికలో గురువారం యాప్‌ను లాంఛనంగా ఆవిష్కరించి మాట్లాడారు. నేటి ఆధునిక సాంకేతిక డిజిటల్ యుగంలో విద్యావ్యవస్థ కూడా ఆధునికతను అందిపుచ్చుకునే ఆవశ్యకత ఎంతైనా ఉందని, ఇప్పటి విద్యార్థుల జీవనశైలి పూర్తిగా మొబైల్‌ఫోన్లపై ఆధారపడిన నేపథ్యంలో అవసరమైన సమాచారాన్ని ఒకే వేదికపై అందించాలనే సదుద్దేశంతో ఈ యాప్‌ను రూపొందించామని తెలిపారు. తెలుగు విశ్వవిద్యాలయం తన 40ఏళ్ల చరిత్రలో ఆధునిక సాంకేతికతను మేళవించి విద్యార్థులకు అందించిన ఈ యాప్ ఒక వరంగా నిలిచిపోతున్నందుకు గర్వంగా ఉందని అన్నారు. ఈ ప్రయత్నం ఇతర విశ్వవిద్యాలయాలకు కూడా స్ఫూర్తి ఆదర్శంగా నిలుస్తుందని నిత్యానందరావు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రిజిస్ట్రార్ ఆచార్య కోట్ల హనుమంతరావు విశ్వవిద్యాలయ కోర్సుల వివరాలు, సిలబస్, పరీక్షల తేదీలు, చెల్లించాల్సిన ఫీజుల వివరాలు, పరీక్షా ఫలితాలు, నోటిఫికేషన్లు వంటి ఉపయోగకర అంశాలు ఇకపై విద్యార్థుకు వారి మొబైల్‌లోనే అందుబాటులో ఉంటాయన్నారు. భవిష్యత్తులో ఈ యాప్ ద్వారా డిజిటల్ లైబ్రరీ లింకులు, అధ్యాపకులు అందించే లెక్చర్ నోట్స్, పరిశోధనా వ్యాసాలు వంటి పలు విద్యావనరులను కూడా అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఈ ప్రత్యేక యునిక్యాంపస్ యాప్‌ను కొటక్ మహేంద్ర బ్యాంక్ వారి సౌజన్యంతో రూపొందించబడినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కొటక్ మహేంద్ర బ్యాంక్ జోనల్ మేనేజర్ సుబ్రహ్మణ్యం, సెంట్రల్ జోనల్ మేనేజర్ శ్రీనివాసరెడ్డి, పబ్లిక్ రిలేషన్ మేనేజర్ వెంకట సత్యప్రసాద్, డైరెక్టర్ శ్రీనివాస్, విశ్వవిద్యాలయం ఆర్థికాధికారి కె.ఎస్.సుహాసిని, పరిపాలనాధికారి నరసింహమూర్తి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమానికి తెలుగు విశ్వవిద్యాలయం అకడమిక్ డీన్ డా. వనజ ఉదయ్ సమన్వకర్తగా వ్యవహరించారు.

# ఎసిబి వలలో కారేపల్లి రెవెన్యూ ఇన్‌స్పెక్టర్

**కారేపల్లి, డిసెంబరు 18, ప్రభాతవార్త:** కారేపల్లి మండల రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ (ఆర్ఐ) దౌలూరి శుభకామేశ్వరిదేవి ఎసిబి వలలో చిక్కారు. ఎసిబి డిఎస్పీ వై. రమేష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కారేపల్లి మండలానికి చెందిన ఓ వ్యక్తి దగ్గర ఆర్ఐ శుభ కామేశ్వరిదేవి ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ నివేదికను రాసేం దుకు పదివేల రూపాయలు డిమాండ్ చేసింది. దీంతో బాధితుడి వద్దనుండి నగదు రూపంలో లంచం తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్‌గా దొరికిపోయింది. బాధితుని ఫిర్యాదుతో కారేపల్లి లోని ఆమె ఇంటి వద్ద ఎసిబి సిబ్బందితో వలవేసి పట్టు కున్న ట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా డిఎస్పీ రమేష్ మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులు ఏదైనా పని చేసేందుకు లంచం అడిగితే ఏసీబీ టోల్‌ఫ్రీ నెంబర్ 1064 నెంబర్‌కు ఫోన్‌చేసి సమాచారం ఇవ్వాలన్నారు. ఫిర్యాదుదారుని వివరాలను గోప్యంగా ఉంచడం జరుగుతుందన్నారు.



# సిఎంకు చిత్తశుద్ధి ఉంటే జడ్పీ, మండల ఎన్నికలు నిర్వహించాలి

## భవిష్యత్‌లో బిజెపిదే తెలంగాణలో పాలన

## బిజెపిఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

**హైదరాబాద్, డిసెంబరు 18, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిని విస్మరించిన రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి నిజంగా చిత్తశుద్ధి ఉంటే ఎంపిటిసి, జడ్పీటిసి ఎన్నికలతో పాటు మున్సిపల్ ఎన్నికలను వెంటనే నిర్వహించాలని అప్పుడు ప్రజలు ఏ పార్టీపై విశ్వాసం ఉంచుతున్నారో, ఎవరిపై వ్యతిరేకత ఉందో స్పష్టంగా తేలిపోతుందనీ బిజెపిఎల్‌పి నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి సవాల్ విసిరారు. బిజెపి రాష్ట్ర కార్యాలయంలో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో గత 11 సంవత్సరాలుగా మోదీ ప్రభుత్వం గ్రామీణాభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తూ భారీగా నిధులు కేటాయిస్తోందనీ దాని ఫలితంగానే కాంగ్రెస్, బిఆర్ఎస్ మద్దతుదారులు లక్షలాది రూపాయలతో ఓటర్లను ప్రలోభపెట్టినా తెలంగాణలో గతంలో ఎన్నడు లేని విధంగా అత్యధికంగా సర్పంచ్‌లు, వార్డు మెంబర్లు గెలుచుకున్నామని తెలిపారు. దేశ వ్యాప్తంగా మాత్రమే కాకుండా, తెలంగాణ రాష్ట్రంలో కూడా అనేక అభివృద్ధి కార్యక్రమాలను బిజెపి ముందుండి అమలు చేస్తోంది. మోదీ ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలు గుర్తించి, ఆశీర్వదిస్తూ నిర్మల్ జిల్లాలో అత్యధిక సీట్లను గెలిపించి పార్టీకి బహు మానంగా ఇచ్చారు. ఇది ప్రజల విశ్వాసానికి స్పష్టమైన నిదర్శనం. రాబోయే రోజుల్లో కూడా రాష్ట్రవ్యాప్తంగా ఇదే తరహా ఫలితాలు వస్తాయని పూర్తి విశ్వాసం ఉంది. ఈ గ్రామ సర్పంచుల ఎన్నికల ఫలితాలు, రాబోయే అసెంబ్లీ ఎన్నికలకు స్పష్టమైన సంకేతంగా నిలుస్తున్నాయి. ఇవి కేవలం ఆరంభం మాత్రమే, ఈ ఉత్సాహం, ఈ మద్దతు కొనసాగితే, రాష్ట్రంలో భారతీయ జనతా పార్టీని అధికారంలోకి తీసుకువచ్చే దిశగా ఈ ఫలితాలు మార్గం సుగమం చేస్తున్నాయనీ అన్నారు. మేమంతా సమిష్టిగా పని చేస్తూ, రాబోయే ఎన్నికల్లో అత్యధిక స్థానాలు గెలిచి తెలంగాణలో బిజెపి ప్రభుత్వం ఏర్పాటు చేస్తామని విశ్వాసం వ్యక్తంచేశారు. గ్రామీణ ప్రాంతాల్లో కాంగ్రెస్ పార్టీపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత స్పష్టంగా కనిపిస్తోందనీ ఆయన అన్నారు. యావత్ తెలంగాణ రాష్ట్రంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై ప్రజల అసంతృప్తి పెద్ద ఎత్తున వ్యక్తమవుతోంది. నిర్మల్ నియోజకవర్గంలో, మూడు విడతల పోలింగ్‌లో 128 గ్రామ పంచాయతీలకు గాను దాదాపు 80 గ్రామ సర్పంచులను బిజెపి మద్దతుగా గెలిపించినారని వివరించారు. ముధోల్ నియోజకవర్గంలో నిన్న పూర్తయిన ఎన్నికల్లో 178 గ్రామ పంచాయతీలకు గాను 98 గ్రామ పంచాయతీల్లో బిజెపి అనుకూలంగా ఫలితాలు వచ్చాయని చెప్పారు. ఈ ఫలితాలు ప్రజలు కాంగ్రెస్ పాలనను తిరస్కరిస్తూ, భారతీయ జనతా పార్టీపై ప్రజా విశ్వాసం పెరిగిందనడానికి స్పష్టమైన సంకేతాలే. అదేవిధంగా, ఖానాపూర్ నియోజకవర్గంలో కూడా నిర్మల్ జిల్లాకు చెందిన నాలుగు మండలాల్లో బిజెపికి అనుకూలంగా ప్రజలు తీర్పు ఇచ్చారు. ఖానాపూర్ నియోజకవర్గంలో దాదాపు 36 గ్రామ సర్పంచులను బిజెపి మద్దతుతో గెలిపించారు. మొత్తంగా చూస్తే, నిర్మల్ జిల్లాలో 213 మంది గ్రామ సర్పంచులను భారతీయ జనతా పార్టీ మద్దతుతో ప్రజలు గెలిపించారు. గత రెండు సంవత్సరాలుగా తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ పాలన అవినీతిలో మునిగిపోయిందనీ ఆరోపించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమై, ఆరు గ్యారంటీలు, 420 హామీలను గాలికి వదిలేసిన కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధిని పూర్తిగా గాడి తప్పిందని ఆయన విమర్శించారు. గ్రామ సర్పంచుల ఎన్నికల తీర్పు, అవినీతిలో కూరుకుపోయిన కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో ఉన్న తీవ్ర వ్యతిరేకతకు స్పష్టమైన ప్రతిబింబం అని ఆయన అభివర్ణించారు. సింబల్స్ లేవని, అధికారం ఉందని చెప్పి గెలిచిన సర్పంచులను కాంగ్రెస్ ఖాతాలో వేసుకునే ప్రయత్నం చేయడం సరికాదని హితవు చెబుతున్నాం. నిజంగా రేవంత్ రెడ్డికి చిత్తశుద్ధి ఉంటే, తక్షణమే మండలపరిషత్, జిల్లా పరిషత్, మున్సిపల్ ఎన్నికలు నిర్వహించితే, అప్పుడు ప్రజలకు కాంగ్రెస్ పార్టీపై ఎంత వ్యతిరేకత ఉందో స్పష్టంగా బయటపడుతుంది. కేవలం రెండు సంవత్సరాల పాలనలోనే కాంగ్రెస్ ప్రభుత్వంపై ఇంతటి ప్రజావ్యతిరేకత కూడగట్టుకోవడం రేవంత్ రెడ్డి సర్కార్ వైఫల్యానికి నిదర్శనం అని అన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం కళ్ళు తెరవాలి. ఒకవైపు అవినీతి, మరోవైపు ఇచ్చిన ఒక్క హామీ కూడా అమలు చేయని పరిస్థితి.. కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా కుంభకోణాలు, అవినీతిలో మునిగిపోయి ప్రజలను పట్టించుకోవడం మానేసిందనీ ఆరోపించారు. 213 గ్రామాలలో గెలిచిన సరపంచ్‌లు, ఉప సర్పంచ్లు 1300 మంది వార్డ్ సభ్యులకు గురువారం 19 డిసెంబర్ 2025న నిర్మల్ లో సన్మాన కార్యక్రమం జరగనుందని తెలిపారు.



గురువారం బిజెపి రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతున్న ఏలేటి



# సోలార్ విద్యుత్ వినియోగం పెంచే దిశగా చర్యలు తీసుకుంటున్నాం

## సిఎం రేవంత్‌రెడ్డిని కలిసిన ఆర్‌బిఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, డిసెంబరు 18:** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డిని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గవర్నర్ సంజయ్ మల్హోత్రా మర్యాద పూర్వకంగా కలిశారు. బోర్డు సమావేశంలో పాల్గొనేందుకు హైదరాబాద్‌కు వచ్చిన ఆర్బీఐ గవర్నర్ గురువారం జూబ్లీహిల్స్‌లోని ముఖ్యమంత్రి నివాసంలో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం పలు విభాగాల్లో అమలు చేస్తున్న సంస్కరణలను ముఖ్యమంత్రి ఆర్బీఐ గవర్నర్‌కు వివరించారు. విద్యుత్ రంగంలో చేపట్టిన సంస్కరణలు, మూడో డిస్కం ఏర్పాటు వంటి అంశాలను ప్రస్తావించారు. రాష్ట్రంలో సోలార్ విద్యుత్ వినియోగం పెంచే దిశగా తీసుకుంటున్న చర్యలను వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ఆర్థిక విధానాలను ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా ప్రశంసించారు. మరిన్ని సంస్కరణలు, ప్రణాళికలతో ముందుకు సాగాలని ఆకాంక్షి ంచారు. అలాగే, తెలంగాణలో బియుడిఎస్(బ్యానింగ్ ఆఫ్ అన్‌రెగ్యులేటెడ్ డిపాజిట్ స్కీమ్స్) యాక్ట్‌ను నోటిఫై చేయాలని ఆర్బీఐ గవర్నర్ ఈ సందర్భంగా ముఖ్యమంత్రిని కోరారు. యూనిఫైడ్ లెండింగ్ ఇంటర్‌ఫేస్ (యుఎల్ఐ) విషయంలో ఆర్బీఐ తీసుకుంటున్న చొరవతో పాటు, ప్రభుత్వ, ప్రైవేటు డిపాజిట్ల క్లెయిమ్ క్యాంపెయినింగ్ తదితర అంశాలను వివరించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుతో పాటు సిఎం ప్రిన్సిపల్ సెక్రటరీ శేషాద్రి, ఫైనాన్స్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా, హైదరాబాద్ రీజనల్ డైరెక్టర్ చిన్మోయ్ కుమార్, జనరల్ మేనేజర్స్ మేజర్ యశ్పాల్ చరణ్, పాణిగ్రాహి, తదితరులు పాల్గొన్నారు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ‘ముస్తాబు’ కార్యక్రమం అన్ని జిల్లాల్లో అమలు

## ఎపి సిఎం చంద్రబాబు



**విజయవాడ, డిసెంబరు 18, ప్రభాతవార్తప్రతినిధి:** విద్యాశాఖ రూపొందించిన ముస్తాబు వంటి ఉత్తమ విధానాలను అన్ని జిల్లాల కలెక్టర్ లు అనుసరించాలని సీఎం చంద్రబాబు దిశా నిర్దేశం చేశారు. అన్ని భూ రికార్డులు స్టోరేజ్ లేదా క్లౌడ్‌లో ఉంచటం ద్వారా అక్రమాలు అరికట్టవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. ఖర్చుపెట్టే ప్రతిపైసాకు చక్కని ఫలితం ఉండాలని పాలనాయంత్రాంగానికి సూచించారు. రాష్ట్రంలో వివిధ జిల్లాల్లో కలెక్టర్లు అమలు చేస్తున్న కొన్ని విధానాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని ప్రశంసించారు. సచివాలయంలో జరుగుతున్న కలెక్టర్ల సదస్సు 2వ రోజూ సీఎం చంద్రబాబు నూతన ఒరవడికి శ్రీకారం చుట్టారు. వివిధ జిల్లాల్లో అమలు చేస్తున్న ఉత్తమ విధానాలను ఆయా జిల్లాల కలెక్టర్లతోనే ప్రజెంటేషన్ ఇప్పించారు. 6 జిల్లాల కలెక్టర్లు ప్రదర్శించిన విధానాలు రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేయాలని ఆదేశించారు. రొటీన్‌గా కాకుండా ప్రజలకు ఉపయోగపడేలా కలెక్టర్ల కాన్ఫరెన్సులో చర్చ జరగడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. వివిధ అంశాలపై అల్లూరి, పార్వతీపురం మన్యం, ఏలూరు, నెల్లూరు, కడప, అనంతపురం జిల్లాల కలెక్టర్లు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. జిల్లాల్లో అత్యుత్తమ విధానాల ద్వారా సేవలందిస్తున్న కలెక్టర్లను సీఎం అభినందించారు. వచ్చే కలెక్టర్ల సమావేశం నాటికి ప్రజలకు ఉపయోగపడే మరిన్ని వినూత్న ఆలోచనలు, కార్యక్రమాలతో రావాలని పిలుపునిచ్చారు. సాంకేతికత ద్వారా వినూత్న ఆలోచనలతో ప్రజలకు ప్రయోజనం కలిగించాలని దిశానిర్దేశం చేశారు.

# ఆరోగ్య రంగంలో ఎఐ పాత్రను డబ్ల్యుహెచ్ఓ ప్రోత్సహిస్తోంది

## ఎఐ స్ట్రాటజీ నిపుణుడు డాక్టర్ కార్తీక్ అడపా

**విజయవాడ, డిసెంబరు 18, ప్రభాత వార్తప్రతినిధి:** ఏఐ వినియోగంలో భారత్ గేమ్ ఛేంజర్‌గా మారా లంటే మరింత శ్రమించాలని, వినూత్న ఆవిష్కరణలను అందుబాటులోకి తేవాలని ,పంజాబ్ రాష్ట్ర పూర్వ వైద్యారోగ్య శాఖ ప్రత్యేక కార్యదర్శి, డిజిటల్ హెల్త్ కేర్, ఏఐ స్ట్రాటజీ నిపుణుడు డాక్టర్ కార్తీక్ అడపా అన్నారు. ఆరోగ్య రంగంలో ఏఐ పాత్రను డబ్ల్యూహెచ్‌వో ఎలా ప్రోత్సహిస్తోందదన్నారు. విజయవాడలో నిర్వహించిన దక్షి ణ భారతదేశ బహుళ భాగస్వామ్య సమన్వయ ప్రాంతీయ కార్యశాలకు పంజాబ్ రాష్ట్ర పూర్వ వైద్యారోగ్య శాఖ ప్రత్యేక కార్యదర్శి, డిజిటల్ హెల్త్ కేర్, ఏఐ స్ట్రాటజీ నిపుణుడు డాక్టర్ కార్తీక్ అడపా హాజరయ్యారు. ఈ క్రమంలో ఆయన మాట్లాడుతూ కృత్రిమ మేధ (ఏఐ) వినియోగంలో ప్రపంచంలో ప్రస్తుతం భారత్ టాప్10లో ఉందన్నారు. మనం టాప్ 1 2, 3ల్లోకి రావాలంటే చాలా కృషి చేయాలని తెలిపారు. అంతరాలు మొత్తం తొలగకపోయినా ఎక్కువ మందికి ఎదురయ్యే సమస్యలు పరిష్కరించే దిశగా ప్రభుత్వం ఏఐ సొల్యూషన్స్ తయారు చేస్తే సమస్యలు ఎక్కువగా ఎదుర్కొంటున్న పేదలకు న్యాయం జరుగుతుందని అడపా అభిప్రాయం వ్యక్తం చేశారు. సామాన్యులు ఎక్కువగా ఎదుర్కొనే ఆరోగ్య సమస్యల పరిష్కారానికి ఎక్కువ డబ్బులు ఖర్చు పెట్టమని ప్రభుత్వానికి సూచిస్తున్నట్లు వివరించారు. ఎయిమ్స్‌లో వైద్యం అందించే డాక్టర్ ఏ టూల్స్ వాడుతున్నారో క్షేత్ర స్థాయిలో పని చేసే ఆశా కార్యకర్తకు కూడా అవే టూల్స్ అందుబాటులోకి తేగలగాలన్నారు. ఎక్కువ మందిని వేధిస్తున్న క్యాన్సర్ లాంటి సమస్యలకు ఏఐ సేవలు అందుబాటులోకి తేవాలని, అప్పుడే నిర్దేశించుకున్న లక్ష్యం నెరవేరుతుందని పేర్కొన్నారు. రోగుల డేటా గోప్యతను కాపాడడంలో సవాళ్లను ఎలా ఎదుర్కొంటారంటే? ఏఐ సొల్యూషన్స్‌ను విదేశాల నుంచి భారతదేశానికి రానీయకూడదని, మన దేశంలో అభివృద్ధి చేసినవి అదీ మన రాష్ట్రంలో అభివృద్ధి చేసినవి వాడాలని ఆయన వివరించారు. ఎక్కడికక్కడ సాంకేతికత వినియోగించే ప్రయత్నం చేయాలని కార్తీక్ అడపా సూచించారు. లోకల్ డేటాతో లోకల్ మోడల్స్ రూపొందించాలన్నారు. సమాచారానికి ఎలా భద్రత కల్పించాలి? సైబర్ సెక్యూరిటీ ద్వారా ఎలా రక్షణ కల్పించాలి? అనే అంశాలనూ ఏఐ స్ట్రాటజీ డాక్యుమెంట్‌లో పొందుపరిచినట్లు వివరించారు. ఆరోగ్య రంగంలో ఏఐ వినియోగం, ఇతర అంశాలపై 300 పేజీల ఏఐ వ్యూహ పత్రాన్ని (ఏఐ స్ట్రాటజీ డాక్యుమెంట్) డబ్ల్యూహెచ్‌వో, భారత ప్రభుత్వం తరఫు నుంచి డబ్ల్యూహెచ్‌వో రూపొందించిందని ఆయన అన్నారు. ఈ డాక్యుమెంట్‌ను రాష్ట్ర ప్రభుత్వాలకు, కేంద్ర పాలిత ప్రాంతాలకు అందించినట్లు పేర్కొన్నారు. వారిచ్చిన ఫీడ్ బ్యాక్ ఆధారంగా ఈ డాక్యుమెంట్ ఇంకా అభివృద్ధి చేస్తామని ఆయన వివరించారు. ఫౌండేషనల్ డాక్యుమెంట్‌కు పూర్తి స్వరూపం తీసుకొచ్చే కసరత్తు ప్రస్తుతం జరుగుతోందని, ఆ పరిపూర్ణ ఏఐ డాక్యుమెంట్‌ను ఫిబ్రవరి 19న ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆవిష్కరిస్తారని కార్తీక్ అడపా స్పష్టం చేశారు.

# అధికారిగా కాదు.. ప్రజా సేవకుడిగా గుర్తింపు పొందాలి

## మార్పు, గౌరవం తీసుకొస్తే మీరు విజయం సాధించినట్టే
## నిజాయితీగా సేవ చేయండి, ధైర్యంగా నిర్ణయాలు తీసుకోండి
## సివిల్ సర్వీస్ అధికారుల శిక్షణ ముగింపు కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, డిసెంబరు 18:** ప్రజలు మిమ్మల్నిఒక అధికారిగా మాత్రమే కాకుండా ప్రజాసేవకుడిగా గుర్తుపెట్టుకోవడం వల్లనే సివిల్ సర్వీసెస్ హోదాకు న్యాయం చేయగలిగిన వారుగా నిలిచిపోతారని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. గురువారం మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో ఆల్ ఇండియా సర్వీసెస్, సెంట్రల్ సర్వీసెస్ అధికారులు 10 వారాల శిక్షణ కోర్సును విజయవంతంగా పూర్తి చేసుకున్న సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు డిప్యూటీ సీఎం ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ఎంసీఆర్‌హెచ్ఆర్డీ వైఎస్ ఛైర్ పర్సన్ శాంతకుమారి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ..ప్రతిరోజు కార్యాలయాన్ని వదిలి వెళ్లే ముందు మిమ్ములని మీరు ఒక ప్రశ్న వేసుకోండి..మీ పని ద్వారా ఎవరి జీవితంలో అయినా ఒక మంచి మార్పు, గౌరవాన్ని తీసుకువచ్చిందా ప్రశ్నించుకోండి? అవును అని సమాధానం వస్తే.. ఆరోజు మీరు ఎంత కఠినపరిస్థితుల్లో విధి నిర్వహణ చేసినా.. మీరు విజయం సాధించినట్టేనని డిప్యూటీ సీఎం పేర్కొన్నారు. నిజాయితీతో సేవ చేయండి.. ధైర్యంగా నిర్ణయాలు తీసుకోండి.. మానవత్వంతో వ్యవహరించండి.. నాయకత్వంతో ముందుకు సాగండి.. అని శిక్షణలో ఉన్న అధికారులకు భట్టి విక్రమార్క సూచించారు. కఠినమైన శిక్షణా కార్యక్రమం ముగిసిపోయి.. బాధ్యత, వివేకం, విచక్షణ, ప్రజా విశ్వాసంతో కూడిన కొత్త ఆరంభాన్ని అందిస్తోందని అన్నారు. అనేక రాష్ట్రాల నుంచి వచ్చిన 203 మంది అధికారులు ఈ కోర్సును విజయవంతంగా పూర్తి చేసుకున్నారు. ఈ సందర్భంగా వారందరికీ ఉప ముఖ్యమంత్రి అభినందనలు తెలిపారు. ఇక్కడకు మీరంతా ఇంజినీర్లు, వైద్యులు, ఆర్థిక నిపుణులు, న్యాయవాదులు, సాంకేతిక నిపుణులుగా వచ్చారు... ఇక్కడనుంచి అత్యున్నత స్థాయి గుర్తింపు, గౌరవంతో బయటకు వెళుతున్నారు. మీ ప్రతిభకు అర్హతలకు అనేక అవకాశాలు మీ ముందున్నాయని డిప్యూటీ సీఎం అన్నారు. ఈ రోజు కేవలం ఆనందపడే కార్యక్రమం మాత్రమే కాదు. ఇక్కడనుంచి బాధ్యతలు, బదిలీలు, క్లిష్టమైన సమస్యలు, ప్రజలకు సంబంధించిన ఫైళ్లు, ఉంటాయి. మీరు సరైన సమయంలో స్పందించాల్సిన అంశాలు ఉంటాయి. విధి నిర్వహణలో మీరు నిరక్ష్యంతో తీసుకునే ఒక నిర్ణయం ఒకరి జీవితాన్ని ఏళ్లపాటు ప్రభావితం చేయగలదు.. అందువల్ల నిబద్ధతతో విధి నిర్వహణ చేయాలని ఉప ముఖ్యమంత్రి సూచించారు. పాలనలో ఒత్తిడి, కఠినమైన సందర్భాలు, మానవీయతతో కూడిన నిర్ణయాలు, ప్రజాశ్రేయస్సు కోసం శ్రమించే సందర్భాలు.. ఉంటాయి. కొన్ని సందర్భాల్లో ప్రశంసలు, విమర్శలు కూడా వస్తాయి. అన్నింటిని.. ప్రజల కోసమే అన్నభావనతో ముందుకు వెళ్లాలని ఆయన చెప్పారు. యువ సివిల్ సర్వెంట్స్ గా అడుగు పెడుతున్న ఈ సమయం.. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వేగవంతంగా అభివృద్ధిని సాధిస్తోంది. మీరు ప్రజాసేవలోకి అడుగుపెడుతున్న ఈ సమయం వేగవంతమైన మార్పుల కాలం, టెక్నాలజీ పాలన రూపు రేఖలు మారుస్తోంది అన్నారు. సోషల్ మీడియా విజయాలను, తప్పిదాలను రెండింటినీ విస్తృతంగా ప్రచారం చేస్తోంది. ప్రపంచ ఆర్థిక, వాతావరణ, భౌగోళిక, రాజకీయ షాకులు ముందస్తు హెచ్చరిక లేకుండా వస్తున్నాయి అని డిప్యూటీ సీఎం వివరించారు. ప్రజలు మరింత సమాచారం కలిగి ఉన్నారు. అదేవిధంగా ప్రశ్నిస్తున్నారు.. కారణాల పట్ల చాలా అసహనంగా ఉన్నారన్నారు. మీరు నిరంతరం నేర్చుకోవాలి.. అవసరమైతే పాత విషయాలను వదలిపెట్టాలి. ఎప్పటికప్పుడు మార్పులకు అనుగుణంగా రూపాంతరం చెందాలని శిక్షణ పూర్తి చేసుకున్న అధికారులకు డిప్యూటీ సీఎం సూచించారు. ఈ మారుతున్న ప్రపంచంలో మూడు అంశాలు మాత్రం ఎప్పటికీ మారకూడదన్నారు. క్యారెక్టర్, క్రెడిబులిటీ, కంపాషన్... ఇవి మృదువైన విలువలు కావు. ఒక అధికారి సంపాదించగలిగే అత్యంత కఠినమైన ఆస్తులు ఇవే, అదే సమయంలో కోల్పోవడం కూడా అత్యంత సులభమైనవే అన్నారు. ఉద్యోగం ప్రారంభ దశలో అధికారం అంటే ప్రాముఖ్యత అని పొరపాటు పడటం సులభం, దయచేసి ఇది గుర్తుంచుకోండన్నారు. అధికారాన్ని మీరు స్వంతం చేసుకోరు. మీరు దాన్ని నమ్మకంగా నిర్వహిస్తారు రాజ్యాంగం నుంచి, చట్టం నుంచి, చివరికి ప్రజల నుంచి. మీరు పౌరుల కంటే పైగా ఉంచబడలేదు. విధానం మరియు వాస్తవం మధ్య, రాష్ట్రం మరియు అత్యంత బలహీనమైన పౌరుడి మధ్య మీరు నిలబెట్టబడ్డారు అన్న వాస్తవాన్ని గుర్తించాలని డిప్యూటీ సీఎం తెలిపారు. మీ విజయాన్ని మీరు జారీ చేసిన ఉత్తర్వుల సంఖ్యతో కొలవరు. మీరు అక్కడ ఉండటం వల్ల ఎన్ని జీవితాలు నిశ్శబ్దంగా సులభమయ్యాయో దానితో కొలుస్తారు అని తెలిపారు. మీరు వేర్వేరు రాష్ట్రాల నుంచి, వేర్వేరు ప్రాంతాల నుంచి, వేర్వేరు నేపథ్యాల నుంచి వచ్చారు. కొంతమంది తెలంగాణకు చెందినవారు, మరికొందరు దేశంలోని ఇతర ప్రాంతాల నుంచి వచ్చినవారు. మీరు వేర్వేరు సేవలను, వేర్వేరు విభాగాలను ప్రాతినిధ్యం వహిస్తున్నారన్నారు. కానీ మీ అందరినీ కలిపే ఒక ప్రశ్న ఉంది. మీ స్నేహితులు, కుటుంబ సభ్యులు తప్పకుండా అడిగి ఉంటారు అని ఆసక్తిగా డిప్యూటీ సీఎం ప్రశ్నించారు.

ఈ వయసులో, ప్రపంచవ్యాప్తంగా అవకాశాలు ఉన్నప్పుడు కూడా, మీరు ఎందుకు ప్రభుత్వ సేవను ఎంచుకున్నారు? మీరు కార్పొరేట్ రంగంలోకి వెళ్లి సంపాదించవచ్చు కదా? పేరు ప్రఖ్యాతులు సంపాదించవచ్చు కదా? స్వంత వ్యాపారాలు నిర్వహించుకోవచ్చు కదా? కానీ మీరు రాష్ట్ర వ్యవస్థలో పనిచేయాలని, ప్రజా కార్యక్రమాలను అమలు చేయాలని, మీ పేరు కూడా తెలియని పౌరులకు సేవ చేయాలని ఎంచుకున్నారు. ఆ ఎంపికకు విలువ ఉంది, అదే మీ వ్యక్తిత్వాన్ని నిర్వచిస్తుందని పేర్కొన్నారు. పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ ప్రధాని అయినప్పుడు, మహాత్మా గాంధీని సలహా అడిగారు. అప్పుడు గాంధీజీ స్పందిస్తూ ఎప్పుడైనా సందేహం వచ్చినప్పుడు, మీరు చూసిన అత్యంత పేద, బలహీనమైన వ్యక్తిని గుర్తు చేసుకోండి. మీ నిర్ణయం ఆ వ్యక్తికి ఉపయోగపడుతుందా? అని మీరే మిమ్ములను ప్రశ్నించుకోండి. ఉపయోగపడితే అదే సరైన నిర్ణయంగా భావించండి గాంధీజీ నెహ్రూకు సలహా ఇచ్చారని వివరించారు. ఆ సరళమైన పరీక్ష అనేక తరాలుగా ప్రజాసేవకులను మార్గనిర్దేశం చేసింది. అది ఈ రోజుకీ అంతే ప్రాధాన్యతతో ఉంది అని డిప్యూటీ సీఎం వివరించారు. ప్రజాజీవితంలో మెల్లగా దారి తప్పడం చాలా సులభం. దూరంగా మారడం, బాధ్యత కంటే అధికారాన్ని ఎక్కువగా ఆస్వాదించడం అందులో భాగమే. మొదటిసారి సేవలో చేరినప్పుడు ఉన్న లక్ష్యాన్ని, అనుకోకుండా అయినా, మరిచిపోవడం జరుగుతుందని తెలిపారు. దీని నుంచి మిమ్ములను మీరే కాపాడుకోండి. సాధారణ ప్రజలతో ఎప్పుడూ సంబంధం కొనసాగించండి. గౌరవంతో కలవండి. ఓర్పుతో వినండి. పౌరులతో గడిపే సమయం పని నుంచి దూరం చేసే విషయం కాదు అన్నారు. అదే మీ పని యొక్క అసలైన ఉద్దేశ్యం కూడా అని డిప్యూటీ సీఎం వివరించారు. ఎయిర్ కండిషన్డ్ కార్యాలయంలో కూర్చుని ఫైళ్లను క్లియర్ చేయడం అవసరమే. కానీ అది మానవ సంబంధాలకు ప్రత్యామ్నాయం కాదని గుర్తుంచుకోండన్నారు. ఈ ప్రాంగణాన్ని మీరు జ్ఞానం, ఆత్మవిశ్వాసం, ఆశతో విడిచిపెడుతున్నారు. ఇకమీకు అవసరమయ్యేది వివేచన, వినయం, నైతిక ధైర్యం అని డిప్యూటీ సీఎం వివరించారు. మన సంస్థల భవిష్యత్తు ప్రసంగాల వల్ల లేదా విధానాల వల్ల మాత్రమే కాదు. మీరు ప్రతిరోజూ తీసుకునే నిర్ణయాల వల్ల, చాలాసార్లు నిశ్శబ్దంగా, గుర్తింపు లేకుండా, ఎవరూ చూడని సమయంలో తీసుకునే నిర్ణయాల వల్ల రూపుదిద్దుకుంటుంది అన్నారు. నిజాయితీతో సేవ చేయండి. ధైర్యంతో నిర్ణయాలు తీసుకోండి. సానుభూతితో నాయకత్వం వహించండి అని శిక్షణ అధికారులకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చెప్పారు.



# 23న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

## 22న విఐపి బ్రేక్ సిఫార్సులు రద్దు

**తిరుమల, డిసెంబర్ 18 ప్రభాత వార్తప్రతి నిధి:** కలియుగవైకుంఠ వాసుడు తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో పదిరోజుల వైకుంఠద్వార దర్శనాలకు సంబంధించి చేపట్టే కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం 23వతేదీ మంగళవారం శాస్త్రోక్తంగా నిర్వహించనున్నారు. ఆలయ అర్చకులు, అధికారులు మహాయజ్ఞంలా ఈ కార్యక్రమం చేపట్టడం సంప్రదాయం. ఆలయం అంతటా సుగంధపరిమళ ద్రవ్యంతో శుద్ధి చేస్తారు. ఆలయ అర్చకులు, ఉద్యోగులు పాల్గొని ఆలయంలోపల బంగారువాకిలి నుండి ఉప ఆలయాలు, మహాద్వారం వరకు నీటితో శుభ్రంగా కడుగుతారు. అనంతరం నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి పసుపు, పచ్చాకు, గడ్డకర్పూరం, గంధంపొడి, కుంకుమ, కిచిలిగడ్డ తదితర సుగంధ ద్రవ్యాలు కలగలిపిన పవిత్ర పరిమళ జలాన్ని ఆలయమంతటా సంప్రోక్షణ చేస్తారు. 23న ఆలయంలో జరగాల్సిన అష్టదళపాదపద్మారాధన సేవ రద్దయ్యింది. ఏడాదిలో వైకుంఠ ఏకాదశి, ఉగాది ఆస్థానం, వార్షిక బ్రహ్మోత్సవాలు, ఆణివార ఆస్థానం ముందువచ్చే మంగళవారాల్లో నాలుగుసార్లు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం చేపట్టడం ఆనవాయితీ. 22వతేదీ విఐపి బ్రేక్ సిఫార్సు లేఖలు రద్దుచేశారు.



# ‘ఆధార్’తోనే శ్రీవారి సేవలు!

## మధ్యవర్తులు, దళారుల నియంత్రణకు చర్యలు

**తిరుమల, డిసెంబర్ 18 ప్రభాతవార్తప్రతినిధి:** శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనానికి విచ్చేసే భక్తులకు టిటిడి కల్పిస్తున్న దర్శనం, వసతి తదితర సేవలు దళారుల ప్రమేయం లేకుండా మరింత పారదర్శకంగా నేరుగా అందించేందుకు టిటిడి కార్యచరణ రూపొందించింది. ఇందులో భాగంగా భక్తులకు ఆఫ్‌లైన్(కౌంటర్‌సేవలు), ఆన్‌లైన్ (వెబ్‌పోర్టల్)రెండింటిల అందించే సేవలు అనేకమంది వ్యక్తులు భక్తులను మోసంచేసి భారీ మొత్తంలో డబ్బులు వసూలుచేస్తున్నారు.

భక్తులకు మధ్యవర్తుల ప్రమేయం లేకుండా టిటిడి అందిస్తున్న సేవలలో పారదర్శకతను పెంచేందుకు అధికారులు ఆధార్ ఆధారంగా సేవలందించేందుకు చూడాల్సి ఉంది. ఆఫ్‌లైన్‌లో, ఆన్‌లైన్‌లో టిక్కెట్లు పొందే దళారులు, మధ్యవర్తులపై టిటిడి చర్యలు చేపట్టింది. బల్క్ బుకింగ్‌లకు ఉపయోగించే మొబైల్‌నంబర్లు, మెయిల్ ఐడి ప్రూఫ్‌లు రద్దుచేశారు. ఫేక్ మొబైల్ నంబర్లు, మెయిల్ ఐడిలు ,ఐడి ప్రూఫ్‌లు ఉపయోగించి ఇప్పటికే బుక్‌చేసిన సేవలను ఉపయోగించడానికి అనుమతింపబడవని తెలిపారు. నిజమైన భక్తులు ఫేషియల్ రికగ్నిషన్ సిస్టమ్ ఉపయోగించి మధ్యవర్తి లేకుండా సేవను నేరుగా పొందేలా టిటిడి కార్యాచరణ రూపొందించింది, సరైన ధృవీకరణ కోసం ఆదార్‌సేవలను ఉపయోగించేలా టిటిడి చర్యలు తీసుకుంటోంది.


# ప్రపంచ శాంతి కోసం ధ్యానం

## జెనీవాలో రెండో ప్రపంచ ధ్యాన దినోత్సవంలో శ్రీశ్రీ రవిశంకర్



**జెనీవా, డిసెంబరు 18:** ఒకప్పుడు సామాన్యులకు నిషిద్ధంగా భావించబడిన ధ్యానం.. నేడు ప్రపంచవ్యాప్తంగా ఆమోదం పొందిందని ఆర్ట్ ఆఫ్ లివింగ్ వ్యవస్థాపకులు శ్రీ శ్రీ రవిశంకర్ పేర్కొన్నారు. ప్రపంచంలో అశాంతి మరింత పెరుగుతున్న ఈ కాలంలో ధ్యానసాధనను శాశ్వతంగా అందరి జీవితాలలో భాగంగా స్వీకరించాల్సిన అవసరాన్ని ప్రపంచం గుర్తించాలన్నారు. జెనీవాలోని ఐక్యరాజ్యసమితి కార్యాలయంలో రెండవ ప్రపంచ ధ్యాన దినోత్సవ వేడుకల్లో శ్రీ శ్రీ రవిశంకర్ పాల్గొన్నారు. ప్రపంచ శాంతి కోసం ప్రపంచం ధ్యానం చేస్తోంది అనే అంశంపై గురుదేవ్ ప్రసంగించారు. వ్యక్తిగత శ్రేయస్సుకే కాకుండా, అలసట, ఒత్తిడి, సంఘర్షణలు, అనిశ్చితి, భావోద్వేగ వేదనలతో పోరాడుతున్న సమాజాలకు ధ్యానం ఎంత అవసరమో శ్రీశ్రీ రవిశంకర్ వివరించారు. వయస్సు, ప్రాంతం అనే భేదం లేకుండా ఆందోళన, బర్నౌట్, ఒంటరితనం పెరుగుతున్న ఈ సమయంలో.. ఈ సమస్యలకు బాహ్య పరిష్కారాలు కాకుండా, మానవ మనసును స్థిరపరిచి శాశ్వత పరిష్కారాన్ని అందించే దిశగా కూడా చూడాల్సిన అవసరం ఉందన్నారు. ఈ రోజుల్లో ధ్యానం ప్రపంచానికి ఒక విలాసం కాదన్నారు. శ్రీశ్రీ రవిశంకర్ తన ప్రసంగంలో ఐక్యరాజ్యసమితి ప్రధాన సభ తీర్మానాన్ని ఆమోదించిన 192 దేశాలకు కృతజ్ఞతలు తెలిపారు.

‘అంతర్గత సాధన ఇంత విస్తృతమైన సాంస్కృతిక, శాస్త్రీయ, సంస్థాగత గుర్తింపును పొందడం అరుదైన విషయం.. అది ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా జరుగుతోంది’ అన్నారు. 1980ల ప్రారంభంలో, మనిషి అంతరంగాన్ని అర్థం చేసుకోగలిగే ఈ శాస్త్రానికి పెద్దగా ప్రాధాన్యత లేని సమయంలోనే శ్రీ శ్రీ రవిశంకర్ ప్రపంచానికి ధ్యానాన్ని మరలా పరిచయం చేసే బృహత్తర ప్రయాణాన్ని ప్రారంభించారు అని జెనీవాలోని ఐక్యరాజ్యసమితి, సంబంధిత అంతర్జాతీయ సంస్థల భారతదేశ శాశ్వత ప్రతినిధి అరిందమ్ బాగ్చీ తెలిపారు.




ధర్నానుద్దేశించి ప్రసంగిస్తున్న సీఐటియూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్.వీరయ్య

# సేల్స్ ప్రమోషన్ ఎంప్లాయిస్ యాక్ట్‌ను తక్షణమే పునరుద్ధరించాలి

## సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్.వీరయ్య

**హైదరాబాద్ (ధర్నాచౌక్), డిసెంబరు 18, ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వం రద్దు చేసిన సేల్స్ ప్రమోషన్ ఎంప్లాయీస్ (కండిషన్స్ ఆఫ్ సర్వీస్) యాక్ట్ 1976ను తక్షణమే పునరుద్ధరించాలని సీఐటియూ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్.వీరయ్య డిమాండ్ చేశారు. గురువారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో కేంద్ర ప్రభుత్వం నూతనంగా తెచ్చిన నాలుగు లేబర్‌కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ, తెలంగాణ మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటటివ్స్ యూనియన్ ఆధ్వర్యంలో చలో హైదరాబాద్, ప్రొటెక్ట్ ఎస్‌పిఈ యాక్ట్ పేరుతో ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు ముఖ్య అతిథిగా హాజరై వీరయ్య మాట్లాడుతూ మెడికల్ అండ్ రిప్రజెంటేటివ్స్ చేస్తున్న న్యాయ పోరాటానికి తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. యూని యన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సి.హెచ్ భాను కిరణ్ మాట్లాడుతూ ఎస్‌పిఈ యాక్ట్ పునరుద్ధరించే వరకు పోరాటం కొనసాగుతుందని, లేబర్ కోడ్‌లను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సీఐటియూ రాష్ట్ర కార్యదర్శి జె.వెంకటేష్ మాట్లాడుతూ లేబర్ కోడ్‌లు రద్దు అయ్యేవరకు దేశవ్యాప్తంగా కార్మిక వర్గం కృత నిశ్చయంతో పోరాడుతుందని తెలిపారు. సంయుక్త కార్యదర్శి ఏ.నాగేశ్వరరావు మాట్లాడుతూ 19వ తేదీ జిల్లా కార్మిక శాఖ అధికారుల ముందు జరపబోయే ధర్నాలను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శులు జి.విద్యాసాగర్, జి.శ్రీనివాస్, సదానందచారి, వి.శ్రీనివాస్, కోశాధికారి దుర్గాప్రసాద్, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ నాయకులు, ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ నాయ కులు, బ్యాంక్ ఎంప్లాయీస్ ఫెడరేషన్, ఆల్ ఇండియా లాయర్స్ యూని యన్, యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్, రిజర్వ్ బ్యాంక్ ఎంప్లాయీస్ అసోసియేషన్ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ అసోసియేషన్ నాయకుల, ప్రజాసంఘాల నేతలు పాల్గొన్నారు.

# పంచాయతీ ఫలితాల తీరుతో రేవంత్‌రెడ్డి ఫ్రస్టేషన్ పీక్స్‌కు చేరింది

## మాజీమంత్రి హరీశ్‌రావు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, డిసెంబరు 18:** పంచాయతీ ఎన్నికల ఫలితాల తీరు రేవంత్‌రెడ్డి ఫ్రస్టేషన్ పీక్స్‌కు చేరిందని బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు మండిపడ్డారు. రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు ఫైర్ అయ్యారు. రోజురోజుకీ పరిస్థితులు చేజారి పోతున్నాయనే సత్యం జీర్ణం కాక అవాకులు చెవాకులు పేలుతూ అక్కసు వెళ్లగక్కిందన్నారు. త్వరలోనే తనకు పతనం తప్పదనే సంగతి అర్థమై ఆగమాగం అవుతున్నడని.. తన కుర్చీ త్వరలోనే ఊడుతుందని, తన దోపిడీ ఆగిపోతుందనే భయంతో రేవంత్ రెడ్డి ఇవాళ్టి ప్రెస్‌మీట్‌లో అడ్డగోలుగా వాగిండని.. నాకు, కేటీఆర్‌కు మధ్యమిత్ర భేదం సృష్టించాలని.. తద్వారా బీఆర్ఎస్‌ను బలహీన పరచాలని రేవంత్ రెడ్డి చీప్ ట్రిక్ ప్లే చేస్తున్నాడని మండిపడ్డారు. కానీ రేవంత్ రెడ్డీ నీ చీప్ ట్రిక్కులకు, చిల్లర రాజకీయాలకు ఎవడూ పడిపోడని.. నీ కుట్రలు, కుత్సితాలు ఫలించవు గాక ఫలించవన్నారు. అనేకసార్లు చెప్పినా, మళ్లీ చెబుతున్నా.. రాసి పెట్టుకో రేవంత్ రెడ్డీ.. ఎప్పటికైనా హరీశ్ రావు గుండెల్లో ఉండేది కేసీఆరే.. హరీశ్ రావు చేతిలో ఉండేది గులాబీ జెండానేనన్నారు.



నీ దాష్టీకాలు, దుర్మార్గాలకు వ్యతిరేకంగా తాను కేటీఆర్ మరింత సమన్వయంగా, మరింత సమర్థవంతంగా రెట్టించిన ఉత్సాహంతో పోరాడతామన్నారు. అవినీతిని ఎండగడుతామని, అసమర్థతను నిలదీస్తామన్నారు. ఉద్యమ కాలం నుంచి నేటి దాకా తెలంగాణకు తీరని ద్రోహం చేస్తున్న నిన్ను, నీ కాంగ్రెస్‌ను గద్దె దించుతామని హెచ్చరించారు. నా లక్ష్యమైనా, కేటీఆర్ లక్ష్యమైనా, లక్షలాది గులాబీ సైనికుల లక్ష్యమైనా ఇదేనని.. బీఆర్ఎస్ విజయపథంలో పురోగమించడం ఖాయమన్నారు. మరోసారి కేసీఆర్ ముఖ్యమంత్రి కావడం ఖాయమని.. తెలంగాణ ప్రజల ఆకాంక్షలను సంపూర్ణంగా నెరవేర్చడం ఖాయమని స్పష్టం చేశారు. చిల్లర వేషాలు, చెత్త రాజకీయాలను చూసి ప్రజలు ఛీ కొడుతున్నారని.. ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకోవాలని హితవు పలికారు.

# దివ్యాంగులు, ట్రాన్స్ జెండర్స్‌కు నైపుణ్య శిక్షణ

## - ఉపాధి కల్పనకు ప్రభుత్వం కృషి : మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి



**విజయవాడ, డిసెంబరు 18 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలోని దివ్యాంగులు, ట్రాన్స్ జెండర్స్ కి సాధికారత, నైపుణ్యం పెంపునకు, ఉపాధి కల్పనకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని దివ్యాంగులు, మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ రాష్ట్ర మంత్రి డా. డోలా బాల వీరాంజనేయస్వామి అన్నారు. 21 సెంచరీ సాఫ్ట్ వేర్ సొల్యూషన్స్ సహకారంతో దివ్యాంగులు, ట్రాన్స్ జెండర్స్‌కి ఆన్లైన్ ఎంవర్మమెంట్ స్కిల్ డెవలప్ మెంట్ ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని మంత్రి డా.స్వామి వెలగపూడి సచివాలయంలో గురువారం నాడు జూమ్ ద్వారా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి డా. డోలా బాల వీరాంజనేయస్వామి మాట్లాడుతూ... .రాష్ట్రంలో పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న దివ్యాంగులు, ట్రాన్స్ జెండర్స్‌కి నైపుణ్యం పెంపొందించేందుకు ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమం ద్వారా పోటీ పరీక్షలకు అవసరమైన సబ్జెక్ట్ బోధనతో పాటు డిజిటల్ స్కిల్స్, కమ్యూనికేషన్ స్కిల్స్, కెరీర్ గైడెన్స్, మెంటార్ షిప్ పై శిక్షణ అందిస్తారని తెలిపారు. ఈ శిక్షణ వారిలో నైపుణ్యాన్ని పెంపొందించి ఉపాధి, ఉద్యోగకాశాలకు బాటలు వేసేందుకు దోహదపడుతుందన్నారు. దివ్యాంగులు, ట్రాన్స్ జెండర్ల సంక్షేమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాటుపడుతున్నారన్నారు. ఇటీవల సీఎం చంద్రబాబు నాయుడు దివ్యాంగులకు 7 వరాలు ప్రకటించారన్నారు. దివ్యాంగుల కోసం కలెక్టరేట్లు, ప్రభుత్వ ఆసుపత్రుల్లో లిఫ్టులు ఏర్పాటు చేస్తున్నట్టు మంత్రి తెలిపారు. దివ్యాంగులకు త్వరలో ఉచితంగా త్రీవీలర్స్ పంపిణీ చేస్తామన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా దివ్యాంగులకు రూ.6 వేలు పింఛన్ ఇస్తున్నామన్నారు. ట్రాన్స్ జెండర్స్ కి ఫించన్లతో పాటు గుర్తింపు కార్డులు ,రేషన్ కార్డుల పంఫిణీకి చర్యలు తీసుకుంటున్నామన్నారు. దివ్యాంగులు, ట్రాన్స్ జెండర్స్ సమాజంలో ఎవరికీ తక్కువ కాదని ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలు అందిపుచ్చుకుని ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని మంత్రి డా. డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి పిలుపునిచ్చారు. ఈ శిక్షణను ఉచితంగా అందిస్తున్న 21 సెంచరీ సాఫ్ట్ వేర్ సొల్యూషన్స్ సంస్థ ప్రతినిధులను మంత్రి డా. డోలా బాల వీరాంజనేయస్వామి ఈ సందర్భంగా అభినందనలు తెలియజేశారు.

# కొబ్బరి ధరలు పతనం

**ప్రభాతవార్త నరసాపురం** కొబ్బరి ధర కేవలం మూడు నాళ్ళు ముచ్చటగానే మిగిలిపోయింది. ఇంకా పెరగకపోయినా పరవాలేదు ఒక రూపాయి అటు ఇటు ఉంటే సరిపోతుందని ఎంతో ఆశపడ్డ రైతులకు కొబ్బరి ధర పూర్తిగా నిరాసేపరిచింది. మూడు నెలలు తిరగకుండానే దమాల్మంటూ పడిపోయింది. ఇంకా ఇంకా లాభాలు గడించవచ్చని ఎన్నో కలలు కన్నా కొబ్బరి వ్యాపారస్తులను పీచుపీచు చేసింది. ఉభయగోదావరి జిల్లాలలో కొబ్బరి వ్యాపారం ప్రతి నెల కోట్ల మీద జరుగుతుంది ఈ ఏడాది ఆరంభం నుండి అర్థ సంవత్సరం వరకు రైతు వద్ద పది నుండి 12 రూపాయలకు కొన్నారు. జూన్ తర్వాత ధరకు అసలు పగ్గాలే లేవు. కాయ 15 నుండి 20 రూపాయల వరకు పరుగులు పెట్టింది. పండగ సీజన్లో రైతు వద్ద 25 రూపాయలకు కొన్న రోజులు కూడా ఉన్నాయి. 1000 కాయ పడితే రైతు చేతికి 20000 వచ్చేవి. ఆ దెబ్బతో రైతుకున్న రుణాలు తలపోట్లు కూడా తీరాయి. కొబ్బరి చెట్టుకు పడి పడి దండాలు పెట్టారు. పది చెట్లు ఉంటే చాలు పండగే పండగ. ఇలాగే చాలాకాలం నడుస్తుందని అవసరమైతే పెరుగుతుందని వ్యాపారస్తులు చెబుతుంటే రైతులు నిజం అని నమ్మారు. అలాంటి ఆశలన్నీ ఒక్కసారిగా కూలిపోయాయి. రైతుకు కొబ్బరి చెట్టు వద్ద ఇప్పుడు కడుతున్న రేటు కేవలం ఏడు రూపాయలు మాత్రమే. కాస్త సైజు బాగుంటే మరో రూపాయి కడుతున్నారు. ధర ఎంతగా పతనం అయిపోతుందని రైతులు ఎవరూ ఊహించలేదు. రేటు కుప్ప కూలిపోవడం రైతులు కూడా తీవ్రంగా దిగాలు పడ్డారు.

# ప్రజల వైద్యుడు వై. రామసుబ్బయ్య కన్నుమూత

## అనంతలో ప్రభుత్వ మెడికల్ కాలేజ్ కోసం అవిశ్రాంత పోరాటం జరిపిన నేత



డాక్టర్ రామ సుబ్బయ్య ఫైల్ ఫోటో

**అనంతపురం, డిసెంబర్ 18, (ప్రభాతవార్త బ్యూరో)** ఆయనకు కోపం అంటే తెలియదు. ఎప్పుడూ నవ్వుతూ రోగులు ప్రేమతో పలకరిస్తూ సేవలను అందిస్తూ వచ్చారు. పదవీ విరమణ పొందిన తర్వాత కూడా ఉచితంగా, తక్కువ ఫీజులతో వైద్య సేవలు అందించి ప్రజల డాక్టర్ గా గుర్తింపు పొందిన రిటైర్డ్ అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ వై రామసుబ్బయ్య (91) ఇక లేరు.. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ గురువారం తెల్లవారుజామున మృతి చెందారు. డాక్టర్ రామసుబ్బయ్య మృతదేహానికి శుక్రవారం మధ్యాహ్నం అనంతపురంలోని గుత్తి రోడ్ లో గల హరిచంద్ర ఘాట్ లో అంత్యక్రియలు నిర్వహించినట్లు డాక్టర్ రామసుబ్బయ్య కుమారుడు డాక్టర్ వెంకటేశ్వరరావు, డాక్టర్ శశాంక్ ఇతర కుటుంబ సభ్యులు నిర్ణయించారు. డాక్టర్ రామసుబ్బయ్య మృతిపై రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, టిడిపి జిల్లా అధ్యక్షులు కాలవ శ్రీనివాసులు, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి, అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి, సిపిఐ జాతీయ కార్యదర్శి కే రామకృష్ణ,వైసీపీ జిల్లా అధ్యక్షులు అనంత వెంకట్రామిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి, వైసీపీ నేత కె.వి రమణ తదితరులు ప్రగాఢ సంతాపం ప్రకటించారు. మాజీ సైనికుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మాజీ సైనికులు ప్రత్యేకంగా డాక్టర్ రామసుబ్బయ్య మృతదేహం వద్ద నివాళులర్పించారు. అనంతపురంలో మెడికల్ కాలేజీ కోసం పట్టు వీడని విక్రమార్కునిలా ప్రయత్నించారు. అనంతపురంలో ప్రైవేట్ రంగంలో మెడికల్ కాలేజీ ఏర్పాటు చేయాలని గతంలో పాలకులు ప్రయత్నించినప్పుడు ప్రభుత్వ రంగంలో కాలేజీ ఏర్పాటు చేయాలని వివిధ రూపాల్లో జరిగిన ఉద్యమాల్లో ప్రత్యక్షంగా పరోక్షంగా డాక్టర్ రామసుబ్బయ్య కీలకంగా వ్యవహరించారు. అనంతపురం మెడికల్ కాలేజీ అంటేనే డాక్టర్ రామసుబ్బయ్య గుర్తుకొస్తారు. డాక్టర్ రామసుబ్బయ్య 1933 సంవత్సరం జులై ఒకటో తేదీన జన్మించారు. ఆరోజు వైద్యుల దినోత్సవం కావడం విశేషం. ఆరుగురు అన్నదమ్ముల్లో.. డాక్టర్ రామసుబ్బయ్య నాల్గవ సంతానం. వీరి సతీమణి వై సరస్వతమ్మ మూడు నెలల క్రితమే మరణించగా ఇప్పుడు డాక్టర్ రామసుబ్బయ్య గురువారం మన నుంచి దూరమయ్యారు. డాక్టర్స్ డే రోజున జన్మించిన ఆయన.. కాల మహిమో, యాదృచ్ఛికమో గానీ వైద్య వృత్తిని స్వీకరించారు. ఆ వృత్తిలో అంచలంచెలుగా రాణిస్తూ అనంతపురం ప్రభుత్వ వైద్య కళాశాల స్థాపనకు అవిరళ కృషి చేశారు.

# క్విజ్ విజేత కడప, వక్తృత్వపు పోటీలో విజేత తిరుపతి సర్కిల్

## 21న తిరుపతిలో మంత్రి గొట్టిపాటిచే బహుమతుల ప్రదానం



**తిరుపతి రవాణ, డిసెంబర్ 18 ప్రభాతవార్త** ఇంధన పరిరక్షణ వారోత్సవాల్లో భాగంగా ఏపీఎస్పీడీసీఎల్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్విజ్ పోటీల్లో కడప జిల్లా విద్యార్థులు, వక్తృత్వ పోటీల్లో తిరుపతి సర్కిల్ విద్యార్థి విజేతలుగా నిలిచారని ఏపీఎస్పీడీసీఎల్ ఛైర్మన్ !! మేనేజింగ్ డైరెక్టర్ శివశంకర్ లోతేటి వెల్లడించారు. ఏపీఎస్పీడీసీఎల్ పరిధిలోని తిరుపతి, చిత్తూరు, నెల్లూరు, కడప, అన్నమయ్య, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో 8, 9, 10వ తరగతి విద్యార్థులకు ఇంధన పరిరక్షణ అంశంపై జిల్లా స్థాయిల్లో క్విజ్, వక్తృత్వపు పోటీలను నిర్వహించారు. జిల్లాల పరిధిలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు అయా జిల్లా కార్యాలయాల ద్వారా ఏపీఎస్పీడీసీఎల్ కార్పొరేట్ ఆఫీస్ నుంచి బుధవారం సాయంత్రం ఫైనల్ రౌండ్ పోటీలను నిర్వహించారు. క్విజ్ పోటీల్లో కడప జిల్లా నుంచి జీవీవీ నాగిరెడ్డి (10వ తరగతి, ఏపీ మోడల్ స్కూల్, ఖాజీపేట), ఇ. నాగ రిషిత (10వ తరగతి ఏపీ మోడల్ స్కూల్, ఖాజీపేట), వై. ప్రణీత్ రెడ్డి (9వ తరగతి, ఎస్పీ సీఎం మున్సిపల్ హై స్కూల్, రామేశ్వరం, (ప్రొద్దటూరు), వి. వైష్ణవి (9 వ తరగతి, వై వి ఎస్ మున్సిపల్ హై స్కూల్, (ప్రొద్దటూరు) బృందం విజేతగా నిలిచింది. ఇక ఎస్. అఫీఫా ఫిర్దౌజ్ (9వ తరగతి), ఎంసీ సాయికిరణ్ (9వ తరగతి), పి సమీరా భాను (9వ తరగతి), కె ప్రణీత సాయి శ్రీ యాదవ్ (8వ తరగతి), రవీంద్ర విద్యానికేతన్ కర్నూలు బృందం ద్వితీయ స్థానంలో నిలిచింది. అలాగే పి. ధాత్రి సాయి (9వ తరగతి) కే. మోక్షిత (9వ తరగతి, జిల్లా పరిషత్ హై స్కూల్, వరిగొండ), జి. రూపిక (9వ తరగతి) ఎస్కే సనీలా (9వ తరగతి, జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల కావలి) బృందం తృతీయ స్థానంలో నిలిచింది. వక్తృత్వపు పోటీల్లో విజేతగా తిరుపతి సర్కిల్‌ఇంధన పరిరక్షణ వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన వక్తులతో పోటీల్లో తిరుపతి సర్కిల్ గూడూరులోని సిఎస్ ఎం ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న జె. అద్రిజా రావు మొదటి స్థానంలో నిలువగా, చిత్తూరు జిల్లా పైపల్లెలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న కే. మనీషా ద్వితీయ స్థానాలు.



# సిఎం..డిసిఎం చిత్రపటాలకు పట్టుగూళ్లతో అభిషేకం

**రామకుప్పం,డిసెంబర్ 18 ప్రభాతవార్త** చిత్తూరు జిల్లా రామకుప్పంలోని వెలుగు కార్యాలయంలో గురువారం పట్టుసాగు రైతులు, ప్రజాప్రతినిధులు సిఎం చంద్రబాబునాయుడు,డిసిఎం పవన్ కళ్యాణ్ చిత్రపటాలకు పట్టుగూళ్లతో అభిషేకం నిర్వహించారు.ప్రభుత్వ విప్‌డా॥ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్‌చైర మ్‌న్ పిఎస్ మునిరత్నం,పికెఎం ఉడా ఛైర్మన్ డా॥ బిఆర్ సురేష్‌బాబు, ఎఎంసి ఛైర్మన్ జిఎం రాజు మాట్లాడుతూ రాయలసీమలో అత్యధికంగా పట్టుగూళ్లు సాగు చేసే కుప్పం రైతులను ఆదుకునేందుకు గత ప్రభుత్వ పాలనలో బకాయిలు ఉన్న 1.74కోట్ల నిధులను సిఎం చంద్రబాబునాయుడు విడుదల చేశారన్నారు.హంద్రీ-నీవా జలాలతో కుప్పంను సస్యశ్యామల ం చేస్తున్నారన్నారు. తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి సాధించే ప ంటలపై రైతులు మక్కువ చూపాలన్నారు. పట్టుసాగు చేపట్టే రైతులకు అందిస్తున్న రాయితీలను వివరించారు.

# తిరుమలలో ఆలయం ముందు తమిళనాడు రాజకీయ బ్యానర్ ప్రదర్శన

## - చట్టపరమైన చర్యలుంటాయని హెచ్చరించిన టిటిడి



**తిరుమల,డిసెంబర్ 18ప్రభాతవార్తప్రతినిధి:** ప్రపంచప్రఖ్యాతిగాంచిన హిందూ పుణ్యక్షేత్రం తిరుమలకొండపై కొందరు తమిళభక్తులు ప్రదర్శించిన రాజకీయనేతల బ్యానర్ వివాదాస్పదంగా మారింది. ఏకంగా దేవదేవుని ఆలయం ముందు గొల్లమండపం సమీపంలోనే తమిళనాడు భక్తులు ఈ బ్యానర్‌ను పట్టుకుని ప్రదర్శించడం మహా అపచారంగా భక్తులు భావిస్తున్నారు. అనూహ్యంగా జరిగిన పరిణామంతో తమిళనాడు భక్తులపై చట్టపరమైన చర్యలుంటాయని టిటిడి అధికారులు హెచ్చరిక చేశారు. తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి పవిత్రతను కాపాడటమే ప్రధాన లక్ష్యంగా రాష్ట్రప్రభుత్వం చట్టం కూడా అమలుచేస్తోంది. పుణ్యక్షేత్రంలో గోవింద నామం తప్ప మరేలాంటి నినాదాలు, ఉచ్చరణలు వినిపించకూడదని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పలు దఫాలు స్పష్టమైన ఆదేశాలిచ్చారు. ప్రస్తుత టిటిడి ధర్మకర్తలమండలి కూడా ఈ చట్టం కఠినంగా అమలుచేసేలా ఆలయం ముందు రాజకీయనాయకులుగానీ, ప్రజాప్రతినిధులుగానీ ఎటువంటి రాజకీయ వ్యాఖ్యలు చేయరాదని చట్టం తీసుకువచ్చారు.

రాజకీయాలకు సంబంధించిన ఎటువంటి ప్రదర్శనలు గానీ నిషేధం. దీని పర్యావసానంగా గత ఏడాదిగా తిరుమలలో రాజకీయ వ్యాఖ్యలు,విమర్శలు వినిపించడంలేదు. అలాంటిది తాజాగా గురువారం ఉదయం శ్రీవారి ఆలయం ముందు గొల్లమండపం సమీపంలో తమిళనాడులోని ఏఐఎడిఎంకె విద్యార్థి విభాగం నాయకులు పి.గజమురుగన్, ఎం.బాల పేర్లతో తమిళనాడు మాజీ సిఎం పళనిస్వామి, దివంగత సిఎం జయలలిత "మధురై జిల్లా తిరుపరకున్రం అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన ఆ పార్టీ మాజీమంత్రి ఫోటోలతో తమిళనాడులో 2026 ఎన్నికల్లో మాజీ సిఎం ఎడపాటి పళనిస్వామి ముఖ్యమంత్రి కావాలని, ఆయన నాయకత్వంలో పార్టీ అధికారంలోకి రావాలని బ్యానర్‌ను సినిమాటిక్ శైలిలో చూపించే రీల్స్‌ను సృష్టించారు. ఇదీ కాస్త సామాజికమాధ్యమాల్లో వైరల్‌గా మారింది. ఏకంగా ఆ పార్టీ విద్యార్థివిభాగం నాయకులు ఇబ్బందుల్లో పడ్డారు. ఏకంగా శ్రీవారి ఆలయం ముందు భారీ బ్యానర్ ప్రదర్శించడం ఆలయ భద్రత వైఫల్యాన్ని మరోసారి స్పష్టం చేసింది.



స్వాధీనం చేసుకున్న శిశువుతో సిపి రాజశేఖరబాబు

# పిల్లలను విక్రయిస్తున్న ముఠా అరెస్ట్

## - అమ్మకానికి ఉన్న ఐదుగురు పిల్లలు స్వాధీనం

**విజయవాడ కార్పొరేషన్,డిసెంబరు 18,ప్రభాతవార్త** విజయవాడ పోలీస్ కమీషనర్ రాజశేఖరబాబుకు రాబడిన పక్కా సమాచారం మేరకు అక్రమంగా పిల్లలను విక్రయిస్తున్న విజయవాడ,సితార సెంటర్ ప్రాంతానికి చెందిన బగళం సరోజినితో పాటు మరో నలుగురు మహిళలను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి విక్రయించడానికి సిద్ధంగా ఉంచిన ముగ్గురు పిల్లలను స్వాధీనం చేసుకుని,ఒక బాలుని విక్రయించగా వచ్చిన నాలుగు లక్షల రూపాయలను గతంలో స్వాధీనం చేసుకున్నారు. ఈ నేపథ ్యంలో ఇందులోని నిందితులైన బలగం సరోజిని,షేక్ ఫరీనాలు జైలు నుండి బెయిలుపై విడుదలయ్యారు. వీరి కదలికలపై నిఘాను ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో బుధవారం సాయంత్రం సిపి రాజశేఖరబాబుకు రాబడిన పక్కా సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ ఏసిపి కె.లతాకుమారి,పశ్చిమ ఏసిపి ఎస్‌వి దుర్గారావు,నార్త్ ఏసిపి స్రవంత్‌రాయ్ ల ఆధ్వర్యంలో టాస్క్‌ఫోర్స్ ,భవానీపురం,నున్న సిఐలు వారి సిబ్బందితో కలిసి ఏకకాలంలో దాడులు నిర్వహించారు. భవానీపురం కుమ్మరిపాలెం సెంటర్ సమీపంలో ఐదుగురిని,నున్న పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఉడా కాలనీ ఏరియాలో ముగ్గురిని అదుపులోకి తీసుకొని విచారించి వారి నుండి విక్రయించడానికి ఉంచి నలుగురు పిల్లలను రూ.3లక్షల30 వేల రూపాయల నగదును స్వాధీనం చేసుకొని వారిని అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కేసులో ప్రధాన నిందితురాలైన సరోజిని ఇచ్చిన సమాచారంపై గురువారం ఉదయం టు టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకొని మరో పాపను రక్షించారు. భవానీపురం పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసులో విజయవాడ సితార సెంటర్‌కు చెందిన బగళం సరోజిని,భవానీపురం,గొల్లపూడి ఏరియాకు చెందిన గరికముక్కు విజయలక్ష్మి,భవానీపురం, కుమ్మరిపాలెం ఏరియాకు చెందిన వాడవల్లి బ్లెస్సీ ,తెలంగాణ,నాంపల్లి,ఘట్కేసర్ ప్రాంతానికి చెందిన ముక్తిపేట నందిని,గుంటూరు జిల్లా సత్తెనపల్లి గ్రామానికి చెందిన షేక్ బాబా వలిలను అరెస్ట్ చేశారు. నున్న పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసులో విజయవాడ,దుర్గాపురం ప్రాంతానికి చెందిన ఆమదాల మణి,విజయవాడ అజిత్‌సింగ్‌నగర్‌కు చెందిన షేక్ ఫరీనా,విజయవాడ,కబేళా సెంటర్‌కు చెందిన ఐరి వంశీకిరణ్‌కుమార్,కొత్తపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో నమోదైన కేసులో నిందితులైన విజయవాడ గుణదల ఏరియాకు చెందిన శంక యోహాన్,అజిత్‌సింగ్‌నగర్,వాంబే కాలనీకి చెందిన శ్రీనివాసరావులను అరెస్ట్ చేశారు. వారు తెలిపిన వివరాల ప్రకారం విజయవాడ సితార సెంటర్‌కు చెందిన బలగం సరోజిని సులభంగా డబ్బులు సంపాదించాలనే ఉద్దేశ్యంతో పిల్లలు లేని వారికి అక్రమంగా పిల్లలను విక్రయించడం వ్యాపారంగా ఎంచుకుంది. ఢిల్లీకి చెందిన కిరణ్ శర్మ అనే అమ్మాయిని,ముంబాయికి చెందిన కవిత,నూరి,సతీష్ అనే వారిని పరిచయం చేసుకుంది. వారు అక్కడి నుండి విజయవాడకు పిల్లలను తీసుకువచ్చి సరోజినికి లక్ష నుండి రెండు లక్షలకు విక్రయించేవారు. సరోజిని పిల్లలు లేని వారిని,సంతాన లేమితో భాధపడేవారిని లక్ష్యంగా చేసుకొని వారికి నాలుగు నుండి ఐదు లక్షల వరకు బేరం కుదుర్చుకుని పిల్లలను విక్రయించేది. సరోజిని నగరంలోని కొంత మందితో కలిసి ఒక ముఠాగా ఏర్పడి ఢిల్లీ,ముంబాయిల నుండి తీసుకువచ్చిన పిల్లలను విజయవాడ చుట్టుపక్కల ప్రాంతాల్లో ఇతరులకు విక్రయించేది.

సరోజినిపై గతంలో హైదరాబాద్ లోని మేడ్‌పల్లి,గోపాలపురంలో, విజయవాడ నున్న కేసులలో అక్రమంగా పిల్లలను విక్రయించిన కేసులో అరెస్ట్ చేశారు.

# ఎపిఇపిడిసిఎల్‌కు ప్రతిష్టాత్మక జాతీయ అవార్డు

## గిరిజన ఆవాసాలకు విద్యుత్ అందించినందుకు జాతీయ స్థాయి గుర్తింపు

**విశాఖపట్నం, డిసెంబర్ 18** వినియోగదారులకు మెరుగైన సేవలతో పాటు నిరంతర విద్యుత్ సరఫరాను అందిస్తూ విశేష కృషి చేస్తున్న ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీఈపీడీసీఎల్)కు ప్రతిష్టాత్మక జాతీయ స్థాయి అవార్డు లభించింది. పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా (పీఆర్ఎస్ఐ) ఆధ్వర్యంలో"ఎంపవరింగ్ గ్రోత్, ప్రిజర్వింగ్ రూట్స్ - ది పీఆర్ విజన్ ఫర్ 2047" అనే నినాదంతో ఉత్తరాఖండ్ రాష్ట్రం డెహ్రాడూన్‌లో మూడు రోజుల పాటు నిర్వహించిన 47వ అఖిల భారత పబ్లిక్ రిలేషన్స్ కాన్ఫరెన్స్ - 2025లో ఏపీఈపీడీసీఎల్ ప్రతిష్టాత్మక 'భారతరత్న శ్రీ అటల్ బిహారీ వాజపేయి జాతీయ అవార్డు' ను సాధించిందని సంస్థ ఛైర్మన్ !! మేనేజింగ్ డైరెక్టర్ ఇమ్మడి పృథ్వీతేజ్ తెలిపారు. ఈ అవార్డులను ఉత్తరాఖండ్ రాష్ట్ర ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి, రాష్ట్ర స్పీకర్ శ్రీమతి రీతూ ఖండూరీ భూషణ్, మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ రమేష్ పోఖ్రియల్ 'నిశాంక్', పర్యావరణ !! అటవీశాఖ మంత్రి శ్రీ శుభోద్ ఉనియల్, పీఆర్ఎస్ఐ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ అజిత్ పాఠక్ ల సమక్షంలో ప్రదానం చేశారు. పీఆర్ఎస్ఐ ఆధ్వర్యంలో జరిగిన అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో, ఏపీఈపీడీసీఎల్ తరఫున అందుకున్న ఈ జాతీయ అవార్డును సంస్థ ఛైర్మన్ !! మేనేజింగ్ డైరెక్టర్ ఇమ్మడి పృథ్వీతేజ్ కు పీఆర్ఓ జి.ఎస్.ఎస్.ఎస్.వాసు అందజేశారు. ఈ సందర్భంగా సీఎండీ పృథ్వీతేజ్ మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఇంధన శాఖల సహకారంతో ఈపీడీసీఎల్ లో పలు రకాల పథకాల్ని సమర్థవంతంగా అమలు చేస్తున్నామని తెలిపారు. విద్యుత్ సదుపాయం లేని పీవీటీజీ గిరిజన అవాసాలకు మౌలిక వసతులు కల్పించడమే లక్ష ్యంగా చేపట్టిన ప్రధాన మంత్రి జనజాతి ఆదివాసీ గిరిజన న్యాయ మహా అభియాన్ కార్యక్రమం ద్వారా, విద్యుత్ నెట్వర్క్, రహదారులు, రవాణా సదుపాయాలు లేని మారుమూల గిరిజన ప్రాంతాలకు అవసరమైన విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్ఫార్మర్లు తదితర సామగ్రిని తరలించి, సుమారు 23 వేల గిరిజన కుటుంబాలకు ఉచితంగా విద్యుత్ సదుపాయం కల్పించామని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన విద్యుత్ శాఖ సిబ్బంది కృషికి ఆయన అభినందనలు తెలిపారు.

# రాష్ట్ర భవిష్యత్ నిర్మాణానికి కలెక్టర్ల సదస్సు ఉపయుక్తం

## - స్వర్ణాంధ్ర 2047-10 సూత్రాలపై విస్తృత చర్చ - ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ విద్యార్థుల విద్య, ఆరోగ్య రక్షణకు అధిక ప్రాధాన్యత: మంత్రి కొలుసు పార్థసారథి

**విజయవాడ, డిసెంబరు 18 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బిజినెస్ రిఫార్మర్ ఆఫ్ ది ఇయర్ అవార్డు అందుకోవడం అభినందనీయమని మంత్రి కొలుసు పార్థసారథి హర్షం వ్యక్తం చేశారు. ఏపీ సచివాలయంలోని ప్రచార విభాగంలో మంత్రి పార్థసారథి రెండు రోజుల పాటు నిర్వహించిన 5వ కలెక్టర్ల కాన్ఫరెన్స్ విశేషాలను గురువారం మీడియాతో ముచ్చటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవస్థలన్నీ నిర్వీర్యమైన స్థితిలో అధికారం చేపట్టిన దార్శనీకుడు చంద్రబాబు నాయుడు కేవలం 18 నెలల వ్యవధిలోనే రాష్ట్రంలో వ్యవస్థలన్నింటినీ పట్టాలెక్కించారన్నారు. రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించి, ఆర్థికంగా బలోపేతం చేసి 11 లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులను తీసుకువచ్చారని పేర్కొన్నారు. రాష్ట్ర భవిష్యత్తుకు దిక్సూచిగా రెండు రోజుల కలెక్టర్ల సమావేశం జరిగిందని, కలెక్టర్ల మధ్య అభివృద్ధి, సంక్షేమంలో పోటీ తత్వాన్ని పెంపొందించేలా చర్చలు జరిగాయని మంత్రి పార్థసారథి వివరించారు. ప్రజలకు వేగంగా సుపరిపాలన అందించేలా, పలు సమస్యల పరిష్కారం దిశగా సమావేశం జరిగిందన్నారు. పార్వతీపురం మన్యం జిల్లాలో పైలట్ ప్రాజెక్ట్ గా కలెక్టర్ ప్రారంభించిన ముస్తాబు కార్యక్రమాన్ని అన్ని జిల్లాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో అమలుచేయాలని సీఎం ఆదేశించారన్నారు. ఎస్సీ, ఎస్టీ ,బీసీ మైనార్టీ విద్యార్థుల విద్య, ఆరోగ్య రక్షణకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. వారి భవిష్యత్తు కోసం ప్రత్యేకంగా ఐఐటీ, నీట్ తదితర పోటీ పరీక్షలకు శిక్షణ తరగతులు నిర్వహించాలని సీఎం ఆదేశించారని తెలిపారు. పీజీఆర్ ఎస్ లో లక్షల సంఖ్యలో సమస్యలు ప్రభుత్వం దృష్టికి వస్తున్నాయని, ఆ సమస్యల పరిష్కారానికి లాజికల్ పద్ధతిలో పరిష్కరించాలని, ఆర్థికేతర సమస్యలన్నింటినీ వీలైనంత త్వరలో పరిష్కరించాలని సీఎం ఆదేశించారని తెలిపారు. నిర్దిష్ట కాల పరిమితి లో రెవెన్యూ సమస్యలను పరిష్కరించాలని, రీసర్వే, 22 ఎ, పాస్ పుస్తకాల జారీ సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారని మంత్రి తెలిపారు.

# చిరుధాన్యాల వివిధ అంశాలపై లఘు చిత్రం

## - అనంత సుస్థిర వ్యవసాయ వేదిక కన్వీనర్ వై.వి.మల్లారెడ్డి

**అనంతపురం బ్యూరో, డిసెంబరు 18 ప్రభాతవార్త** అనంత సుస్థిర వ్యవసాయ వేదిక ఆధ్వర్యంలో చిరుధాన్యాల యొక్క వివిధ అంశాలపై 60 సెక్షన్ల లఘు చిత్రం (షార్ట్ ఫిల్మ్) రీల్ తయారీ పోటీ లను నిర్వహించడం జరుగుతోందని ఆసక్తిగలవారు పాల్గొనాలని వేదిక కన్వీనర్ వై.వి.మల్లారెడ్డి కోరారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా వై.వి.మల్లారెడ్డి మాట్లాడుతూ చిరుధాన్యా లను పెంచడం, చిరుధాన్యాల విలువ జోడింపు, చిరుధాన్యాల యొక్క పంట/వంటకాలు, చిరుధాన్యాల వినియోగం-ఆరోగ్య ప్రయోజనాలు, చిరుధా న్యాల యొక్క వినూత్న మార్కెటింగ్ అంశాల్లో ఏదో ఒక అంశంపై లఘు చిత్రం రీల్ తయారు చేయాల్సి ఉంటుందన్నారు. రీల్స్‌ను తెలుగు, హిందీ, ఇంగ్లీషులో తయారు చేయవచ్చన్నారు. అన్ని వయసుల వారు పాల్గొన వచ్చని, అయితే ప్రతి వ్యక్తి ఏదైనా ఒక భాషలో, ఒక అంశంమీద మాత్రమే సమర్పించాల్సి ఉంటుందన్నారు. ఆడియో, వీడియో ఫైల్ ఎంపీ4 ఫార్మెట్ లో ఉండాలన్నారు. ఈ ఎంట్రీ లను, ఫైళ్లను ఈనెల 22వ తేదీ మధ్యాన్నం 12 గంటలులోగా సమర్పించాల్సి ఉంటుందన్నారు. ప్రతి కేటగిరిలో మోదటి రెండు ఎంట్రీలకు 2026 జనవరి రెండవ వారంలో అనంతపురంలో జరిగే మిల్లెట్ మేళా యొక్క మూడవ ఎడిషన్‌లో ప్రశంసా పత్రం ఇవ్వడం జరుగుతుందన్నారు. అన్ని రీల్స్, షార్ట్ ఫిల్మ్‌లను మూడు రోజుల పాటు వేదికవద్ద ప్రదర్శించి సోషల్ మీడియా ద్వారా విస్తృతంగా ప్రచారం చేస్తామని వై.వి.మల్లారెడ్డి వివరించారు. మీ వీడియోలను ఏదైనా సమాచారం కొరకు 7981391575 ఫోన్ నంబరును సంప్రదించాలన్నారు.

# నితీష్ కుమార్ రాజీనామా చేయాలి : వైసీపీ మైనారిటీ విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి మొహమ్మద్ మగ్దూమ్ మొహిద్దీన్

**గూడూరు, డిసెంబర్ 18, ప్రభాతవార్త** బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ ఇటీవల ఆయన చేస్తున్నటువంటి వింత చేష్టలు అందరికీ విస్మయాన్ని కలిగిస్తున్నాయి. 5 సార్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన అపార అనుభవం వున్న ముఖ్యమంత్రి నితీష్ కుమార్ మానసిక స్థితి సరిగా లేనందు వల్లే వివాదాస్పద పనులు చేస్తున్నారని వైసీపీ మైనారిటీ విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి మొహమ్మద్ మగ్దూమ్ మొహిద్దీన్ పేర్కొన్నారు.

ఇటీవల నూతనంగా ఎంపికైన డాక్టర్లకు నియామక పత్రాలను అందజేసే సమ్వాద్ కార్యక్రమంలో ఆ వేదిక మీద రాజకీయ ప్రతినిధులు, వేదిక ముందు మీడియా, ప్రజలు, మరి ఆ డాక్టర్లకు సంబంధించినటువంటి కుటుంబ సభ్యులు కూడా ఉన్నారన్నారు.

# తోటి విద్యార్థి పెట్టే ఇబ్బందులు తాళలేక విద్యార్థిని ఆత్మహత్య

**నెల్లూరు క్రైమ్, డిసెంబర్ 18, ప్రభాతవార్త:** తోటి విద్యార్థి చేసే ఇబ్బందులు తాళలేక ఓ విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న సంఘటన చిన్న బజార్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్లితే.. ఫత్తేఖాన్‌పేటలో ఎన్ తిరుపాల్ కుటుంబం నివాసం ఉంటోంది. ఆయనకు భార్య స్వాతి, కుమారుడు నాగచైతన్య, కుమార్తె లావణ్య (15)లు ఉన్నారు. లావణ్య సమీపంలోని ప్రియాంక ఇంగ్లీషు మీడియం స్కూల్‌లో పదోతరగతి చదువుతోంది. సుమారు నాలుగు నెలల కిందట అదే స్కూల్‌లో పదో తరగతి చదువుతున్న బాలుడు ఆమెకు ఇన్‌స్టాగ్రామ్‌లో ఐలవ్‌యూ అంటూ సందేశం పంపారు. ఈ విషయాన్ని కుటుంబ సభ్యులు స్కూల్ యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లారు. యాజమాన్యం పెద్దగా పట్టించుకోలేదు. ఈ క్రమంలోనే పదిహేను రోజుల కిందట బాలిక స్కూల్‌లో బ్లేడ్‌తో ఆత్మహత్యాయత్నం చేసుకుంది. మరోసారి కుటుంబ సభ్యులు స్కూల్ యాజమాన్యంను నిలదీయగా వారు బాలుడికి సపోర్టుగా మాట్లాడారు. ఈ క్రమంలో గురువారం బాలిక స్కూల్‌కు వెళ్లింది. అనంతరం ఏం జరిగిందో ఏమో తెలియదుకాని ఆమె ఇంటికి వెళ్లి చున్నీతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. పనులకు వెళ్లిన కుటుంబసభ్యులు ఈవిషయం తెలుసుకుని, హుటాహుటిన ఇంటికి చేరుకుని బాలికను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

# భారీగా పట్టుబడిన గంజాయి

**ఉమ్మడి తూర్పుగోదావరి బ్యూరో, డిసెంబర్18,ప్రభాతవార్త** తూర్పుగోదావరి జిల్లా గోకవరంలో గంజాయి భారీగా పట్టుబడింది. గోకవరం మండలం కామరాజు పేట గ్రామ శివారులో 22 బస్తాలలో సుమారు 405 కేజీల గంజాయిని గోకవరం పోలీసులు సీజ్ చేసారు. మహీంద్రా మ్యాక్సీ పికప్ వ్యాన్‌లో గంజాయి తరలిస్తుండగా దాడి చేసి పోలీసులు పట్టుకున్నారు పోలీసుల రాకను గమనించి వ్యాన్ వదిలి ఇద్దరు నిందితులుపరారయ్యారు. పట్టుబడిన గంజాయి విలువ సుమారు రూ. 2 కోట్ల 2 లక్షల 50 వేల రూపాయలు ఉంటుందని అంచనా వేస్తున్నారు.ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గోకవరం ఎస్ఐ పవన్ కుమార్ తెలిపారు .

# ఎసిబికి పట్టుబడ్డ బిసి వెల్ఫేర్ డిడి

ఉమ్మడి తూర్పుగోదావరి బ్యూరో, డిసెంబర్18,ప్రభాతవార్త
జిల్లా కేంద్రం కాకినాడ లో జిల్లా బిసి సంక్షేమ శాఖ కార్యాలయంలో ఏసిబి అధికారుల ఆకస్మిక దాడిచేశారు.ఈ దాడిలో రూ. 40 వేలు లంచం తీసుకుంటూ డిప్యూటీ డైరెక్టర్ లల్లి, సీనియర్ అసిస్టెంట్ కారెపు సూర్యశివప్రసాద్ లు ఏసిబి అధికారులకు చిక్కారు.
కారుణ్య నియామకం,పెన్షన్ సెటిల్మెంట్ విషయం లో కాత్రేనికోన మం. అడవిపేట కు చెందిన గెద్దాడ చక్రవర్తి నుంచి రూ40 వేలు డిమాండ్ చేయగా ఏసీబీ అధికారులను చక్రవర్తి ఆశ్రయించారు.మాజీ ఉద్యోగి యాదల సత్యనారాయణ ను మధ్యవర్తి గా డిడి లల్లి లంచావతారం ఎత్తారు.
చక్రవర్తి ఫిర్యాదు మేరకు రంగంలోకి దిగి లంచం తీసుకుంటుండగా ఏసిబి డిఎస్పీ కిషోర్ రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు.ముగ్గురిని అదుపులోకి తీసుకుని ఏసిబి అధికారులు రిమాండ్ కి తరలించారు.

# విద్యార్థులకు మార్గదర్శిగా..



ఓ లక్ష్యాన్ని పెట్టుకుని.. దానికోసం కష్టపడితే, ఆలస్యమైనా విజయం తప్పక వరిస్తుంది. డాక్టర్ వెంకటలక్ష్మి ప్రయాణమే ఇందుకు ఉదాహరణ. ఈమె ఎవరు? ఏం సాధించారో తెలియాలంటే..

కలల్ని సాకారం చేసుకోవాలంటే చాలా ఓపిక ఉండాలి. కొన్నిసార్లు లక్ష్యం దగ్గర వరకూ వెళ్లినా, అపజయాలు తలుపు తడుతుంటాయి. మధ్యలో చిన్నచిన్న విజయాలూ పలకరిస్తుంటాయి. వాటికి తృప్తి పడి,గమ్యాన్ని వదిలిపడితే.. అనుకున్న లక్ష్యాన్ని చేరుకోలేకపోయామే అని తర్వాత పశ్చాతాపపడతాం' అంటారు వెంకటలక్ష్మి. ఈమెది జనగామ జిల్లా, దేవరుప్పుల మండలంలోని గొల్లపల్లి. అమ్మ పూలమ్మ, నాన్న వెంకట్‌రెడ్డి, ప్రైవేట్ ఉద్యోగి. వీళ్లకి నలుగురు సంతానం. వాళ్లలో రెండోవారు వెంకటలక్ష్మి. నాన్న జీతమే మా జీవనాధారం. దాంతో ఏ పూట తింటే మరో పూట వస్తులు ఉండాల్సిన పరిస్థితి. ఇది మారాలంటే చదువుకుని మేం మంచి ఉద్యోగాల్లో స్థిరపడాలి అనేవారు నాన్న. అందుకే చిన్నప్పట్నుంచి కష్టపడి చదివా. మ్యాథ్స్ నా ఫేవరెట్ సబ్జెక్ట్. కానీ పది పూర్తయ్యాక పై చదువులు చదివించే స్తోమత లేదన్నారు. నేను, అన్నయ్య ట్యూషన్లు చెబుతూ, ఇంటర్ పూర్తిచేశాం. తర్వాత ఉస్మానియా విశ్వవిద్యాలయంలో సీటు సంపాదించా. అక్కడ కూడా ఉదయం తరగతులకు హాజరై.. సాయంత్రం ట్యూషన్లు చెప్పేదాన్ని. అలా బిఎ (ట్రిపుల్ మ్యాథ్స్),ఎంఎస్సీ పూర్తిచేశా. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ నుంచి మాస్టర్ ఆఫ్ ఫిలాసఫీ (పిహెచ్‌డి) పట్టాలను అందుకున్నా. ఈ క్రమంలో ఎన్నో అడ్డంకుల్ని దాటాన'ని గుర్తుచేసు కుంటారు వెంకటలక్ష్మి.

**ప్రొఫెసర్ అవ్వాలని...**

'అన్నయ్య బిఈడి రాసి టీచర్ ఉద్యోగంలో స్థిరపడానడరు. నేనూ రాశా, పాస్ అయ్యాను కూడా రెండుసార్లు దీనిలో ఉత్తీర్ణత సంపాదించా. కానీ నా కల ప్రొఫెసర్ కావాలని. అందుకే ఎన్ని అవకాశాలు వచ్చినా కాదను కున్నా. 2001లో నిర్మల్ జిల్లా లోకేశ్వరానికి చెందిన మనోహార్ రెడ్డితో వివాహమైంది. ఆయన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్. పెళ్లయ్యాక ఆయన ప్రోత్సాహమూ తోడైంది. దాంతో 2007లో ఉస్మానియా యూనివర్సిటీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా నా కెరియర్‌ను ప్రారంభించా' అనే వెంకటలక్ష్మి 2019లో అసోసియేట్ ప్రొఫెసర్, 2022లో ప్రొఫెసర్‌గా పదోన్నతులు పొందారు. ఇప్పటి వరకు జాతీయ, అంత ర్జాతీయ జర్నల్స్‌లో ఈమె చేసిన 44 పరిశోధనా పత్రాలు ప్రచురి తమ య్యాయి.

**పరిశోధనల వైపు ప్రోత్సహిస్తూ....**

ఇప్పటితరం విద్యార్థుల్లో సైన్స్ గ్రూప్స్ మీద ఆసక్తి చూపించే వారు తగ్గిపోతున్నారు. ఇక్కడా చాలా అవకాశాలు ఉన్నాయి. సరైన విధంగా వినియోగించు కోవాలే కానీ, తొందరగా కెరియర్‌లో స్థిరపడే అవకాశం ఉన్న గ్రూప్స్ ఇవన్నీ. నా దగ్గర చదువుకునే విద్యార్థులందరికీ అదే చెబుతుంటా. వాళ్లకి ప్రభుత్వ పరీక్షలకు సిద్ధమవ్వడానికి శిక్షణ కూడా ఇస్తుంటా. వాళ్ల ఆసక్తి మేరకు పరిశోధనల వైపూ ప్రోత్సహిస్తుంటా' అనే వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో ఇప్పటివరకూ ఏడుగురు పిహెచ్‌డి పట్టాను పొందారు. చాలామంది ప్రభుత్వ ఉద్యోగాల్లోనూ స్థిరపడ్డారు.

# ఈ మాసంలో ముగ్గేద్దాం!

ధనుర్మాసం వచ్చిందంటే చాలు తెలుగునాట నెలపట్టడం మొదలవుతుంది. రోజుకో ముగ్గు.. ఎవరిది బాగుంది? నీదా..నాదా? పెద్ద ముగ్గు ఎవరిది అంటూ ఎన్ని పోలికలో ఊరంతా సందడిగా మారిపోతుంది. ఇంతకీ ఎప్పటిదీ ముగ్గు? ఈ సంప్రదాయానికి ఆధునిక యుగంలో చోటుందా? తెలుసుకుందాం..

తెల్లవారుజామున ఇంకా సూర్యుని జాడైనా కనిపించదు. ఆ సమయంలో వాకిలిని శుభ్రం చేసి, చక్కగా కళ్లాపి జల్లి.. అందమైన ముగ్గును వేస్తుంది ఇల్లాలు. ఏ పనైనా దాని తరవాతే. తెల్లారకముందే వేసే ముగ్గు. చీకటి నుంచి వెలుగులోకి ప్రయాణానికి సూచికగా భావిస్తారు. దైవమంటే నమ్మకం ఉన్నా లేకపోయినా.. ఈ సృష్టిని నడిపే ఓ శక్తి మాత్రం ఉందని అనాదిగా నమ్ముతున్న మాటే! ఆ శక్తినీ.. భూమాతనీ ఆరాధించే మార్గంగానూ 'ముగ్గు'నునమ్ముతారు. ఇప్పటికీ వేడుకలు, పండుగలు, పూజలు.. ఏవైనా రంగవల్లిక వేయడం పరిపాటి.. వీటి ఉనికి రాతియుగం నుంచే ప్రారంభమైంది. పైగా భారతీయ సంప్రదాయంలో ఎదుటివారి కడుపు నింపడం.. **రెండు విధాలా ఆరోగ్యం!** ఎన్నైనా చెప్పండి... ఇది పాతకాలం ఆచారం. మావి జీవితాలు, కాలు బయట పెడితే వాహనంలోకే అలాంటి ఫాస్ట్ జీవితాలకు ముగ్గులు, రంగులద్దడం కుదరదంటారా? మోడరన్ సైన్స్నీ అబ్బురపరిచే శక్తి ముగ్గుది. కోపంలో ఉన్నవారిని ఓసారి ముగ్గు చూసి రమ్మనండి. ఆ గీతల్లోని మాయ మెదడుని శాంతపరుస్తుంది. అంటే నెగెటివ్ ఎనర్జీని ఆపగలదని, సరి, బేసి, మధ్యచుక్క అంటూ ఎన్నెన్ని రకాలుగా చుక్కలు పెడతాం ఒక చుక్కని మరోచుంచడి జాగ్రత్తగా కలుపుతాం. లెక్కలంటే కొరుకుడుపడని వారికి చక్కని మార్గం. తదేకంగా చేస్తాం కాబట్టి. ఏకాగ్రత కుదురుతుంది. మెదడుకీ వ్యాయా మం వంగి లేదా కూర్చొని చేస్తూ వేస్తుంటాం కాబట్టి, శరీరానికి కసరత్తులు చేసిన ప్రయోజనం. ఆఫ్రికాలో ఒక జాతి... ఇంటిగోడలు, తమవాళ్ళు ఎక్కువగా తిరిగే చోట్ల ముగ్గును తలపించేలా గీస్తారు. మనదేశంలోనూ కొన్ని ఇంట్లో తలుపులు, గోడలపై ముగ్గులతో అలంకరించడం చూస్తుంటాం. వీటి పరమార్ధం మనసుని తేలికపరచడమే బిహేవియర్, మెమరీ సంబంధిత చెరపీల్లోనూ ముగ్గును భాగం చేస్తున్నారంటే దీని ప్రాధాన్యమెంతో అర్థం చేసుకోండి. సైన్స్‌నే అబ్బురపరిచే కళ ఇది. మన పూర్వీకులు మనకు అందించిన సంపద. అందుకే.... చిన్నదో పెద్దదో ముంగిట ఓ ముగ్గేద్దాం ఇంటికి

# తిరుప్పావై

## 4వ పాశురము



ఆళి మళైక్కణ్ణా ! ఒన్రు నీ
కైకరవేల్,
ఆళియుళ్ పుక్కుముకన్దు
కొడార్తేఱి,
ఊళిముతల్వన్ ఉరువమ్పోల్
మెయ్కఱుత్తు
పాళియన్దోలుడై ప్పఱ్బనాపన్
కైయిల్
ఆళాపోల్ మిన్ని వలమ్బురిపోల్
నిన్టతిర్న్దు
తాళాదే శార్ఙముదైత్త శరమళై పోల్
వాళవులకినిల్ పెయ్ దాయ్
నాంగళుమ్
మార్గళి నీరాడ మకిళ్ న్దేలో
రెమ్బావాయ్

వరుణదేవుడు గంభీరస్వభావము కలవాడు. సముద్రములోని నీటిని పీల్చుతాడు. ఆకాశమును అధిరోహిస్తాడు. నీలిమేఘశ్యాముడు సర్వవ్యాపి, విశాలమైన సుందర భుజములు గలవాడు. పద్మనాభుడు. అతని చేతిలోని చక్రమువలె ప్రకాశించునట్లుగా మెరియాలి. పాంచజన్యము చేయు శబ్దములా ఉరుమాలి. దక్షిణబాహువునగల సుదర్శన చక్రమువలె మెరయాలి. శార్ ్గముండి వెలువడు బాణములవలె ఆలస్యముకాకుండ వర్షించాలి. లోకములు సుఖించాలి. సంతోషంగా ఆ వర్షములో మార్గశిరస్నానముచేద్దాం అనుచు గోపికలను రండి అంటు కోరుతున్నది.

ఫలం: 'సత్సంగం లభిస్తుంది'

# తీపి తినాలనుందా..

ఒక్కోసారి ఏదైనా స్వీట్ తింటే బాగుండు అనిపిస్తుంది. మరికొన్ని సార్లేమో ఎలాగైనా సరే తీపి తినాల్సిందేనని గట్టిగా నిర్ణయించుకుంటాం. ఇలాంటి స్వీట్ క్రేవింగ్‌ను అదుపులో పెట్టుకోకపోతే కోరి అనారోగ్యాలను ఆహ్వానించిన వాళ్లమవుతాం. మరి ఏం చేయాలంటారా...బాగా తీపి తినాలని పించినప్పుడు పండ్లు తినడం మంచిది. వీటిలోని పోషకాలు ఆరోగ్యానికీ మేలు చేస్తాయి. ఎక్కువగా ఉండే పీచు పదార్థం అధిక బరువు నియంత్రణకూ తోడ్పడుతుంది. ◆. చిరు ధాన్యాలతో తయారు చేసిన మిఠాయిలు ఇప్పుడు విస్తృతంగా అందు బాటులో ఉన్నాయి. వీటిని ఉపయోగించే శరీరానికి తగిన పోషకాలూ అందుతాయి. ◆.చిలగడదుంపలను బెల్లంతో ఉడికించి తీసుకున్నా తీపి తిన్న అనుభూతే కలుగుతుంది.◆. సహజసిద్ధమైన తీపితో నిండిన ఖర్జూరాలనూ హాయిగా ఆరగించొచ్చు. ఇవి రుచిగా ఉండటమే కాకుండా ఆరోగ్యానికి మేలు చేస్తుంది.◆ పాలల్లో రెండు, మూడు రకాల పండ్లను కలిపి స్మూతీ చేసుకుని తాగినా స్వీట్ క్రేవింగ్స్ తగ్గు తాయి. ◆ డ్రైఫ్రూట్స్‌ను తీసుకున్నా తీపి తిన్న అనుభూతిని పొందొచ్చు.



# ఈ స్క్రబ్స్‌తో చేతులు కోమలం..



ఇంటి పని, వంట పని, గిన్నెలు తోమడం, బట్టలుతకడం.. వంటి రోజువారీ పనుల కారణంగా పదే పదే చేతులు నీళ్లలో నాని మరింత పొడిగా తయారవుతాయి. ఫలితంగా దురద, మంట పుట్టడం, అలర్జీలు.. వంటి సమస్యలొచ్చే అవకాశం ఉంది. మరి, వీటి నుంచి బయటపడాలంటే ఇంట్లో లభించే కొన్ని పదార్థాలతో స్క్రాబ్స్ తయారుచేసుకొని వాడితే ఫలితం ఉంటుంది. టేబుల్ స్పూన్ ఓట్మీల్ పొడి, అర టేబుల్‌స్పూన్ కొబ్బరి నూనె.. ఈ ఉత్పత్తులను బాగా కలుపుకొని చేతులు, మణి కట్టుపై మాస్క్ అప్లై చేసుకోవాలి. పావుగంట పాటు అలాగే ఉంచుకొని ఆపై గోరు వెచ్చటి నీటితో కడిగేసు కుంటే సరిపోతుంది. ఓట్మీల్ చర్మానికి తేమ నందించి కోమలంగా మార్చుతుంది. ఈ ప్యాక్ను రోజూ ప్రయత్నించచ్చు. ఓట్మీల్ పొడిని ఇలా కూడా ఉపయోగించవచ్చు. ఒక టొమాటోను రెండు ముక్కలు చేసి.. ఒక ముక్కను ఓట్మీల్ పొడిలో అద్దాలి. దాంతో చేతిపై, మణికట్టుపై పదిహేను నిమిషాల పాటు మర్దన చేయాలి. ఆపై మరో టొమాటో ముక్కను ఇంతకుముందు లాగే ఓట్మీల్ పొడిలో ముంచి మరో చేతిపై రుద్దు కోవాలి. తర్వాత చల్లటి నీటితో కడిగేసుకుంటే సరి. రెండు టేబుల్ స్పూన్ల చక్కెరలో ఐదారు చుక్కల విటమిన్ 'ఇ' నూనె వేసి బాగా కలుపు కోవాలి. ఈ మిశ్రమాన్ని చేతులు, మణికట్టుపై అప్లై చేసి రెండు నిమిషాల పాటు మృదువుగా రుద్దుకోవాలి. ఆ తర్వాత గోరువెచ్చటి నీటితో కడిగేసుకోవాలి. విటమిన్ 'ఇ' డ్యామేజ్ అయిన చర్మాన్ని రిపేర్ చేసి తిరిగి ప్రకాశవంతంగా మార్చుతుంది.

# తేలిగ్గా వెన్న తీయొచ్చు

**బయట ఎంతో ఖరీదు పెట్టి నెయ్యి కొన్నా, ఇంట్లో** స్వయంగా చేసి పెట్టుకున్న ఆ నేతి ఘుమఘుమా, రుచి ఎక్కడా దొరకవు. అందుకే ఇంట్లోనే పెరుగు చిలికి, వెన్న కాచుకుందాం అనుకునేవారికి భలే ఉపయోగపడుతుందీ కర్డ్ చర్నింగ్ మెషీన్. కరెంట్‌తో పనిచేసే ఈ మెషీన్ ఒక స్టీల్ పాత్ర ఉంటుంది. ఇందులో పెరుగు వేసి, మూత పెట్టి కవ్వాన్ని తగినంత ఎత్తులో అడ్జెస్ట్ చేసుకుంటే చాలు. స్విచ్ వేయగానే కవ్వం ముందుకీ, వెనక్కీ చేత్తో తిప్పినట్టుగా తిరుగుతుంది. పాత్రపైన మూత ఉంటుంది కాబట్టి ఆ మజ్జిగ తుంపర్లు బయటకు చిందే అవకాశం లేదు. లీటర్ పాలని ఐదు నిమిషాల్లో చిలికేస్తుంది. పనయ్యాక, పాత్రని శుభ్రం చేసుకోవడమూ తేలికే.



## రంగవల్లి



18 చుక్కలు, 6 వరుసలు, ఇటు అటు వదిలి 6 వరకు

- జానకి.ఎన్
కె.ఆర్.ఆర్.హిల్స్





**ముగ్గులకు ఆహ్వానం**

మా చిరునామా: ఎడిటర్, 'చెలి' వార్త, నం.396, లోయర్ ట్యాంక్‌బండ్, డిబిఆర్ మిల్స్ పక్కన, హైదరాబాద్-80. Gmail: cheli@vaartha.com

కృత్రిమ మేధతో రూపొందించిన ముగ్గులు పంపవద్దు

---

# తెర

# చంద్రకళ క్యారెక్టర్ గుర్తుండిపోతుంది..

స్వప్న సినిమాస్ అప్ కమింగ్ మూవీ 'ఛాంపియన్' ఆసక్తికరమైన ప్రమోషనల్ కంటెంట్‌తో ఇప్పటికే మంచి బజ్ క్రియేట్ చేసింది. ఈ చిత్రంలో రోషన్, అనస్వర రాజన్ లీడ్ రోల్స్ పోషిస్తున్నారు. ప్రదీప్ అద్వైతం దర్శకత్వం వహిస్తున్నారు. జీ స్టూడియోస్ సమర్పణ లో ఆనంది ఆర్ట్ క్రియేషన్స్, కాన్సెప్ట్ ఫిల్మ్స్‌తో కలిసి నిర్మిస్తు న్నారు. మిక్కీ జె మేయర్ అందించిన పాటలు చార్ట్ బస్టర్ అయ్యాయి. ఈ చిత్రం డిసెంబర్ 25న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ సందర్భంగా హీరోయిన్ అనస్వర రాజన్ విలేకరలు సమావేశంలో సినిమా విశేషాలు పంచుకున్నారు. టీజర్ లో మీరు చెప్పిన డైలాగ్స్ చాలా ఆకట్టుకున్నాయి.. తెలుగు డైలాగ్స్ చెప్పడం గురించి? నిజానికి తెలుగు భాష మీద నాకు పెద్ద అవగాహన లేదు. అయితే చాంపియన్ డైరెక్టర్ ప్రదీప్ గారు అలాగే యూనిట్లో అందరూ కూడా నాకు భాష విషయంలో ఎంతగానో సపోర్ట్ చేశారు. తెలుగు ప్రేక్షకులు చాలా గొప్ప మనసున్న ఆడియన్స్. నేను వేరే భాషలో చేసిన సినిమాలు చూసి ఎన్నో అద్భుతమైన సందేశాల్ని పంపారు.



అనస్వర రాజన్

# 'రాజా సాబ్' సాంగ్ 'సహాన సహాన' రిలీజ్



'రాజా సాబ్' సాంగ్ 'సహాన సహాన..' రిలీజ్ రెబల్ స్టార్ ప్రభాస్, టాలెంటెడ్ డైరెక్టర్ మారుతి, ప్రెస్టీజియస్ ప్రొడక్షన్ హౌస్ పీపుల్ మీడియా ఫ్యాక్టరీ కాంబినేషన్ లో రూపొందుతున్న క్రేజీ మూవీ 'రాజా సాబ్'. హారర్ కామెడీ జానర్ లో ఎవర్ గ్రీన్ మూవీగా నిలిచిపోయేలా 'రాజా సాబ్'ను తెరకెక్కిస్తున్నారు దర్శకుడు మారుతి. ఈ సినిమాను భారీ ప్రొడక్షన్ వ్యాల్యూస్‌తో అన్ కాంప్రమైజ్డ్ గా నిర్మిస్తున్నారు నిర్మాతలు టీజీ విశ్వప్రసాద్, కృతి ప్రసాద్. మాళవిక మోహనన్, నిధి అగర్వాల్, రిద్ధి కుమార్ ఈ చిత్రంలో హీరోయిన్స్ గా నటిస్తున్నారు. సంక్రాంతి సందడిని రెట్టింపు చేసేందుకు జనవరి 9న 'రాజా సాబ్' సినిమా వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. ఈ రోజు 'రాజా సాబ్' సినిమా నుంచి సెకండ్ సింగిల్ 'సహన సహన..' రిలీజ్ చేశారు. హైదరాబాద్‌లోని ఓ మాల్ లో ఈ సాంగ్ లాంఛ్ ఈవెంట్ రెబల్ ఫ్యాన్స్, ప్రేక్షకుల సందడి మధ్య గ్రాండ్ గా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మ్యూజిక్ డైరెక్టర్ తమన్ మాట్లాడుతూ 'రాజా సాబ్' మూవీలో సాంగ్స్ సూపర్బ్ గా వచ్చాయి. ఇప్పటికే రిలీజ్ చేసిన సాంగ్ కు హ్యూజ్ రెస్పాన్స్ ఇచ్చారు.

# 'గుర్రం పాపిరెడ్డి' ఎంటర్ టైన్ మెంట్ ఇస్తుంది

- ఫరియా అబ్దుల్లా



నరేష్ అగస్త్య, ఫరియా అబ్దుల్లా జంటగా నటిస్తున్న సినిమా 'గుర్రం పాపిరెడ్డి'. ఈ చిత్రాన్ని డా. సంధ్య గోలీ సమర్పణలో ప్రొడ్యూసర్స్ వేణు సద్ది, అమర్ బురా, జయకాంత్ (బాబీ) నిర్మిస్తున్నారు. డార్క్ కామెడీ కథతో ఇప్పటి వరకు మనం తెరపై చూడని కాన్సెప్ట్‌తో దర్శకుడు మురళీ మనోహర్ రూపొందిస్తున్నారు. 'గుర్రం పాపిరెడ్డి' సినిమా ఈ నెల 19న వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రాబోతోంది. ఈ రోజు జరిగిన ఇంటర్వ్యూలో సినిమా హైలైట్స్ తెలిపారు హీరోయిన్ ఫరియా అబ్దుల్లా. 'గుర్రం పాపిరెడ్డి' సినిమాలో నేను సౌధామిని అనే క్యారెక్టర్‌లో నటిస్తున్నాను. సౌధామిని నర్స్ గా పనిచేస్తుంటుంది. డాక్టర్ చదువుకోవాలని అనుకుంటుంది. ఈ క్రమంలో గుర్రం పాపిరెడ్డి పరిచయమై తన కథంతా మార్చేస్తాడు. 'గుర్రం పాపిరెడ్డి' సినిమాలో వైవిధ్యమైన గెటప్స్‌లో కనిపిస్తా. సమ్మర్ లో ఆ గెటప్స్‌తో షూటింగ్ చేశాం. మేకప్‌తో రెడీ అయ్యేందుకు చాలా టైమ్ పట్టేది.అయితే యాక్టర్స్ కు ఇలా విభిన్నమైన మేకోవర్స్‌లో కనిపించే అవకాశం తక్కువసార్లు వస్తుంది. ఈ మూవీకి కొత్త ప్రొడ్యూసర్స్ అయినా ఎంతో ప్యాషనేట్ గా మూవీ చేశారు. మా యాక్టర్స్ అందరినీ కో ఆర్డినేట్ చేసుకుంటా సినిమాకు ఏం కావాలో అవన్నీ సమకూర్చారు.

# అడివి శేష్ 'డెకాయిట్' టీజర్ లాంచ్

వరుస బ్లాక్‌బస్టర్ విజయాలతో దూసుకుపోతున్న అడివి శేష్ తన ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్ 'డెకాయిట్' తో అలరించ బోతున్నారు. షానియల్ డియో దర్శకుడిగా పరిచయం కాబోతున్నారు. ఈ లవ్, యాక్షన్ డ్రామాలో



మృణాల్ ఠాకూర్ హీరోయిన్. బాలీవుడ్ ఫిల్మ్ మేకర్ అనురాగ్ కశ్యప్ కీలక పాత్ర పోషించారు. శేష్ పుట్టినరోజు సందర్భంగా నిన్న ఒక ప్రత్యేక పోస్టర్‌ను రిలీజ్ చేసిన తర్వాత, మేకర్స్ ఈరోజు అద్భుతమైన టీజర్‌ను విడుదల చేశారు.టీజర్ లవ్ స్టోరీ, రూత్ లెస్ జర్నీ, ఒక పెద్ద లక్ష్యంతో నడిచే హీరోని ప్రజెంట్ చేస్తోంది. ప్రేమ, దోపిడీ ఈ రెండు ప్రధాన అంశాల చుట్టూ కథనం అద్భుతంగా వుంది. మొదటిసారిగా మాస్‌ఓరియెంటెడ్ పాత్రలో కనిపించిన అడివి శేష్ అదరగొట్టారు. క్యారెక్టర్ మల్టీ షేడ్స్‌తో ఆకట్టుకుంది. శేష్ రగ్గడ్ అవతార్‌లో కనిపించిన తీరు అదిరిపోయింది. మదనపల్లె యాసలో మాట్లాడిన తీరు ఆకట్టుకుంది.మృణాల్ ఠాకూర్ పాత్ర శేష్ పాత్రలతో పాటు ప్రయాణిస్తుంది, అమాయకత్వం, ఎమోషన్ మధ్య ఊగిసలాడుతూ కథనానికి డెప్త్‌ని జోడిస్తుంది. టీజర్ అనురాగ్ కశ్యప్, ప్రకాష్ రాజ్, అతుల్ కులకర్ణి, సునీల్‌లను కీలక పాత్రలలో పరిచయం చేస్తుంది.

# డ్యాన్సర్స్ అండ్ డ్యాన్స్ డైరెక్టర్స్ అసోసియేషన్

## ప్రెసిడెంట్‌గా శ్రీమతి.వి.వి. సుమలతాదేవి ప్రమాణస్వీకారోత్సవం



తెలుగు ఫిల్మ్ అండ్ టీవీ డ్యాన్సర్స్ అండ్ డ్యాన్స్ డైరెక్టర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్‌గా ప్రఖ్యాత కొరియో గ్రాఫర్ జానీ మాస్టర్ శ్రీమతి,వి.వి. సుమలతాదేవి ఎన్నికైన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ప్రమాణ స్వీకారోత్సవాన్ని గురువారం నాడు హైదరాబాద్ లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శ్రీశైలం యాదవ్, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో.. .జూబ్లిహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్ మాట్లాడుతూ.. ..'ఈ యూనియన్‌కు మొట్టమొదటి సారిగా మహిళ అధ్యక్షురాలిగా ఎన్నికవ్వడం ఆనందంగా ఉంది. ..శ్రీమతి. వి.వి. సుమలతా దేవి మాట్లాడుతూ..' నా ఈ విజయానికి కారణమైన ప్రతీ ఒక్కరికీ, ఓటు వేసిన ప్రతీ ఒక్కరికీ ధన్యవాదాలు. యూనియన్‌లో ఉన్న ప్రతీ ఒక్క సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇస్తున్నా" అన్నారు. ..ప్రముఖ నిర్మాత సి. కళ్యాణ్ మాట్లాడుతూ.. ..'శ్రీశైలం యాదవ్ గారే ఈ సంస్థకు మొదటగా డబ్బులు ఇచ్చారు. ..జానీ మాస్టర్ మాట్లాడుతూ.. ..మా మీద నమ్మకంతో ఓట్లు వేసి గెలిపించిన ప్రతీ ఒక్కరికీ థాంక్స్. మేం ఇచ్చిన మాట ప్రకారం గెలిచిన బాడీ సహకారంతో యూనియన్ సంక్షేమం కోసం పాటు పడతాం.

# 'డేవిడ్ రెడ్డి'అభిమానులకు ఫుల్‌మీల్స్



రాకింగ్ స్టార్ మంచుమనోజ్ నటిస్తున్న కొత్త సినిమా "డేవిడ్ రెడ్డి". ఈ సినిమాను వెల్వెట్ సోల్ మోషన్ పిక్చర్స్, ట్రూ రాడిక్స్ బ్యానర్స్ పై వెంకట్ రెడ్డి, భరత్ మోటుకూరి నిర్మిస్తున్నారు. డైరెక్టర్ హనుమ రెడ్డి యక్కంటి రూపొందిస్తున్నారు. బ్రిటీష్ కాలం నాటి బ్యాక్ డ్రాప్ తో ఇంటెన్స్ యాక్షన్ డ్రామా కథతో భారీ పాన్ ఇండియా చిత్రంగా "డేవిడ్ రెడ్డి" సినిమా తెరకెక్కనుంది. ఈ చిత్రంలో మారియా ర్యబోషప్క హీరోయిన్ గా నటిస్తోంది. తెలుగు, హిందీ, తమిళ, మలయాళ, కన్నడలో ఈ సినిమా రూపొందుతోంది. ఈ రోజు "డేవిడ్ రెడ్డి" సినిమా గ్లింప్స్ లాంఛ్ ఈవెంట్ ను హైదరాబాద్ లో గ్రాండ్ గా నిర్వహించారు. ఈ కార్యక్రమంలోప్రొడ్యూసర్ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ మనోజ్ గారిని మీరు ఎప్పుడూ చూడని విధంగా ఈ సినిమాలో చూస్తారు. ప్రొడ్యూసర్ భరత్ మోటుకూరి మాట్లాడుతూ "డేవిడ్ రెడ్డి" సినిమాను కేవలం మనోజ్ గారు మాత్రమే చేయగలరు. అనేక ఇబ్బందులు పెట్టిన తర్వాత ఒకరి నుంచి పుట్టుకొచ్చే ఆవేశమే ఈ సినిమా. ఆ ఆవేశమే బ్రిటీష్ వారి మీద తిరగబడేలా చేసింది




# వరల్డ్ టెన్నిస్ లీగ్ స్వల్ప విజయాలతో రియాల్టీ హాక్స్, ఈగల్స్

**న్యూఢిల్లీ:** ప్రపంచ టెన్నిస్ లీగ్ 2025 లో భారత్ అరంగేట్రం అద్వితీయంగా ప్రారంభమైంది. తొలి రోజు విబి రియాల్టీ హాక్స్, ఎఒఎస్ ఈగల్స్ స్వల్ప విజయాలతో ప్రారంభమయ్యాయి. మాజీ యుఎస్ ఓపెన్ ఛాంపియన్ డేనియల్ మెద్వెదేవ్, భారత దిగ్గజం రోహన్ బోపన్నతో కలిసి పురుషుల డబుల్స్‌లో విజయం సాధించాడు. ఈ ఎడిషన్‌ను విబి రియాల్టీ హాక్స్ ఆస్ట్రేలియన్ మావెరిక్స్ కైట్స్‌పై 25-21 తేడాతో స్వల్ప విజయంతో ప్రారంభించిన తర్వాత, ఎఒఎస్ ఈగల్స్ గేమ్ ఛేంజర్స్ ఫాల్కన్స్‌పై 18-16 తేడాతో విజయం సాధించి ఆ రోజు మ్యాచ్‌ను ముగించింది. తొలి సెట్ ఆడిన స్విటోలినా తన ప్రత్యేక సంకల్పాన్ని ప్రదర్శించి 2-5 తేడాతో వెనుకబడి మార్తా కోస్ట్యుక్‌ను 7-5 తేడాతో ఓడించి హాక్స్‌కు విజయోత్సాహాన్ని అందించింది. ఆ తర్వాత ఉక్రేనియన్ క్రీడాకారిణి 16 ఏళ్ల మాయాతో కలిసి కోస్ట్యుక్-అంకిత రైనాలను ఒకే స్కోరుతో ఓడించింది. పురుషుల డబుల్స్‌లో కైట్స్ జట్టు ప్రతిఘటనను ప్రదర్శించింది. నిక్ కిర్గియోస్, సురేష్ షాపోవలోవ్ మరియు భాంబ్రీలపై 6-4 తేడాతో విజయం సాధించడానికి సర్వింగ్ మాస్టర్‌క్లాస్ ప్రదర్శించారు. సింగిల్స్‌లో షాపోవలోవ్ విజయాన్ని సాధించాడు. సురేష్‌ను 7-5 తేడాతో తన జట్టును ముందంజలో ఉంచాడు. ఈగల్స్, గేమ్ ఛేంజర్ ఫాల్కన్స్ మధ్య రెండో మ్యాచ్‌లో రోహన్ బోపన్న, సుమిత్ నాగల్ మధ్య పోరాటం హైలైట్‌గా నిలిచింది. నాగల్-పౌలా బడోసా మిక్స్‌డ్ డబుల్స్ సెట్‌ను 6-1 తేడాతో గెలుచుకోగా, బోపన్న 6-2 తేడాతో అద్భుతమైన డబుల్స్ పోరులో విజయం సాధించాడు.

# వరల్డ్ టూర్ ఫైనల్స్‌లో గెలిచిన సాయిరాజ్, శెట్టి



**న్యూఢిల్లీ:** వరల్డ్ టూర్ 2025 ఫైనల్స్‌లో పురుషుల డబుల్స్ మ్యాచ్ గెలిచిన తొలి భారతీయ జంటగా సాత్విక్ సాయిరాజ్ రాంకిరెడ్డి-చిరాగ్ శెట్టి నిలిచారు. చైనాలో జరిగిన ఫైనల్స్‌లో భారత ఏస్ పురుషుల డబుల్స్ జోడీ సాయిరాజ్, శెట్టి విజయంతో తమ ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ జంట మూడు గేమ్‌ల హోరాహోరీ పోరులో స్వదేశీ ఫేవరెట్‌లు మరియు పారిస్ ఒలింపిక్ రజత పతక విజేతలు లియాంగ్ వీ కెంగ్-చాంగ్ వాంగ్ జోడీని 12-21, 22-20, 21-14 తేడాతో ఓడించారు. ఒక గేమ్ వెనుకబడి ఉన్నప్పటికీ పోరాడుతూ, సాయిరాజ్, శెట్టి చివరి గేమ్‌లో కొన్ని అద్భుతమైన అటాకింగ్ షాట్‌లను ప్రదర్శించి, వారి 11వ మ్యాచ్‌లో లియాంగ్‌వాంగ్‌పై వారి నాలుగో విజయాన్ని నమోదు చేశారు. తొలి గేమ్‌లో చైనా జంట ఫ్లాట్ ఎక్స్ఛేంజ్‌లతో తలపడటంతో భారత్ జోడీ మ్యాచ్‌ను పేలవంగా ప్రారంభించింది. మొదటి గేమ్‌ను కేవలం 12 నిమిషాల్లోనే ఓడిపోయిన వారు పెద్దగా పోరాడకుండానే పోటీ లేకుండా కనిపించారు. కానీ, రెండవ గేమ్‌లో అద్భుతంగా పునరాగమనం చేసి 18-12 ఆధిక్యాన్ని సంపాదించారు. అయితే, వారు మరోసారి చైనా ద్వయం చేతిలో 19-20తో వెనుకబడ్డారు. కానీ ఆ తర్వాత, భారత జంట తమ దాడిని ప్రారంభించి లియాంగ్-వాంగ్ పై ఒత్తిడిని తెచ్చింది. దీంతో చైనా జంట పట్టు సడలడంతో ఈసారి భారత జంట దానిని పూర్తిగా ఉపయోగించుకుని టోర్నమెంట్‌కు విజయవంతమైన ఆరంభంతో ముగించింది. ఫలితంగా భారత్ జంట గ్రూప్ ఎ లో మలేషియాకు చెందిన ఆరోన్ చియా-సోహ్ వూయియిక్ ద్వయంతో కలిసి సంయుక్తంగా అగ్రస్థానంలో ఉన్నారు.

## రోల్ బాల్ వరల్డ్ కప్..

# ప్రపంచ విజేతగా భారత్

**న్యూఢిల్లీ:** రోల్ బాల్ వరల్డ్ కప్-2025లో భారత పురుషుల, మహిళల జట్లు విజేతగా నిలిచాయి. 2023లో పూణేలో జరిగిన ప్రపంచకప్‌లో కెన్యా చేతిలో ఎదురైన ఓటమికి భారత్ ప్రతీకారం తీర్చుకుంది. ఈసారి దుబాయ్ గడ్డపై భారత్ రెండు విభాగాల్లోనూ క్లీన్ స్వీప్ చేసింది. భారత మూలాలున్న ఈ క్రీడలో భారత్ జట్లు ప్రపంచ స్థాయి ఆధిపత్యాన్ని చెలాయించాయి. దుబాయ్ వేదికగా గురువారం



జరిగిన ఈ టోర్నీ ఫైనల్లో భారత పురుషుల జట్టు 11-10 తేడాతో, మహిళల జట్టు 3-2 తేడాతో కెన్యా పురుషుల, మహిళల జట్లను ఓడించాయి. ఈ గెలుపుతో ప్రపంచకప్ టైటిల్స్‌ను ముద్దాడాయి. ఆసాంతం ఉత్కంఠగా సాగిన ఫైనల్ మ్యాచ్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ కెన్యా భారత పురుషుల జట్టుకు గట్టి పోటీనిచ్చింది. ఒక దశలో భారత్ వెనుకంజలో నిలిచినప్పటికీ, పుంజుకుని ఈ విజయాన్ని కైవసం చేసుకుంది. ఇది భారత పురుషుల జట్టుకు 5వ ప్రపంచకప్ టైటిల్. మహిళలకు మూడో ప్రపంచకప్ టైటిల్. భారత పురుషుల జట్టు విజయంలో రోహన్ దాభాడే, హితేష్ సింగ్, యష్ రాశియా, హర్షల్ ఘుగే కీలక పాత్ర పోషించాడు. ఈ మెగా ఈవెంట్‌లో భారత్, కెన్యా, పోలాండ్, అర్జెంటీనా, సౌదీ అరేబియా, పాకిస్థాన్ వంటి దేశాలు పాల్గొన్నాయి. కాగా రోలా బాల్ అనేది భారత్‌లో పుట్టి వినూత్నమైన క్రీడ. బాస్కెట్‌బాల్, హ్యాండ్‌బాల్, రోలర్ స్కేటింగ్ కలిసిన ఆట. ప్రతి జట్టులో 12 మంది ఆటగాళ్ళు ఉంటారు. కానీ మైదానంలో ఒకేసారి 6 మంది మాత్రమే ఆడతారు. ఇందులో ఒక గోల్ కీపర్ ఉంటాడు.



# వేలం తర్వాత కెప్టెన్ల ఛేంజింగ్

## మూడు జట్లకు కొత్త వారికి ఛాన్స్

**న్యూఢిల్లీ:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2026 కోసం అన్ని జట్ల కెప్టెన్ల పేర్లు దాదాపు ఖరారయ్యాయి. మూడు జట్లకు కెప్టెన్లను మార్చేందుకు ఫ్రాంచైజీలు నిర్ణయించాయి. ఢిల్లీ క్యాపిటల్స్ జట్టుకు కెప్టెన్సీ మారనుంది. గత సీజన్‌లో అక్షర్ పటేల్, ఫాఫ్ డు ప్లెసిస్ సంయుక్తంగా కెప్టెన్లుగా వ్యవహరించారు. కానీ, ఈ సంవత్సరం ఫాఫ్ జట్టులో లేకపోవడంతో, అక్షర్‌ను కూడా పక్కన పెట్టే అవకాశం ఉంది. దీంతో వచ్చే సీజన్‌కు ఢిల్లీ తమ కెప్టెన్‌ను మార్చనుంది. కేఎల్ రాహుల్‌ను ఢిల్లీ క్యాపిటల్స్ కొత్త కెప్టెన్‌గా నియమించే అవకాశం ఉంది. రాజస్థాన్ రాయల్స్ వచ్చే ఏడాది కొత్త కెప్టెన్ నేతృత్వంలో ఆడనుంది. వారి రెగ్యులర్ కెప్టెన్ సంజు శాంసన్ చెన్నై సూపర్ కింగ్స్‌లో చేరాడు. అతని నిష్క్రమణతో, జట్టు రియాన్ పరాగ్‌ను పూర్తి సమయం కెప్టెన్‌గా నియమించనుంది. సన్‌రైజర్స్ హైదరాబాద్ గత సీజన్‌ను అవమానకరంగా గడిపింది. పాట్ కమ్మిన్స్ కెప్టెన్సీలో, జట్టు బ్యాటింగ్, బౌలింగ్ రెండింటిలోనూ ఇబ్బంది పడింది. అయితే భారత్ మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ హైదరాబాద్‌లోకి వస్తాడని, అతనికే కెప్టెన్సీ ఇస్తారనే చర్చ జరుగుతోంది. ముంబై ఇండియన్స్ జట్టుకు హార్దిక్ పాండ్యా కెప్టెన్‌గా వ్యవహరిస్తాడు. గత సీజన్‌లో అతని కెప్టెన్సీలో జట్టు రెండవ క్వాలిఫయర్‌కు చేరుకుంది. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుకు రజత్ పాటిదార్ కెప్టెన్‌గా వ్యవహరిస్తాడు. జట్టు 18 ఏళ్ల నిరీక్షణ తర్వాత 2025లో తన తొలి ఐపీఎల్ టైటిల్‌ను పాటిదార్ అందించాడు. భారత వన్డే, టెస్ట్ కెప్టెన్ శుభ్‌మాన్ గిల్ గుజరాత్ టైటాన్స్‌కు నాయకత్వం వహిస్తాడు. గిల్ కెప్టెన్సీలో, గుజరాత్ గత ఐపీఎల్‌లో ప్లేఆఫ్‌కు చేరుకుంది. శ్రేయాస్ అయ్యర్ కెప్టెన్సీలో పంజాబ్ కింగ్స్ దశాబ్దం తర్వాత టైటిల్‌ను చేరుకుంది. కానీ ఫైనల్‌లో బెంగుళూరు చేతిలో స్వల్ప తేడాతో ఓడిపోయింది. లక్నో సూపర్ జెయింట్స్ వికెట్ కీపర్, బ్యాట్స్‌మన్ రిషబ్ పంత్ వచ్చే ఏడాది జట్టుకు కెప్టెన్‌గా కొనసాగుతాడు. గత సీజన్‌లో రిషబ్ కెప్టెన్సీలో జట్టు ప్రదర్శన పేలవంగా ఉన్నా మరోసారి ఛాన్స్ ఇచ్చింది. చెన్నై సూపర్ కింగ్స్‌కు రుతురాజ్ గైక్వాడ్ కెప్టెన్‌గా కొనసాగుతాడు. సంజు సామ్సన్‌ను జట్టులోకి తీసుకున్నప్పటికీ, గైక్వాడ్ కెప్టెన్సీలో ఎల్లో ఆర్మీ అద్భుతమైన ప్రదర్శన కనబరిచింది. గత ఐపీఎల్‌లో అజింక్య రహానే కోల్‌కతా నైట్ రైడర్స్‌కు కెప్టెన్‌గా వ్యవహరించాడు. జట్టు ప్రదర్శన పేలవంగా ఉన్నా రహానే అద్భుతమైన బ్యాటింగ్ అతన్ని మళ్లీ కెప్టెన్‌గా నియమించాలని ఫ్రాంచైజీ నిర్ణయించింది.

# పోరాడుతున్న ఇంగ్లండ్

## 158 రన్స్ ఆధిక్యంలో ఆస్ట్రేలియా



**న్యూఢిల్లీ:** ఆస్ట్రేలియాతో జరుగుతున్న యాషెస్ మూడో టెస్టులో ఇంగ్లండ్ పోరాడుతోంది. ఈ ప్రతిష్టాత్మక సిరీస్‌లో ప్రస్తుతం ఆస్ట్రేలియా 158 పరుగుల ఆధిక్యంలో ఉంది. ఆడిలైట్ వేదికగా రెండో రోజు గురువారం ఆట ముగిసే సమయానికి ఇంగ్లండ్ జట్టు 8 వికెట్లు నష్టానికి 213 పరుగులు చేసింది. క్రీజులో కెప్టెన్ బెన్ స్టోక్స్ (45), జోఫ్రా అర్చర్ (30) ఉన్నారు. వీరిద్దరూ తొమ్మిదో వికెట్‌కు 45 పరుగుల అజేయ భాగస్వామ్యం నెలకొల్పారు. ఇంగ్లండ్ బ్యాటర్ల పేలవ ప్రదర్శన కొనసాగుతుండటంతో ఇంకా 158 పరుగులు వెనుకబడి ఉంది. ఇంగ్లండ్ ఇన్నింగ్స్‌లో స్టోక్స్, అర్చర్‌తో పాటు, హ్యారీ బ్రూక్ (45), బెన్ డకెట్ (29) ఫర్వాలే దనిపించారు. వైస్ కెప్టెన పోప్ (3), క్రాలీ (9), రూట్ (19) తీవ్ర నిరాశపరిచారు. ఆస్ట్రేలియా బౌలర్లలో కెప్టెన్ ప్యాట్ కమ్మిన్స్ 3 వికెట్లు, లియోన్, బోలాండ్ తలా 2 వికెట్లు, గ్రీన్ మరో వికెట్ సాధించారు. అంతకు ముందు 326/8 ఓవర్ నైట్ స్కోర్‌తో రెండో రోజు ఆటను ప్రారంభించిన ఆస్ట్రేలియా 371 పరుగులకు ఆలౌట్ అయింది. వికెట్ కీపర్ అలెక్స్ కేరీ (106) టాప్ స్కోరర్‌గా నిలవగా, ఖవాజా



(82), స్టార్క్ (54) రాణించారు. కాగా ఆస్ట్రేలియా ఇన్నింగ్స్‌లో అలెక్స్ క్యారీ బ్యాటింగ్ చేస్తుండగా, బంతి స్పష్టంగా బ్యాట్‌కు తాకినప్పటికీ స్నికోమీటర్ సాంకేతిక లోపం వల్ల స్పైక్ రాలేదు. ఇంగ్లండ్ రివ్యూ తీసుకున్నప్పటికీ స్నికోమీటర్‌లో స్పైక్ చూపించకపోవడంతో థర్డ్ అంపైర్ నాటౌట్‌గా ప్రకటించాడు. అయితే ఈ విషయంపై ఐసీసీ సాంకేతిక లోపాన్ని అంగీకరిస్తూ ఇంగ్లండ్ కోల్పోయిన రివ్యూను తిరిగి ఇచ్చింది.



## వాణిజ్యం

# ఇకపై రైల్వే స్టేషన్లలో ఫ్రీ వైఫై సేవలు

**న్యూఢిల్లీ, డిసెంబరు 18:** రైలు ప్రయాణీకులకు రైల్వే శాఖ శుభవార్త చెప్పింది. దేశవ్యాప్తంగా అన్ని రైల్వే స్టేషన్లలో ఉచిత వైఫైని అందుబాటులోకి తీసుకువచ్చింది. ఈ విషయాన్ని కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రకటించింది. ప్రయాణీకులకు మెరుగైన సౌలభ్యం. సురక్షి తమైన ప్రయాణ అనుభవాన్ని అందించేందుకు డిజిటల్, భద్రతా మౌలిక సదుపాయాలు రెండింటినీ నిరంతరం బలోపేతం చేస్తున్నామని రైల్వేమంత్రిత్వశాఖ స్పష్టం చేసింది. ఇప్పటికే ఉన్న వనరులను ఉపయోగించి, పార్టనర్‌షిప్ మోడల్‌లో రైల్వేస్టేషన్లలో వై ఫై సేవలను ప్రారంభించారు. వెయిటింగ్‌లో ప్రయాణీకులకు ఇంటర్నెట్ సదుపాయం కల్పించడం, డిజిటల్ ఇండియా ప్రచారాన్ని బలోపేతం చేయడమే దీని ఉద్దేశం.

ఈ సౌకర్యం పెద్ద సంఖ్యలో ప్రయాణీకులకు స్టేషన్‌లో టికెట్ బుకింగ్, ప్రయాణ సమాచారం, ఇతర ఆన్‌లైన్ సేవలను సులభంగా యాక్సెస్ చేయడానికి వీలు కల్పిస్తుంది.రైల్వే స్టేషన్లలో వైఫైని యాక్సెస్ చేయడానికి, ప్రయాణీకులు తమ మొబైల్ నంబర్ ద్వారా ఓటీపీని నమోదు చేయాల్సి ఉంటుందని మంత్రిత్వశాఖ స్పష్టం చేసింది. గుర్తింపు రుజువు, ఈమెయిల్ తదితర వ్యక్తిగత సమాచారం ఏమీ అవసరం లేదని స్పష్టం చేసింది. ఈ వ్యవస్థలో ప్రయాణీకుల గోప్యత, డేటా భద్రతను నిర్ధారించనున్నట్లు తెలిపింది.

# ఫ్లాట్‌గా ముగిసిన స్టాక్ మార్కెట్లు



## వరుసగా నాలుగో రోజూ నష్టాల్లోకి జారుకున్న సెన్సెక్స్.. ఐటి షేర్లు

**ముంబయి, డిసెంబరు 18:** అంతర్జాతీయంగా ప్రతికూల సంకేతాలు, అమెరికా మార్కెట్లలో నష్టాలు, ఆసియాలోని ఇతర దేశాల మార్కెట్లు కూడా నష్టాల్లోనే ఉండడం దేశీయ సూచీలకు నెగిటివ్‌గా మారింది. దీంతో దేశీయ స్టాక్ మార్కెట్లు గురువారం ట్రేడింగ్‌ను ఫ్లాట్‌గా ముగించాయి. రోజంతా తీవ్ర ఒడుదొడు కులకు లోనైన సూచీలు, చివరికి స్వల్ప నష్టాలతో సరిపెట్టుకున్నాయి. రోజంతా లాభాల్లో కదలాడిన మార్కెట్లు చివరకు నష్టాలతోనే ముగిశాయి. అంతర్జాతీయంగా ప్రతికూల సంకేతాలు, అమెరికా మార్కెట్ల లో నష్టాలు, ఆసియాలోని ఇతర దేశాల మార్కెట్లు కూడా నష్టాల్లోనే ఉండడం దేశీయ సూచీలకు నెగిటివ్‌గా మారింది. దీంతో వరుసగా నాలుగో రోజు కూడా సూచీలు నష్టాలతోనే ముగిశాయి. దీంతో సెన్సెక్స్, నిఫ్టీ స్వల్ప నష్టాలను మూటగట్టుకున్నాయి. ఐటీ షేర్లలో బలమైన కొనుగోళ్లు కనిపించినప్పటికీ.. ఆటో, మెటల్, ఫార్మా రంగాల షేర్లలో అమ్మకాల ఒత్తిడి మార్కెట్లను కిందకు లాగింది. ట్రేడింగ్ ముగిసే సమయానికి బీఎస్ఈ సెన్సెక్స్ 78 పాయింట్లు నష్టపోయి 84,482 వద్ద స్థిరపడింది. దీంతో సెన్సెక్స్ వరుసగా నాలుగో రోజు కూడా నష్టాల్లో ముగిసినట్లయింది. ఈ నాలుగు రోజుల్లో సూచీ సుమారు 785 పాయింట్లు కోల్పోయింది. మరోవైపు, ఎన్ఎస్ఈ నిఫ్టీ కేవలం 3 పాయింట్ల స్వల్ప నష్టంతో 24,815.55 వద్ద ముగిసింది. ట్రేడింగ్ సమయంలో సెన్సెక్స్ 542 పాయింట్ల పరిధిలో కదలాడింది. ఒక దశలో 84,238 కనిష్ఠ స్థాయికి పడిపోయి, ఆ తర్వాత 84,780 గరిష్ఠ స్థాయికి చేరింది. సెన్సెక్స్ షేర్లలో టీసీఎస్ దాదాపు 2 శాతం లాభపడి టాప్ గెయినర్‌గా నిలిచింది. టెక్ మహీంద్రా, ఇన్ఫోసిస్ 1.7 శాతం చొప్పున లాభపడ్డాయి. అదానీ పోర్ట్స్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, యాక్సిస్ బ్యాంక్ కూడా లాభాల్లో ముగిశాయి. మరోవైపు, సన్ ఫార్మా షేరు 2.7 శాతం నష్టపోయి టాప్ లూజర్‌గా నిలిచింది. కంపెనీకి చెందిన బస్కా ప్లాంట్‌పై యూఎస్ డ్రగ్ రెగ్యులేటర్ ప్రతికూల నివేదిక ఇవ్వడం ఇందుకు కారణమైంది. టాటా స్టీల్, పవర్ గ్రిడ్, ఏషియన్ పెయింట్స్, ఎల్ టీ, ఎన్టీపీసీ షేర్లు కూడా నష్టపోయాయి. రంగాల వారీగా చూస్తే ఐటీ ఇండెక్స్ 1 శాతానికి పైగా లాభపడగా, పవర్ సెక్టార్ 1 శాతం, ఆటో రంగం 0.5 శాతం నష్టపోయాయి. ఇక అమెరికా ద్రవ్యోల్బణం, నిరుద్యోగ గణాంకాలు, ఇతర అంతర్జాతీయ కేంద్ర బ్యాంకుల వడ్డీ రేట్ల నిర్ణయాల కోసం మదుపరులు వేచి చూస్తున్నారని విశ్లేషకులు తెలిపారు. నిఫ్టీకి 25,700 వద్ద మద్దతు, 25,900 వద్ద నిరోధం ఉందని అంచనా వేస్తున్నారు.




# ఆర్‌బిఐ రెపోరేటు తగ్గింపు

## వడ్డీ రేట్లు తగ్గించిన కెనరా బ్యాంక్

## ఎఫ్‌డీపైనా కొత్త వడ్డీ రేట్లు

## అమల్లోకి వచ్చిన సవరణ రేట్లు

**ముంబై, డిసెంబరు 18:** ఆర్‌బిఐ రెపోరేటు తగ్గించిన నేపథ్యంలో ఆయా బ్యాంకులు వడ్డీ రేట్లు తగ్గిసున్నాయి. ఇదే సమయంలో పిక్స్‌డ్ డిపాజిట్లపైనా వడ్డీ రేట్లను సవరిస్తున్నాయి. ఇప్పటికే ఎస్‌బిఐ, ఐడిబిఐ బ్యాంకులు వడ్డీ రేట్లను సవరించగా, తాజాగే కెనరా బ్యాంకు కూడా కీలక రుణ రేట్లు సహా ఫిక్స్‌డ్ డిపాజిట్ వడ్డీ రేట్లను సవరించింది. దీంతో ఈ ఆర్‌ఎల్‌ఎల్‌ఆర్ లింక్డ్ లోన్లపై వడ్డీ రేట్లు తగ్గుతాయి. కొత్తగా లోన్లు తీసుకునే వారికి తక్కువ వడ్డీకే లోన్లు వస్తాయి. ఇంకా ఫ్లోటింగ్ రేటుపై గతంలో లోన్ తీసుకున్న వారికి లోన్ ఈఎంఐ తగ్గుతుంది లేదా టెన్యూర్ తగ్గించుకోవచ్చు. ఇక ఫిక్స్‌డ్ డిపాజిట్లపై వడ్డీ రేట్లు తగ్గితే.. గతంలో టెన్యూర్ల కంటే ఇప్పుడు రాబడి తక్కువగా వస్తుంది.

కెనరా బ్యాంకులో ఇప్పుడు ఆర్‌ఎల్‌ఎల్‌ఆర్ 25 బేసిస్ పాయింట్లు తగ్గించింది. ఆర్బీఐ తగ్గించినట్లుగానే పూర్తి స్థాయిలో 25 బేసిస్ పాయింట్ల కోత విధించింది. దీంతో గతంలో ఇది 8.25 శాతంగా ఉండగా.. ఇప్పుడు 8 శాతానికి చేరింది. ఈ కొత్త రుణ రేట్లు 2025, డిసెంబర్ 12 నుంచే అమల్లోకి వచ్చాయి. అయితే బ్యాంక్.. మార్జినల్ కాస్ట్ ఆఫ్ ఫండ్స్ బేస్డ్ లెండింగ్ రేట్లను (ఆర్‌ఎల్‌ఎల్‌ఆర్) మార్చలేదు. ఎంసీఎల్‌ఆర్ విషయానికి వస్తే ఓవర్‌నైట్ ఎంసీఎల్‌ఆర్ 7.90 శాతంగా ఉండగా.. ఒక నెల, 3 నెలల ఎంసీఎల్‌ఆర్ వరుసగా 7.95, 8.15 శాతంగా ఉంది. 6 నెలల ఎంసీఎల్‌ఆర్ రేటు 8.50 శాతం, ఏడాది టెన్యూర్ ఎంసీఎల్‌ఆర్ 8.70 శాతంగా, రెండేళ్ల ఎంసీఎల్‌ఆర్ 8.85 శాతంగా ఉంది. మూడేళ్ల ఎంసీఎల్‌ఆర్ 8.90 శాతంగా ఉంది. ఇక ఫిక్స్‌డ్ డిపాజిట్ వడ్డీ రేట్ల విషయానికి వస్తే రూ.3 కోట్లకు లోబడిన డిపాజిట్ వడ్డీ రేట్లు సవరించింది. కొత్త వడ్డీ రేట్లు డిసెంబర్ 8 నుంచి అమల్లోకి వచ్చాయి. సవరించిన తర్వాత అత్యధికంగా 555 రోజుల టెన్యూర్ డిపాజిట్‌పై సాధారణ ప్రజలకు 6.15 శాతం వడ్డీ అందిస్తుంది. 444 రోజుల డిపాజిట్లపై వీరికి 6 శాతం వడ్డీ రేటు ఉంది. సీనియర్ సిటిజెన్లకు వీరి కంటే 50 బేసిస్ పాయింట్ల మేర వడ్డీ అధికంగా వస్తుంది. ఇక్కడ అంతకుముందుతో పోలిస్తే వడ్డీ రేట్లు తగ్గాయి. గతంలో 444 రోజుల ఎఫ్‌డీపైనే వడ్డీ ఎక్కువగా ఉండేది.

# కష్టకాలం ముగిసింది..: ఇండిగో సిఇఒ పీటర్ ఎల్బర్స్

**కోల్‌కతా, డిసెంబరు 18:** దేశీయ విమానయాన సంస్థ ఇండిగో కార్యకలాపాలు తిరిగి సాధారణ స్థితికి చేరుకున్నాయని, సంస్థ ఎదుర్కొన్న కష్టకాలం ముగిసిందని ఆ సంస్థ సిఇఒ పీటర్ ఎల్బర్స్ గురువారం ప్రకటించారు. ప్రస్తుతం రోజుకు 2,200 విమాన సర్వీసులను పునరుద్ధరించినట్లు ఆయన వెల్లడించారు. ఈ మేరకు ఓ వీడియోను సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ఇటీవల విమాన సర్వీసుల్లో ఏర్పడిన అంతరాయాల నుంచి సంస్థ పూర్తిగా కోలుకుందని స్పష్టం చేశారు. ఈ క్లిష్ట సమయంలో ఇండిగో బృందాలు ఐక్యంగా నిలిచి, కార్యకలాపాలను తిరిగి గాడిలో పెట్టేందుకు ఎంతో కృషి చేశాయని పీటర్ ఎల్బర్స్ ప్రశంసించారు. పైలట్లు, క్యాబిన్ సిబ్బంది, ఎయిర్‌పోర్ట్ సిబ్బంది, కస్టమర్ సర్వీస్ విభాగంతో పాటు ప్రతి ఒక్కరికీ ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఇంత తక్కువ సమయంలో సమస్యను అధిగమించడం తమ బృంద స్ఫూర్తికి నిదర్శనమని అన్నారు.




Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.